www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 25-11-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 1.02 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తర రా. 1.24 తదుపరి హస్త; వర్జ్యం: ఉ.6.24-8.12; దుర్ముహూర్తం: మ.12.24-1.08, మ.2.37-3.21; అమృతఘడియలు: సా.5.15-7.04; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 5.34

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పేజీలు: 14 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 237 | వరంగల్




పంత్‌కు కాసుల పంట

- టీమ్ ఇండియా వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్‌కు రూ.27 కోట్లు
- ఐపీఎల్ మెగా వేలంలో రికార్డు ధరతో లఖ్‌నవూ సొంతం
- రూ.26.75 కోట్లకు శ్రేయాస్‌ను దక్కించుకున్న పంజాబ్ కింగ్స్
- వెంకటేశ్ అయ్యర్‌కు 23.75 కోట్లు, అర్ష్‌దీప్, చహల్‌కు 18 కోట్లు
- రూ.12.25 కోట్లతో గుజరాత్‌కు పేసర్ సిరాజ్.. నేడూ వేలం

11

పెర్త్ టెస్ట్‌పై భారత్ పట్టు
సెంచరీలతో చెలరేగిన జైశ్వాల్, విరాట్ కోహ్లీ
బుమ్రా దెబ్బకు ఆసీస్ కుదేలు.. గెలుపు మనదే!



మలేరియాకు దోమకాటే మందు!

మలేరియా కారక పరాన్నజీవుల్లో జన్యు మార్పిడి
వాటిని దోమల శరీరాల్లోకి ప్రవేశపెట్టి ప్రయోగాలు
అవి కుట్టినవారి శరీరంలో యాంటీబాడీల ఉత్పత్తి
లండన్ ఇమ్యూనాలజీ శాస్త్రజ్ఞుల యత్నం సఫలం

లండన్: దోమ కుడితే మలేరియా వస్తుంది! ఇది మనందరికీ తెలిసిందే!! అదే మలేరియాకు చెక్ పెట్టే టీకాను దోమ కాటు ద్వారా ఇస్తే? 'లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్' శాస్త్రజ్ఞులకు వచ్చిన వినూత్న ఆలోచన ఇది! ఎనాఫిలిస్ దోమ కుట్టినప్పుడు

మిగతా 2వ పేజీలో...



జీపీఎస్‌ను నమ్మితే జీవితమే గల్లంతు

వరదలకు కొట్టుకుపోయిన వంతెన.. జీపీఎస్‌లో అప్‌డేట్ కాని వైనం
అసంపూర్తిగా మిగిలిన వారధిపై నుంచి నదిలో పడిపోయిన కారు
యూపీలో ఘటన.. వాహనంలోని ముగ్గురూ అక్కడికక్కడే మృతి

2

ఇన్సులిన్ ఇంజెక్షన్లకు ఈ మాత్రతో చెల్లు!

- సూక్ష్మ సూదుల అవసరం లేకుండానే కడుపు గోడల్లోకి మందు ప్రవేశపెట్టే గోలీ
- స్క్విడ్ చేపలు కదిలే తీరు ఆధారంగా అభివృద్ధి చేసిన ఎంఐటీ శాస్త్రవేత్తలు
- మార్కెట్లోకొస్తే మధుమేహులకు ఊరట!





9 రోజుల వేడుక

డిసెంబరు 1 నుంచి 9 వరకు.. రాష్ట్రమంతా ప్రజాపాలన విజయోత్సవాలు

ఏడాది పాలన సందర్భంగా సర్కారు సంబరాలు
పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
పెద్దపల్లిలో యువతతో సీఎం రేవంత్‌రెడ్డి సభ
గ్రూప్-4 అభ్యర్థులకు నియామక పత్రాలు
26 నియోజకవర్గాల్లో గురుకులాలకు శ్రీకారం
గోషామహల్లో ఉస్మానియా ఆస్పత్రికి భూమిపూజ
కేబీఆర్ పార్కు చుట్టూ కూడళ్ల అభివృద్ధికీ..
దామరచర్లలో విద్యుత్తు కేంద్రం ప్రారంభం



హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ వ్యాప్తంగా డిసెంబరు 1 నుంచి 9 వరకు ఘనంగా వేడుకలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఉత్సవాల్లో భాగంగా కీలకమైన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 9 రోజుల పాటు జరిగే సంబరాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కీలక భూమికగా ఉండేలా కార్యాచరణను రూపొందిస్తోంది. ఈ మేరకు శాఖలవారీగా ఒకటో తేదీ నుంచి వరుసగా నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో సమీకృత గురుకుల పాఠశాల సముదాయాల భవనాలకు భూమి పూజ నిర్వహిస్తారు. ఇప్పటికే 28 నియోజకవర్గాల్లో ఈ భవనాల పనులు మొదలయ్యాయి. మరో 26 నియోజకవర్గాల పరిధిలో సమీకృత గురుకులాలను ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసింది. ప్రజాపాలన విజయోత్సవాల్లో వీటికి శంకుస్థాపన చేయనున్నారు. ఒకటో తేదీ నుంచి 7 వరకు అన్ని గ్రామాల్లో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలను నిర్వహిస్తుంది. డిసెంబరు 4న పెద్దపల్లిలో యువతతో విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. గ్రూప్-4 ఉద్యోగాలు సాధించిన వారికి ఈ సభలో నియామకపత్రాలను అందజేయనున్నారు. వైద్య ఆరోగ్య శాఖ

మిగతా 13వ పేజీలో...



నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

ప్రజా విజయోత్సవాలపై అధిష్ఠానంతో చర్చ
మంత్రివర్గ విస్తరణపైనా..
తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణకు సోనియా, రాహుల్‌కు ఆహ్వానం

13



రాళ్లు రువ్విన ఆందోళనకారులపై కాల్పులు జరుపుతున్న పోలీసులు

జామా మసీదు సర్వేలో ఉద్రిక్తత

రాళ్లు రువ్విన ఆందోళనకారులు
ఎయిర్ పిస్టళ్లతో దుండగుల కాల్పులు
బాష్పవాయు ప్రయోగం.. లాఠీచార్జి
పలువురు పోలీసులకు గాయాలు
ముగ్గురు ఆందోళనకారుల మృతి
ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో ఘటన
అక్కడ హరిహర దేవాలయం ఉండేది..
కోర్టులో పిటిషన్.. సర్వేకు జడ్జి ఆదేశాలు

లఖ్‌నవూ, నవంబరు 24: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో షాహీ జామా మసీదు సర్వే సందర్భంగా ఆదివారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో పోలీసులు బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. ఈ ఘటనల్లో ముగ్గురు ఆందోళనకారులు మృతిచెందగా.. 30 మంది పోలీసులు గాయపడ్డారు. షాహీ జామా మసీదు ప్రాంతంలో హరిహర ఆలయం ఉండేదని పేర్కొంటూ సుప్రీంకోర్టు న్యాయవాది విష్ణుశంకర్ జైన్(జ్ఞానవాపి కేసులో హిందువుల తరఫు లాయర్) స్థానిక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1529లో ఆలయాన్ని కూల్చిన మొఘల్ చక్రవర్తి బాబర్.. ఇక్కడ షాహీ జామా మసీదును నిర్మించినట్లు కోర్టుకు వెల్లడించారు. మొఘల్ కాలం నాటి పుస్తకాలు-- 'బాబర్ నామా', 'అయిన-ఇ-అక్బరీ'ను ఆధారాలుగా చూపించారు. ఈ కేసులో

మిగతా 2వ పేజీలో...

రెవెన్యూ దస్త్రాలు శిథిలావస్థలో!

అటకెక్కిన డిజిటైజేషన్.. పట్టించుకోని అధికారులు
రికార్డుల ఆధునీకీకరణకు కేంద్రం ప్రత్యేక కార్యక్రమం
వ్యయం భరించటానికీ సిద్ధం.. 2014లోనే రూ.83 కోట్లు
బీఆర్ఎస్ హయాంలో సర్వేకు ఉన్నతాధికారుల యత్నాలు
సీఎంవోకు ప్రతిపాదనలు.. ముందడుగు పడని వైనం
వందేళ్ల నాటి భూ సర్వే కాగితాలే నేటికీ దిక్కు



పక్క ఫొటోలోని కాగితాల ముక్కలను చూస్తే ఏమనిపిస్తుంది.. చిత్తు కాగితాలను తగలబెడితే మిగిలిపోయిన అవశేషాల్లా లేవూ?.. కానీ, ఇవి చిత్తు కాగితాలూ కావు.. వాటిని తగలబెట్టనూ లేదు. ఇవి హయత్‌నగర్ మండలం బండరావిర్యాల్ భూములకు చెందిన రెవెన్యూ రికార్డులు. రాష్ట్రంలో కీలకమైన భూ దస్త్రాలు ఏ స్థితిలో ఉన్నాయో.. ఈ ఫొటోనే ఓ నిదర్శనం.

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ శాఖలో కీలకమైన భూ దస్త్రాలు అనేకం శిథిలమయ్యాయి. ఇంకా ఆ దశకు చేరుకోనివి శిథిలమయ్యే ప్రక్రియలో ఉన్నాయి. సంరక్షించాల్సిన అధికారులు వాటిని గాలికి వదిలేశారు. భూముల రికార్డులను డిజిటలైజ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినా దాని అమలు కాగితాలకే పరిమితమైంది. రాష్ట్రంలో దాదాపుగా 1.67 కోట్ల సర్వే నంబర్లు ఉన్నాయి. భూ వివాదాల్లో, వాటికి సంబంధించిన న్యాయ విచారణల్లో రెవెన్యూ రికార్డులే కీలకం. కానీ, వాటి నిర్వహణ గందరగోళంగా మారింది. వాస్తవానికి, భూముల దస్త్రాలను డిజిటలీకరించే ప్రక్రియను కేంద్రం ప్రభుత్వం 2008లోనే ప్రారంభించింది. దీని కోసం 'జాతీయ భూ రికార్డుల ఆధునికీకరణ కార్యక్రమం' (ఎన్ఎల్ఆర్ఎంపీ) అనే ప్రాజెక్టుకు ఆ ఏడాది ఆగస్టు 21వ తేదీన నాటి కేంద్ర క్యాబినెట్ ఆమోదం

మిగతా 12వ పేజీలో...



నేడే కొలువుదీరనున్న 'మహా' సర్కారు

సీఎం ఎవరనేదానిపై సస్పెన్స్.. ఇద్దరికి ఉప ముఖ్యమంత్రి పదవి
బీజేపీకి 22-24, సేనకు 10-12.. అజిత్ వర్గానికి 8-10 బెర్త్‌లు
గవర్నర్‌ను కలిసిన సోరెన్.. ఝార్ఖండ్‌లో 28న ప్రమాణ స్వీకారం

ముంబై, నవంబరు 24: మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం సోమవారం కొలువుదీరనుంది.! రాష్ట్ర శాసన సభ ప్రస్తుత కాలపరిమితి మంగళవారంతో ముగియనుంది. దాంతో సోమవారమే కొత్త సర్కారును ఏర్పాటు చేయడం అనివార్యమైంది. దీంతో.. సోమవారం ముఖ్యమంత్రి, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు, ఆరు లేదా ఏడుగురు మంత్రులు ప్రమాణస్వీకారం చేయవచ్చని తెలుస్తోంది. మంత్రివర్గాన్ని మొత్తంగా ప్రకటించకున్నా.. కీలక శాఖలకు ఆరేడు మందితో ప్రమాణ స్వీకారం చేయించే సూచనలున్నాయని, దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. కాగా, కొత్త ముఖ్యమంత్రి ఎవరనేదానిపైనా మహాయుతి కూటమిలో చర్చలు, సంప్రదింపులు

మిగతా 2వ పేజీలో...

పార్లమెంటు ముందుకు



16 బిల్లులు!

వీటిలో వక్ఫ్(సవరణ) కూడా..
జమిలి బిల్లునూ చేర్చే అవకాశం
నేటి నుంచి శీతాకాల సమావేశాలు
బీజేపీలో 'మహా' ఉత్సాహం
కాంగ్రెస్‌కు అదానీ అస్త్రం!
నిలదీసేందుకు విపక్షాల కసరత్తు
మణిపూర్‌పై చర్చకు డిమాండ్
వాయు కాలుష్యం ముప్పుపైనా..
అఖిలపక్ష సమావేశానికి 30 పార్టీల నాయకులు హాజరు



అఖిలపక్ష సమావేశానికి వస్తున్న కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, రిజిజు

న్యూఢిల్లీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 16 బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్రం కసరత్తు చేసింది. అందులో వక్ఫ్ (సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ(సవరణ) సహా కీలక బిల్లులు ఉన్నాయి. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో కేంద్రం ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఉభయ సభల్లోని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశమయ్యారు. ఈ భేటీకి రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. ఆ 16 బిల్లులకు

మిగతా 2వ పేజీలో...

వణికిస్తున్న వాయు కాలుష్యం!

హైదరాబాద్‌లో ప్రమాదకర స్థాయిలకు గాలి నాణ్యత

చలి, పొగమంచు, ధూళితో సమస్యలు
సనత్‌నగర్‌లో 311కు పీఎం 2.5 కణాలు
ఈ నెలలో 8సార్లు 150.. అంతకు మించి
వాయుకాలుష్యంతో ఆరోగ్యంపై ప్రభావం
చిన్నారులు, వృద్ధుల్లో శ్వాసకోశ వ్యాధులు



హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్ నగరాన్ని వాయు కాలుష్య బూచి వణికిస్తోంది. పెరుగుతున్న చలి, పొగమంచు, కాలుష్యంతో గాలి నాణ్యత పడిపోతూ డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. సనత్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 311కు పడిపోయింది. గాలిలో దుమ్ము, ధూళి కణాలు పెరగడంతో బొల్లారం, హెచ్‌సీయూ, ఇక్రిశాట్, పాశమైలారం వంటి ప్రాంతాల్లో ఏక్యూఐ ప్రమాదకరస్థాయిలకు చేరుతోంది. ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో గాలిలో నాణ్యత ప్రమాణాలు పడిపోతుండటం, పెరుగుతున్న కాలుష్యం

మిగతా 12వ పేజీలో...

ధర్మబద్ధమైన విజ్ఞానం కావాలి

ధర్మంతోనే అస్తిత్వం
ఏకత్వ భావన అవసరం
ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్
కొన్ని శక్తులు అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోతున్నాయి: కిషన్‌రెడ్డి
ముగిసిన లోక్‌మంథన్ భాగ్యనగర్

14



భాగవత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కిషన్‌రెడ్డి

జిల్లా కోర్టుల వరకూ తెలుగు భాష!

వాడుక భాషగా ప్రవేశపెడితే మనుగడ
తల్లి ప్రేమ.. ఆమె ఉన్నప్పుడు తెలియదు
భాషను కోల్పోయినప్పుడూ అంతే..
మనకంటే ప్రవాసీల తెలుగు మెరుగు
సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నర్సింహ

14



39 డ్రగ్స్ కేసుల్లో.. 82 మందికి జైలు శిక్షలు

13

17 మందికి గరిష్ఠంగా 20 ఏళ్ల ఖైదు
అరెస్టయితే బయటపడడం కష్టమే!
ఏపీలోని లంబసింగి నుంచి గంజాయి
అడవిలో 20 కి.మీ. నడిచి తరలింపు

జగన్ ఆ 'మర్మ'మేంటి?

2021 డిసెంబరు 1న విద్యుత్ ఒప్పందం
ఆగస్టు, సెప్టెంబరు, నవంబరులో అదానీతో భేటీ
ఒప్పందంతో లింకు లేకుంటే ఎందుకు కలిశారు?
సెకీతో అనుబంధ ఒప్పందం మాటేంటి?
అదానీ గురించి ఈఆర్‌సీ ప్రస్తావన
అమెరికా కేసుపై భారత సంస్థలతోనూ దర్యాప్తు..
సుప్రీంలో పిటిషన్.. నేడు బెంచ్ ముందు ప్రస్తావన

12



నేడే కొలువుదీరనున్న 'మహా' సర్కారు?

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్నాయి. అందరి దృష్టి ఫడణవీస్ పైనే ఉంది. ఆరెస్సెస్ కూడా ఫడణవీస్ వైపే మొగ్గు చూపుతోంది. మరోవైపు.. శివసేన(శిందే వర్గం) నాయకులు శిందేకు.. ఎన్సీపీ(అజిత్‌వర్గం) నేతలు అజిత్‌పవార్‌కు సీఎం పదవి ఇవ్వాలని కోరుతున్నారు. అయితే.. సీఎంగా ఎవరిని నియమించాలనేదానిపై సంప్రదింపుల వేదిక ఇప్పుడు ముంబై నుంచి ఢిల్లీకి మారిపోయింది. కూటమి అగ్రనేతలు ఢిల్లీకి పయనమయ్యారు. బీజేపీ అధిష్ఠానం.. సోమవారం ఉదయానికల్లా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశాలున్నాయి. ఇదిలా ఉండగా, విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మహారాష్ట్రలో ఒక ముఖ్యమంత్రి, ఇద్దరు ఉపముఖ్యమంత్రులు ఉంటారు. వీరితో పాటు తొలుత ఆరు లేదా ఏడుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. తదుపరి విస్తరణలో.. బీజేపీకి చెందిన 22-24 మంది ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లో చోటుదక్కుతుందని సమాచారం. శిందే వర్గానికి 10-12, అజిత్ వర్గానికి 8-10 మంత్రి పదవులు దక్కుతాయని తెలుస్తోంది.

'మహా' అసెంబ్లీకి 21 మంది మహిళలు

ముంబై, నవంబరు 24: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 21 మంది మహిళా అభ్యర్థులు విజయం సాధించారు. అత్యధికంగా బీజేపీ నుంచి 14 మంది మహిళా అభ్యర్థులు గెలవగా, వీరిలో 10 మంది తిరిగి ఎన్నికయిన వారు కావడం గమనార్హం. శివసేన(ఏక్‌నాథ్ వర్గం) నుంచి ఇద్దరు, ఎన్సీపీ(అజిత్ వర్గం) నుంచి నలుగురు మహిళా అభ్యర్థులు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి ఒక్క మహిళా అభ్యర్థి గెలపొందారు. కాగా, 'మహా' ఎన్నికల్లో ఈసారి చిన్న పార్టీలు ఎంత మాత్రం ప్రభావం చూపలేకపోయాయి. సమాజ్‌వాదీ పార్టీ రెండు సీట్లు, ఏఐఎంఐఎం ఒక సీటు గెలుకోగా, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన, వంచిత్ బహుజన్ అఘాడీ, బీఎస్పీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయాయి.

ఏడు రాష్ట్రాల్లో ప్రతిపక్షం నిల్!

న్యూఢిల్లీ, నవంబరు 24: ఏ రాజకీయ పార్టీకి ప్రతిపక్ష హోదా లేని అసెంబ్లీల జాబితాలో తాజాగా మహారాష్ట్ర చేరింది. ఇప్పటికే ఇలా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, గుజరాత్, మణిపూర్, నాగాలాండ్, సిక్కిం ఉన్నాయి. ఇప్పుడు మహారాష్ట్ర చేరడంతో వీటి సంఖ్య ఏడుకు చేరింది. అసెంబ్లీలో ఒకపార్టీకి ప్రతిపక్ష హోదా దక్కాలంటే ఆ రాష్ట్ర శాసనసభ స్థానాల్లో పది శాతం సీట్లను సంపాదించుకోవాల్సి ఉంటుంది. శనివారం వెలువడిన మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాల్లో.. మహావికాస్ అఘాడీలోని ఏ పార్టీకి ప్రతిపక్ష హోదా దక్కేలా సీట్లు రాలేదు. ఈ కూటమిలోని శివసేన (యూబీటీ)కు 20 సీట్లు, కాంగ్రెస్‌కు 16, ఎన్సీపీ (శరద్ పవార్)కి 10 స్థానాలు వచ్చాయి. అసెంబ్లీలోని మొత్తం 288 సీట్లలో పది శాతం అంటే 29 సీట్లు గెలుచుకోవాల్సి ఉంటుంది. ఇన్ని సీట్లు రాలేదు కాబట్టి ఏ పార్టీకి ప్రతిపక్ష హోదా దక్కే చాన్స్ లేదు.

28న హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం

రాంచీ, నవంబరు 24: ఝార్ఖండ్ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం నేత హేమంత్ సోరెన్ ఈ నెల 28న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం ఆయన తన కారులో రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ సంతోష్ కుమార్ గాంగ్వార్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కూటమి భాగస్వామ్య పక్షాల మద్దతు లేఖను అందజేశారు. దాంతో ప్రభుత్వ ఏర్పాటుకు సోరెన్‌ను గవర్నర్ ఆహ్వానించారు. అప్పటి వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని కోరారు. ఝార్ఖండ్ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. శనివారం వెల్లడైన ఫలితాల్లో 81 స్థానాలకు ఈ కూటమి ఏకంగా 56 స్థానాల్లో విజయం సాధించింది. జేఎంఎం సొంతంగా 34 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 4, సీపీఐ(ఎంఎల్) 2 స్థానాల్లో విజయం సాధించింది. ఎన్డీయే కూటమి 24 స్థానాలకు పరిమితమైంది. గవర్నర్‌తో భేటీకి ముందు సోరెన్ నివాసంలో ఇండియా కూటమి నేతలు సమావేశమయ్యారు. సోరెన్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు.

భారత ఎన్నికల ప్రక్రియపై మస్క్ ప్రశంసలు

వాషింగ్టన్, నవంబరు24: భారత ఎన్నికల ప్రక్రియపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పొగడ్తలు కురిపించారు. 64 కోట్ల మంది ఓట్లను ఒక్కరోజులో లెక్కించే వేగాన్ని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో నవంబరు 5న జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి కాలిఫోర్నియాలో ఇంకా ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోందని గుర్తు చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో మెయిల్ ద్వారా కూడా ఓటు వేసే అవకాశం ఉండటంతో ఒక్క కాలిఫోర్నియాలోనే లక్షల మంది ఈ విధానం ఎంచుకున్నారు. ఇంకా 3 లక్షల ఓట్లను లెక్కించాల్సి ఉంది. భారత్‌లో ఈ ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

'సుప్రీం'కు అదానీ వ్యవహారం

న్యూఢిల్లీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో అదానీ లంచాల వ్యవహారం భారత సర్వోన్నత న్యాయస్థానానికి చేరింది. అదానీపై అమెరికా న్యాయశాఖ మోపిన అభియోగాలపై భారతీయ దర్యాప్తు సంస్థలతో కూడా సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై తక్షణ విచారణ కోరుతూ ధర్మాసనం ఎదుట ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారు. భారత్‌లో సౌర విద్యుత్ ఒప్పందాల కోసం అదానీ గ్రూపు రూ.2,029 కోట్లు లంచం ఇవ్వజూపిన ఆరోపణలపై ఆ గ్రూపు అధినేత గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా మొత్తం 8 మందిపై అభియోగాలు నమోదైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తివారీ కేసుకు ప్రాధాన్యం ఏర్పడింది. హిండెన్‌బర్గ్ రిపోర్టుపై దర్యాప్తు కోరుతూ గతంలోనూ ఆయన పిటిషన్ వేశారు.

అమెరికా జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్‌గా జై భట్టాచార్య!



వాషింగ్టన్ డీసీ, నవంబరు 24: అమెరికా జాతీయ ఆరోగ్య సంస్థ.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్(ఎన్ఐహెచ్) డైరెక్టర్ పదవి భారతీయ మూలాలున్న జై భట్టాచార్యకు దక్కడం దాదాపుగా ఖాయమైంది. బయో మెడికల్ విభాగంలో అమెరికా చేసే పరిశోధనలన్నీ 50 బిలియన్ డాలర్ల విలువైన ఎన్ఐహెచ్ ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి. ఎన్ఐహెచ్ డైరెక్టర్ పదవి విషయంలో ముగ్గురి పేర్లు ప్రముఖంగా వినిపిస్తుండగా దేశ అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మాత్రం భట్టాచర్యకు మొగ్గు చూపుతున్నారని వాషింగ్టన్ పోస్ట్ ఓ కథనాన్ని ప్రచురించింది. 1968లో కోల్‌కతాలో జన్మించిన జై భట్టాచార్య.. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో ఎండీ, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా, నేషనల్ బ్యూరో ఎకనమిక్ రీసెర్చ్‌లో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేస్తున్నారు.

నలుదిక్కులా మహాయుతి

మహారాష్ట్రలోని ప్రతి ప్రాంతంలో అధికార కూటమి ప్రభంజనం

- మరాఠ్వాడా, విదర్భల్లో చాపకింద నీరులా సంఘ్ ప్రచారం
- ఓబీసీలను సంఘటితం చేసిన బీజేపీ
- హిందూ ఓట్లపై సంఘ్ ప్రభావం!



ముంబై, నవంబరు 24: లోక్‌సభ ఎన్నికల్లో పరాభవాన్ని తట్టుకొని నిలబడిన మహాయుతి కూటమి.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ప్రాంతంలోనూ తన సత్తా చాటింది. 288 స్థానాల శాసనసభలో ఏకంగా 234 సీట్లు పొందింది. అఘాడీ 49 స్థానాల్లో మాత్రమే గెలవగా.. మిగతా సీట్లు చిన్నాచితకా పార్టీ ఖాతాల్లో చేరాయి. ఇంత భారీ విజయం ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లోనూ తన ఆధిపత్యం ప్రదర్శించింది.

మరాఠ్వాడా..

లోక్‌సభ ఎన్నికల్లో ఈ ప్రాంతంలోని 8 స్థానాలకు గాను మహాయుతి ఒక్కటే గెలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 46 సీట్లలో ఏకంగా 41 చోట్ల గెలిచింది. బీజేపీ ఓబీసీలను సంఘటితం చేయడం.. ఆరెస్సెస్‌కు ఈ ప్రాంతంలో మంచి పరపతి ఉండడం దీనికి ప్రధాన కారణం. మరాఠా రిజర్వేషన్ ఉద్యమ నేత మనోజ్ జరాంగే-పాటిల్ చివరి నిమిషంలో తన అభ్యర్థులను పోటీ నుంచి తప్పించడంతో మహాయుతి విజయానికి మార్గం సుగమమైంది. 20 చోట్ల పోటీచేసిన బీజేపీ 19, శిందే సేన 16కి గాను 13, అజిత్ ఎన్సీపీ 9కి గాను 8 స్థానాల్లో గెలవడం గమనార్హం. లోక్‌సభ ఎన్నికల సమయంలో జారంగే-పాటిల్ మహాయుతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం అఘాడీకి నాడు కలిసి వచ్చింది. మరోవైపు, లాతూర్, ఉస్మానాబాద్, నాందేడ్ జిల్లాల్లో సంఘ్ ప్రాబల్యం బలంగా ఉంది. హిందూ ఓట్లు చీలిపోకుండా చాపకింద నీరులా ప్రచారం చేసింది. రాష్ట్రం నలుమూలల నుంచీ వచ్చిన పలువురు సాధుసంతులు కూడా ఇందులో పాలుపంచుకున్నారు.

విదర్భ..

ఈ ప్రాంతంలో 62 స్థానాలకు గాను మహాయుతి 49 చోట్ల గెలిచింది. ఇందులో బీజేపీ వాటా 39. ఒకప్పుడు ఈ ప్రాంతం కాంగ్రెస్‌కు కంచుకోట. 2019లో 15 చోట్ల గెలిచిన ఈ పార్టీ ఈ సారి ఎనిమిదికే పరిమితమైంది. ఉపముఖ్యమంత్రి, బీజేపీ వ్యూహకర్త దేవేంద్ర ఫడణవీస్ నాగపూర్ నైరుతి స్థానంలో ఘన విజయం సాధించగా.. అఘాడీ సీఎం అభ్యర్థిగా భావించిన పీసీసీ అధ్యక్షుడు నానా పటోలే సకోలీ స్థానంలో కేవలం 208 ఓట్లతో అతికష్టమ్మీద నెగ్గారు.

కొంకణ్ బెల్ట్-ముంబై మెట్రోపాలిటన్..

అఘాడీ ఈ ప్రాంతంలో చావుదెబ్బ తింది. మొత్తం 39 స్థానాలకు గాను మహాయుతి 35 చోట్ల ఘనవిజయం సాధించింది. ఇక్కడ గట్టిపట్టు ఉన్న ఉద్ధవ్ సేన ఒక్క చోట మాత్రమే గెలవడం ఆ పార్టీ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రాంతంలోనూ సంఘ్ ప్రభావం బాగా ఉంది. అంతేగాక శిందే సేన అధిపతి, సీఎం ఏక్‌నాథ్ శిందేకు స్థానికంగా ఎంతో బలం, పలుకుబడి ఉండడం, చీలిక తర్వాత శివసేన కార్యకర్తల్లో అత్యధికులు ఆయనకే మద్దతివ్వడం పాలక కూటమికి కలిసివచ్చింది. పాల్ఘర్ జిల్లాలో మూడు స్థానాలకు గాను మూడు చోట్లా అఘాడీ ఓడిపోయింది.

పశ్చిమ మహారాష్ట్ర..

కాంగ్రెస్, శరద్ పవార్ ఎన్సీపీలకు ఇది పెట్టని కోట. ఈ ప్రాంతంలో 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. మహాయుతి 53 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. అఘాడీ 12 సీట్లకే పరిమితమైంది. ఈ స్థాయిలో ప్రభంజనం ఉంటుందని తాము ఊహించనే లేదని ఉపముఖ్యమంత్రి, అజిత్ ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. ఈ ప్రాంతంలోని కొల్హాపూర్ జిల్లాలో మొత్తం 10 స్థానాల్లోనూ మహాయుతే గెలిచింది.

ఉత్తర మహారాష్ట్ర..

ఈ ప్రాంతం కాంగ్రెస్‌కు కంచుకోట. కానీ ఇక్కడి 47 అసెంబ్లీ స్థానాలకు గాను 44 మహాయుతి కైవసమయ్యాయి. పీసీసీ అగ్ర నేతలు బాలాసాహెబ్ తోరట్ (సంగమనేర్), కేసీ పాడ్వీ (అక్కల్‌కువా) సైతం పరాజయం చవిచూశారు. తోరట్ 1985 నుంచి, పాడ్వీ 1990 నుంచి ఆయా స్థానాల్లో గెలుస్తూ వచ్చారు. ఇక యెవ్‌లా స్థానంలో ఒకప్పటి తన నమ్మినబంటు, అజిత్ ఎన్సీపీకి చెందిన ఛగన్ భుజబల్‌ను ఓడించడానికి శరద్ పవార్ విశ్వప్రయత్నాలు చేశారు. మరాఠా రిజర్వేషన్ ఉద్యమ నేత జరాంగే పాటిల్ కూడా ఆయన్ను టార్గెట్ చేశారు. అయినా ఈ బీసీ నేత విజయం సాధించారు. శివసేనకు ఒకప్పటి కంచుకోటయిన సింధ్‌దుర్గ్ జిల్లాలో మూడు స్థానాలనూ మహాయుతే గెలుచుకుంది. మరోవైపు, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున సరిగా ప్రచారం చేయలేదని కర్ణాటక హోం మంత్రి, మహారాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకుడు జి.పరమేశ్వర ఆదివారం ఆరోపించారు. మహారాష్ట్రలో కొన్ని చోట్ల ఈవీఎంలు హ్యాక్ అయ్యాయన్నారు.

'మహాయుతి'ని గెలిపించింది మహిళలే




కరాడ్, నవంబరు 24: మహారాష్ట్రలో 'మహాయుతి' కూటమిని గెలిపించింది మహిళలేనని శరద్ పవార్ అన్నారు. మహిళలకు నేరుగా ఆర్థిక సాయం అందించే లడ్కీ బహిన్ పథకం, పెద్ద సంఖ్యలో మహిళలు ఓటింగ్‌లో పాల్గొనడం వల్లనే బీజేపీ కూటమి విజయం సాధించిందని అభిప్రాయపడ్డారు. మతపరమైన విభజన కూడా కొంత కారణమని చెప్పారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి దారుణ ఫలితాలు ఎన్నడూ చూడలేదని అన్నారు. ఆదివారం కరాడ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ కూటమి బాగా కష్టపడిందని, ఫలితాలు మాత్రం భిన్నంగా వచ్చాయని చెప్పారు. దీనిపై పార్టీలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈవీఎంల కారణంగానే ఓడిపోయినట్టు వస్తున్న విమర్శలపై స్పందిస్తూ అధికారిక సమాచారం లేకుండా దీనిపై మాట్లాడబోనని అన్నారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి విరమిస్తారా అన్న ప్రశ్నకు జవాబిస్తూ దీనిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కొత్త నాయకత్వాన్ని తయారు చేసి ప్రజల ముందుకు వెళ్తామని అన్నారు.

మా పరాజయానికి మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ కారణం



ముంబై, నవంబరు24: మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ పరాజయానికి మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ కారణమని శివసేన(యూబీటీ) నేత సంజయ్‌రౌత్ ఆరోపించారు. 2022లో తిరుగుబాటు చేసిన శివసేన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన పిటిషన్‌లపై జస్టిస్ చంద్రచూడ్ వెంటనే నిర్ణయించలేదని రౌత్ ఆరోపించారు. దీనివల్ల పార్టీ ఫిరాయింపుదారుల్లో చట్టం అంటే భయం లేకుండా పోయిందన్నారు. చంద్రచూడ్ పేరు చరిత్రలో నల్ల అక్షరాలతో లిఖిస్తారని రౌత్ చెప్పారు. 2022లో శివసేనలో తిరుగుబాటు జరిగి ఏక్‌నాథ్ శిందే సారథ్యంలో మెజార్టీ ఎమ్మెల్యేలు వేరుకుంపటి పెట్టారు. బీజేపీతో చేతులు కలిపి మహారాష్ట్రలో అధికారం చేపట్టారు. శిందే సీఎం కూడా అయ్యారు. శిందేదే అసలైన శివసేన అని ఈసీ కూడా ప్రకటించింది.

లోకం తీరు



జీపీఎస్‌ను నమ్ముకుని ముగ్గురి మృత్యువాత!

బరేలీ(యూపీ), నవంబరు 24: ఉత్తర్‌ప్రదేశ్‌లో జీపీఎస్ నావిగేషన్ సాయంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అసంపూర్తిగా ఉన్న వంతెనపై నుంచి పడి మృత్యువాత పడ్డారు. బరేలీ, బూదాన్ జిల్లాల మధ్య శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. బాధితులు దాతాగంజ్ నుంచి ఫరీద్‌పూర్ ప్రయాణించేందుకు నావిగేషన్ మ్యాప్‌ను ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. వంతెన అసంపూర్తిగా ఉన్న విషయం తెలియకపోవడం, కారు వేగంగా ప్రయాణిస్తుండడంతో అదుపు కాక 25 అడుగుల ఎత్తు నుంచి రామ్‌గంగా నదిలో నీళ్ల లేని చోట గుంతలో పడిందని తెలిపారు. మృతులు మెయిన్‌పురికి చెందిన కౌశల్ కుమార్, ఫరుఖాబాద్‌కు చెందిన వివేక్ కుమార్, అమిత్ కుమార్‌లుగా గుర్తించారు. 2022లో వచ్చిన వరదలకు ఈ వంతెనలో సగభాగం కొట్టుకుపోయింది. ఈ విషయం జీపీఎస్‌లో అప్‌డేట్ కాలేదు.

ఏఆర్ రెహ్మాన్‌పై దుష్ప్రచారం వద్దు

- తమిళ మీడియాకు సైరాభాను వినతి

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ రెహ్మాన్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలని ఆయన సతీమణి సైరాభాను తమిళ మీడియా, యూట్యూబర్లను కోరారు. ఈ మేరకు ఆదివారం ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. 2నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న తాను చికిత్స నిమిత్తం ప్రస్తుతం ముంబైలో ఉన్నానని ఆమె వెల్లడించారు. ఏఆర్ రెహ్మాన్‌కు ఉన్న విపరీతమైన పని ఒత్తిడి వల్లే తాను ఆయనకు దూరంగా వెళ్లినట్టు వివరించారు. అద్భుతమైన వ్యక్తి, మానవతావాది అయిన రెహ్మాన్‌పై తమిళ మీడియా, యూట్యూబర్లు తప్పుడు ఆరోపణలు, విమర్శలు చేయడం సరికాదని అన్నారు. రెహ్మాన్‌ను ప్రాణం కంటే మిన్నగా విశ్వసిస్తున్నానని, ఆరాధిస్తున్నానని తెలిపారు.

జామా మసీదు సర్వేలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జామా మసీదు కమిటీ, సంభాల్ జిల్లా కలెక్టర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. జమా మసీదు కమిటీ 1991 నాటి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను, చట్టాన్ని ఉటంకిస్తూ.. 1947 నుంచి ప్రార్థన మందిరాలు ఎలా ఉన్నాయో.. అలాగే ఉంచాలనే ఆదేశాలున్నాయంటూ వాదనలను వినిపించింది. వాదోపవాదాలు, పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు.. మంగళవారం అడ్వొకేట్ కమిషనర్ సమక్షంలో మసీదు సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో.. జిల్లా యంత్రాంగం శనివారం నుంచే సర్వేకు ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం 7 గంటల తర్వాత అధికారులు ఆ మసీదు వద్దే సర్వే ప్రారంభించారు. ఈలోగా సర్వేను నిలిపివేయాలని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ పలువురు ఆందోళనకారులు మసీదు వెలుపల గుమికూడారు. అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించగా.. ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. అక్కడే ఉన్న వాహనాలకు నిప్పుపెట్టారు. "దుండగులు ఎయిర్ పిస్టళ్లతో కాల్పులు జరిపారు. రాళ్లదాడిలోనూ మరికొందరు పోలీసులు గాయపడ్డారు. మొత్తం 30 మంది పోలీసులకు గాయాలయ్యాయి" అని సంభాల్ ఎస్పీ కృష్ణకుమార్ విష్ణోయ్ వెల్లడించారు. పోలీసులు లాఠీచార్జ్ చేసి, బాష్పవాయు గోళాలను, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించారని చెప్పారు. ఈ ఘటనల్లో ముగ్గురు ఆందోళనకారులు చనిపోయారని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు మహిళలు సహా.. 10 మంది ఆందోళనకారులను అరెస్టు చేశారు. కాగా, ఈ ఘటనను ఎస్పీ చీఫ్ అఖిలేశ్ ఖండించారు. సర్వేను ఆయన తప్పుబట్టారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి కుతంత్రాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

పార్లమెంటు ముందుకు 16 బిల్లులు!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన వివరాలను అన్ని పార్టీల నేతలకు అందించారు. అయితే, మరికొన్ని బిల్లులను కూడా ప్రవేశపెట్టాలని కొందరు సభ్యులు కోరినట్టు తెలిసింది. అలాగే, కేంద్రం మరికొన్ని బిల్లులను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మహారాష్ట్ర ఎన్నికల్లో గెలుపుతో జోష్‌లో ఉన్న ఎన్డీయే జమిలి ఎన్నికలపైనా కసరత్తు చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే, ఈ సమావేశాల్లోనే ఆ బిల్లు పెడతారా? లేదా తదుపరి సమావేశాల వరకు నిరీక్షిస్తారా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అఖిలపక్ష సమావేశానికి 30 రాజకీయ పార్టీలకు చెందిన 42 మంది నేతలు హాజరయ్యారు. డిసెంబరు 20వ తేదీ వరకు సమావేశాలు జరగనున్నాయి. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 26న పార్లమెంటు సమావేశాలు జరగవని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఆ రోజున పాత పార్లమెంట్ భవనంలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.

శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని భావిస్తున్న బిల్లులు ఇవీ..

భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లు, విపత్తు నిర్వహణ(సవరణ) బిల్లు, గోవా అసెంబ్లీలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్నిర్మాణం బిల్లు, ది బిల్స్ ఆఫ్ లాడింగ్ బిల్లు, ది క్యారేజ్ ఆఫ్ గూడ్స్ బై సీ బిల్లు, రైల్వే(సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాల(సవరణ) బిల్లు, ముసల్మాన్ వక్ఫ్(రద్దు) బిల్లు, వక్ఫ్(సవరణ) బిల్లు, చమురు క్షేత్రాల(నియంత్రణ, అభివృద్ధి) సవరణ బిల్లు, బాయిలర్స్ బిల్లు, రాష్ట్రీయ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు, పంజాబ్ కోర్టుల(సవరణ) బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ఇండియన్ పోర్ట్స్ బిల్లు.

కాంగ్రెస్‌కు 'అదానీ' అస్త్రం...

అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించాలని కాంగ్రెస్ సహా విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అదానీ లంచాలపై అమెరికాలో కేసు నమోదు చేయడం విపక్షాలకు అస్త్రంగా మారింది. అలాగే మణిపూర్ హింస, ప్రాణాంతకంగా మారిన వాయు కాలుష్యం తదితర అంశాలపై అధికార పార్టీని ఇరుకున పెట్టాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. అఖిలపక్ష సమావేశంలోనూ అదానీ వ్యవహారంపై చర్చ జరగాలని కోరినట్టు కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ మీడియాకు తెలిపారు. మహారాష్ట్ర ఎన్నికలపైనా పార్లమెంట్‌లో చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఆరోపించారు.



అఖిలపక్ష భేటీ తర్వాత విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రిజిజు

బీజేపీ మరింత దూకుడే...

దేశంలోనే మినీ ఇండియా పోరుగా పిలిచిన మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ విజయాన్ని నమోదు చేసుకోవడం పార్లమెంట్ సమావేశాల ముందు బీజేపీలో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఇటీవలే హర్యానా గెలుపు, ఇప్పుడు మహారాష్ట్ర విజయం బీజేపీకి తిరుగులేని ఉత్సాహాన్ని ఇచ్చాయి. దీంతో పార్లమెంట్ సమావేశాల్లో బీజేపీ మరింత దూకుడును ప్రదర్శించే అవకాశం ఉంది. ప్రధాని మోదీ నేతృత్వంలో మరిన్ని కొత్త నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది. జమిలి ఎన్నికలపైనా ఉభయ సభల్లో చర్చ జరగనుందని సమాచారం. కాగా, వక్ఫ్ బిల్లుపై పార్లమెంట్ సంయుక్త కమిటీ ఈ నెల 29న తన నివేదికను సమర్పించే అవకాశం ఉంది. కమిటీలోని విపక్ష సభ్యులు తమకు మరి కొంత సమయం కావాలని అడిగే అవకాశం ఉంది.

రాజ్యాంగానికి 75 ఏళ్లు

రేపు పాత పార్లమెంట్ భవనంలో వేడుక

న్యూఢిల్లీ, నవంబరు 24: భారత రాజ్యాంగాన్ని ఆమోదించి మంగళవారానికి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక వేడుకను నిర్వహించనున్నట్లు మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. పాత పార్లమెంట్(సంవిధాన్ సదన్) భవనంలోని సెంట్రల్ హాల్‌లో జరగనున్న ఈ వేడుకకు రాష్ట్రపతి ముర్ము, ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు 'మేకింగ్ ఆఫ్ ది కాన్‌స్టిట్యూషన్: ఏ గ్లింప్స్', 'మేకింగ్ ఆఫ్ ది కాన్‌స్టిట్యూషన్ అండ్ ఇట్స్ గ్లోరియెస్ జర్నీ' అనే రెండు పుస్తకాలను విడుదల చేయనున్నారు. కాగా, 1949 నవంబరు 26న భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించింది.

మలేరియాకు దోమకాటే మందు!



(మొదటి పేజీ తరువాయి)

దాని శరీరంలోని "ప్లాస్మోడియం ఫాల్సిపారం" అనే మలేరియా కారక పరాన్నభుక్కులు మన శరీరంలోకి ప్రవేశించి నేరుగా కాలేయంలోకి ప్రవేశించి, ఎర్ర రక్త కణాల్లో ఇన్ఫెక్షన్‌ను కలుగజేస్తాయి. దానివల్ల మనకు బాగా జ్వరం వస్తుంది. దీన్నే మలేరియా అంటారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా 25 కోట్ల మందికిపైగా ఈ రకంగా మలేరియా బారిన పడుతున్నారు. ఎలాగూ ఆ జీవులు దోమకాటు ద్వారానే మనుషుల్లోకి ప్రవేశిస్తున్నాయి కాబట్టి.. ఆ పరాన్నజీవుల జన్యువుల్లో మార్పులు చేసి, వాటిని బలహీనపరిచి, అదే దోమ కాట్ల ద్వారా వాటిని వ్యాపింపజేస్తే మనుషుల్లో మలేరియాకు రోగనిరోధకత పెరుగుతుందని లండన్ శాస్త్రజ్ఞులు భావించారు. తమ ఆలోచనను ఆచరణలో పెట్టి ప్రయోగాలు కూడా నిర్వహించారు. ఆ ట్రయల్స్‌లో పాల్గొన్న 90 శాతం మంది.. నిజంగా మలేరియా కారక పరాన్నజీవి బారిన పడినా జ్వరం రాలేదు. ఈ నేపథ్యంలో.. మలేరియా టీకా అభివృద్ధి దిశగా ఈ ట్రయల్ పెద్ద ముందడుగు అని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ ఇమ్యూనాలజిస్ట్ జూలియస్ హాఫల్లా తెలిపారు. ఈ అధ్యయన ఫలితం 'ద న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' తాజా సంచికలో ప్రచురితమైంది. ప్రస్తుతానికి రెండు మలేరియా టీకాలు మనకు అందుబాటులో ఉన్నప్పటికీ వాటి ప్రభావం 75 శాతమే. ఆ టీకాలు కూడా ఒక్క డోసు వేయించుకుంటే చాలదు. బూస్టర్ డోసులు వేయించుకోవాల్సి ఉంటుంది. అందుకే శాస్త్రవేత్తలు వాటికి ప్రత్యామ్నాయంగా కొత్త టీకాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా లండన్ శాస్త్రజ్ఞులు మలేరియా పరాన్నజీవుల్లో రెండు రకాల జన్యుమార్పులు చేశారు. మొదటి రకం జీఏ1 కాగా.. రెండో రకం జీఏ2. వీటిలో మొదటి రకం పరాన్నజీవులు మనిషి కాలేయంలోకి ప్రవేశించిన తర్వాత దాదాపు 24 గంటల దాకా తమ సంఖ్యను పెంచుకోలేవు. రెండో రకం (జీఏ2) జీవులు కాలేయంలోకి ప్రవేశించిన ఆరు రోజుల దాకా అలాగే అచేతనంగా ఉండిపోతాయి తప్ప తమ సంఖ్యను పెంచుకోలేవు. ఆరు రోజులంటే.. వాటిపై దాడి చేసి చంపేయడానికి మన రోగ నిరోధక వ్యవస్థకు బోలెడంత సమయం దొరికినట్టు!! ట్రయల్‌లో భాగంగా 10 మందిని జీఏ1 రకం పరాన్నజీవి ఉన్న దోమతో కుట్టించారు. మరో 10 మందిని.. జీఏ2 రకం పరాన్నజీవి ఉన్న దోమతో కుట్టించారు. మూడువారాల తర్వాత.. వారికి పరీక్షలు చేయగా రెండు బృందాల వారిలోనూ మలేరియా యాంటీబాడీలు ఉన్నట్టు వెల్లడైంది. ఆ తర్వాత వారిని.. నిజమైన మలేరియా కారక జీవులను మోస్తున్న అనాఫిలిస్ దోమలతో కుట్టించారు. మొదటి బృందంలో తొమ్మిది మంది మలేరియా బారిన పడగా.. రెండో బృందంలో ఒక్కరు మాత్రమే పడ్డారు.

మాత్రతో ఇన్సులిన్ ఇంజెక్షన్లకు చెల్లు!

సూక్ష్మ సూదుల అవసరం లేకుండానే కడుపు గోడల్లోకి మందు ప్రవేశపెట్టే గోలీ

- స్క్విడ్ చేపలు కదిలే తీరు ఆధారంగా అభివృద్ధి చేసిన ఎంఐటీ శాస్త్రవేత్తలు

న్యూయార్క్: సముద్రంలో స్క్విడ్ చేప కదిలే విధానాన్ని ఎప్పుడైనా గమనించారా? అది ప్రమాద సమయంలో చాలా వేగంగా వెళ్తుంది. అందుకు అది వాడే టెక్నిక్.. జెట్ ప్రొపల్షన్. అది తన శరీరపు పైపొర ద్వారా నీటిని లోపలికి పీల్చుకుని.. కడుపు పైభాగంలో ఉండే ఒక నాళం ద్వారా బయటికి వేగంగా వదులుతుంది. ఆ క్రమంలో పుట్టే శక్తి ద్వారా వేగంగా ముందుకు కదులుతుంది. ఇదే టెక్నిక్ ఆధారంగా సూక్ష్మ సూదుల అవసరం లేకుండానే మన కడుపులోకి, పేగుల్లోకి ఔషధాన్ని ప్రవేశపెట్టగలిగే గుళికలను (క్యాప్సూల్) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. ట్రయల్స్ పూర్తయి ఈ క్యాప్సూల్స్ అందుబాటులోకి వస్తే నిత్యం పొట్ట భాగంలో ఇన్సులిన్ ఇంజెక్షన్లు చేసుకోవాల్సిన మధుమేహ బాధితులు, అదే రీతిలో నిత్యం ఇంజెక్షన్లు చేసుకోవాల్సినవారికి ఎంతో ఉపయోగపడతాయి. నిజానికి ఇలా ఇన్సులిన్ తరహా ఔషధాలను నోటి ద్వారా తీసుకున్నప్పుడు.. ఔషధం మన ఆహారనాళం గుండా కడుపులోకి చేరి పనిచేసేలోగా చాలా రసాయనిక మార్పులకు గురవుతుంది. అందుకే వాటిని తప్పనిసరిగా ఇంజెక్షన్ రూపంలోనే ఇస్తారు. అలా కాకుండా వాటిని కూడా నోటి ద్వారా తీసుకునే వీలు కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు చాలాకాలంగా కృషి చేస్తున్నారు. ఆ క్రమంలో వారికి తోచిన ఆలోచన.. జీర్ణ రసాలకు ప్రభావితం కాని విధంగా ఔషధాన్ని గుళికల్లో ఉంచి, వాటిని నోటి ద్వారా శరీరంలోకి పంపి.. ఆ క్యాప్సూల్స్‌కు ఉన్న అతి సన్నని సూదుల ద్వారా మందు విడుదల చేసేలా చూడడం. ఆ సూదులు కడుపు గోడల్లోకి చొచ్చుకుపోయి మందును విడుదల చేస్తాయి. అంటే.. బయటి నుంచి ఇంజెక్షన్ చేయడానికి బదులుగా కడుపులోపల ఇంజెక్షన్ చేయడమన్నమాట. అలా కడుపు లోపల సైతం సూదులు ఉపయోగించకుండానే మందును మన కడుపు గోడల్లోకి విడుదల చేయడానికే ఎంఐటీ శాస్త్రజ్ఞులు స్క్విడ్‌ల గమన విధానాన్ని అధ్యయనం చేశారు. దాని ఆధారంగా వారు రెండు రకాల క్యాప్సూల్స్ రూపొందించారు. వాటిలో ఎలాంటి సూక్ష్మ సూదులూ ఉండవు. అవి మందును ఒక ధారలాగా కడుపు గోడల్లోకి చొచ్చుకుపోయేంత వేగంగా స్ప్రే చేస్తాయి. ఈ రెండు క్యాప్సూల్స్‌లో ఒకటి బ్లూబెర్రీ ఆకారంలో ఉంటే, మరొకటి ట్యూబ్ ఆకారంలో ఉంటుంది. ప్రయోగాల్లో భాగంగా ఎంఐటీ శాస్త్రజ్ఞులు ఈ క్యాప్సూల్స్ ద్వారా పందులు, కుక్కల కడుపు భాగంలోకి ఇన్సులిన్‌ను, జన్యు చికిత్సలో భాగంగా కొన్ని రకాల ఆర్ఎన్ఏలను విజయవంతంగా ప్రవేశపెట్టగలిగారు. మనుషులపై పరీక్షలు విజయవంతమై ఈ క్యాప్సూల్స్ మార్కెట్లోకి వస్తే మధుమేహ బాధితులకు ఇంజెక్షన్ల బెడద తప్పిపోతుంది!!



అవార్డు అందుకుంటున్న విజయ్‌కుమార్ సిక్దర్, ప్రజ్ఞ

రామగుండం ఎన్టీపీసీకి అవార్డుల పంట

జ్యోతినగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీకి అవార్డుల పంట పండింది. గోవాలో శనివారం జరిగిన అపెక్స్ ఇండియా ఫౌండేషన్ అవార్డుల కార్యక్రమంలో రామగుండం ప్రాజెక్టు అధికారులకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఎన్టీపీసీ ఆర్‌ఈడీ కేదార్ రంజన్ పాండుకు లీడర్ సీఈవో ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డు, టెక్నాలజీ ఎక్సలెన్స్ కేటగిరీలో ప్లాటినం అపెక్స్ అవార్డు, హెచ్‌ఆర్ ఎక్సలెన్స్‌లో గోల్డ్ అవార్డు, ట్రైనింగ్ ఎక్సలెన్స్‌లో గోల్డ్ అవార్డు, సేఫ్టీ అండ్ ఆక్యుపేషనల్ హెల్త్‌లో గోల్డ్ అవార్డు లభించాయి. ఎన్టీపీసీ ఆర్‌ఈడీ కేదార్ రంజన్, ఏజీఎం (హెచ్‌ఆర్) విజయ్ కుమార్ సిక్దర్, అధికారి ప్రజ్ఞ అవార్డులను అందుకున్నారు.

అప్పులు తీర్చలేక రైతు బలవన్మరణం

» మెదక్ జిల్లా కంచనపల్లిలో ఘటన

కౌడిపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కంచనపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు శేఖర్(49)కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఇటీవల రూ.లక్ష పెట్టి ఓ బోరు వేశాడు. దీంతో పాటు డ్వాక్రా సంఘంలో.. పంట చిట్టీలు, వ్యవసాయానికి కలిపి మొత్తం రూ.4 లక్షల వరకు అప్పు చేశాడు. వ్యవసాయంలో తీవ్ర నష్టం రావడం, తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కనిపించక మనోవేదనకు గురై ఈనెల 21న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు.

అసలేం జరిగింది.. మీరేం చేశారు?

లగచర్ల ఘటనపై మానవ హక్కుల సంఘం విచారణ

» వికారాబాద్ కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీసు అధికారుల వద్ద వివరాల సేకరణ

» సంగారెడ్డి జైల్లో లగచర్ల గ్రామస్థులతోనూ భేటీ

» నేడూ విచారణ కొనసాగే అవకాశం



విచారణ అనంతరం వికారాబాద్ కలెక్టరేట్ బయటకు వస్తున్న మానవ హక్కుల సంఘం ప్రతినిధులు

వికారాబాద్, కంది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం విచారణ కొనసాగుతోంది. ఇటు రెవెన్యూ, పోలీసు అధికారులతోపాటు అటు సంగారెడ్డి జైలులో రిమాండ్‌లో ఉన్న లగచర్ల గ్రామస్థులను మానవ హక్కుల సంఘం బృందం ఆదివారం వేర్వేరుగా విచారించింది. అసలు ఆ రోజు ఏం జరిగింది ? దాడికి దారి తీసిన పరిణామాలేంటి ? అధికారులు ఏ విధంగా వ్యవహరించారు ? తదితర అంశాలపై విచారణ బృందం వివరాలు సేకరించింది. ఎన్‌హెచ్‌ఆర్సీ న్యాయవిభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ ముఖేశ్, ఇన్‌స్పెక్టర్లు యతి ప్రకాశ్‌శర్మ, రోహిత్‌తో కూడిన బృందం ఆదివారం ఉదయం 10 గంటలకు సంగారెడ్డి సెంట్రల్ జైలుకు వచ్చింది. లగచర్ల ఘటనలో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న 19 మందిని విచారించింది. నాలుగు గంటలకు పైగా సాగిన ఈ ములాఖత్‌లో అధికారులు, పోలీసుల ప్రవర్తనపై ఆరా తీసింది. పోలీసులు తమను హింసించారని కొందరు కమిషన్ దృష్టికి తీసుకురాగా వివరాలను లిఖితపూర్వకంగా తీసుకున్నట్లు సమాచారం. ఇక, ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 6.40 గంటల వరకు వికారాబాద్ కలెక్టరేట్‌లో మానవ హక్కుల సంఘం బృందం విచారణ జరిపింది. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కొడంగల్ తహసీల్దార్ విజయకుమార్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, బొంరాస్‌పేట్ ఎస్‌ఐ రహాఫ్‌ను వేర్వేరుగా ప్రశ్నించింది. ఘటనకు సంబంధించి పలు పత్రాలను తమకు అందజేయాలని ఆదేశించింది. నిందితులను అరెస్టు చేసే క్రమంలో బాధిత కుటుంబాలు చేసిన ఆరోపణలను ఈ సందర్భంగా వారు పోలీసుల ఎదుట ప్రస్తావించినట్లు తెలిసింది. సోమవారం కూడా ఈ విచారణ కొనసాగనున్నట్లు సమాచారం. కాగా, విచారణ కొనసాగుతోందని, మరికొంత సమాచారం రావాల్సి ఉందని మానవ హక్కుల సంఘం ప్రతినిధులు తెలిపారు.

'పట్నం' కస్టడీ పిటిషన్‌పై నేడు తీర్పు !

లగచర్లలో ఘటనలో ప్రధాన నిందితుడిగా అభియోగం ఎదుర్కొంటున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కొడంగల్ కోర్టు సోమవారం తీర్పు వెల్లడించే అవకాశముంది. నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ కూడా వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో సోమవారం విచారణకు రానుంది. అయితే, హైకోర్టులో నరేందర్‌రెడ్డి తరఫున దాఖలైన పిటిషన్లపై నిర్ణయం వెలువడిన తర్వాతే కింది కోర్టులు తమ తీర్పులను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

నేడు లగచర్లకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

లగచర్ల ఘటనపై విచారణ నిర్వహించేందుకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం లగచర్లలో పర్యటించనున్నారు. కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేశారన్న అభియోగంపై పోలీసులు అర్ధరాత్రి దాడులు నిర్వహించి అక్రమ అరెస్టులు చేశారని, తమతో అసభ్యంగా ప్రవర్తించారని పలువురు మహిళలు కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు స్పందిస్తూ కమిషన్ చైర్మన్ సోమవారం లగచర్ల, రోటిబండ తండాలో పర్యటించి విచారణ చేపట్టనున్నారు. అనంతరం సంగారెడ్డి జైలులో రిమాండ్‌లో ఉన్న గ్రామస్థులతోనూ మాట్లాడనున్నారు.

నేడు మానుకోటలో బీఆర్‌ఎస్ మహాధర్నా: ఎర్రబెల్లి

మహబూబాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లగచర్ల గిరిజన రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మానుకోటలో సోమవారం చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మహబూబాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లగచర్ల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి గిరిజన రైతులకు న్యాయం చేసేంతవరకు బీఆర్‌ఎస్ పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు.

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య కన్నుమూత

» కొంత కాలంగా అనారోగ్యం.. చికిత్స పొందుతూ మృతి



అబ్బయ్య(ఫైల్)

ఇల్లెందు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీనియర్ రాజకీయవేత్త, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య(73) ఆదివారం కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున చనిపోయారు. ఆయన మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం హన్మంతులపాడులోని స్వగృహానికి తరలించారు. ఆదివాసీ గిరిజన కుటుంబానికి చెందిన అబ్బయ్య ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఐ నాయకుడిగా ఎదిగారు. పార్టీలో కీలక పదవులను చేపట్టారు. ఇల్లెందులో నక్సలైట్ పార్టీలను దీటుగా ఎదుర్కొంటూ పార్టీ విస్తరణకు కృషి చేశారు. 1983లో బూర్గంపాడు నుంచి, 1994లో ఇల్లెందు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత టీడీపీలో చేరి, 2009లో ఇల్లెందు నుంచే పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మొత్తంగా ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అబ్బయ్యకు భార్య ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

ఏపీ కోస్తాకు తుపాన్ ముప్పు!

» బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం.. నేటి కల్లా వాయుగుండం?

» నేటి నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది పశ్చిమ వాయువ్యంగా పయనిస్తూ ఈనెల 25వ తేదీకల్లా దక్షిణ బంగాళాఖాతంలో ప్రవేశించి వాయుగుండంగా బలపడనుంది. ఇది 27వ తేదీకల్లా తమిళనాడు, శ్రీలంక తీరాల దిశగా రానున్నదని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. దీని ప్రభావంతో నేటి నుంచి ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అయితే ఇది తుపాన్‌గా బలపడుతుందని పలు మోడళ్లు అంచనా వేస్తున్నాయి. అయితే, ఐఎండీ, జీఈపీఎస్ ప్రకారం ఆదివారం రాత్రికి వాయుగుండంగా మారి, తరువాత ఈ నెల 26వ తేదీ సాయంత్రానికి శ్రీలంక వద్ద నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో తుపాన్‌గా బలపడుతుంది. తరువాత ఈశాన్యంగా దిశ మార్చుకుని మయన్మార్ వైపుగా వెళుతుంది. ఎన్‌సీఈపీ మోడల్ ప్రకారం కూడా వాయుగుండంగా బలపడిన తరువాత ఈనెల 27వ తేదీ వరకు పశ్చిమ వాయువ్యంగా పయనించి, తరువాత ఈశాన్యంగా దిశమార్చుకుని మయన్మార్ వైపు వెళ్లనుంది.

దర్శిలో 13వ శతాబ్దం నాటి శాసనం



దర్శిలో బయటపడిన శాసనం

దర్శి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దర్శి పట్టణ సమీపంలోని అచ్చన్నచెరువు వద్ద 13వ శతాబ్దం నాటి శాసనం బయటపడింది. చరిత్ర పరిశోధకుడు దరిమెళ్ల శ్రీనివాసప్రసాద్, సంఘసేవకుడు జి.వి.రత్నం దీన్ని గుర్తించారు. క్రీస్తు శకం 1317లో లభించిన ఈ శాసనాన్ని ఆనాటి దర్శి పాలకుడైన నాగవంశ రాజు మహామండలేశ్వర అస్తదేవ మహారాజు ఏర్పాటు చేయించినట్లు గుర్తించారు. ఈ శాసనంలో వారికి సంబంధించిన ఏడు తరాల రాజుల వంశవృక్షం రాసి ఉంది. 1395లో అక్కడ చెరువు తవ్వించినట్టు, వేణుగోపాలస్వామి గుడి నిర్మించినట్లు అందులో ఉంది. వేణుగోపాలస్వామి ఆలయానికి దర్శి, పొతకమూరు, దేవవరం, సామంతపూడి, పూరిమిట్ల, ఈదర గ్రామాల్లో మాన్యం ఉన్నట్లు దాని ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయాన్ని అష్టదేవ మహారాజు తల్లి ఆర్యమదేవి ఆధ్వర్యంలో నిర్మించినట్టు గుర్తించారు. ఈ మాన్యం భూములను ఆలయ సంరక్షణకు కేటాయించారు. దర్శి గ్రామంలో ఆంజనేయస్వామి గుడి, శివాలయంలో కూడా కాకతీయ రాజులనాటి శాసనాలు ఉన్నాయి.

కుళ్లిన కూరగాయలు.. అన్నంలో పురుగులు

» విద్యార్థుల గదుల పక్కనే కుక్కల సంచారం

» గదుల్లో దుర్వాసన, కంపు కొడుతున్న బాత్‌రూములు

» గిర్మాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



విద్యార్థుల గదుల పక్కనే కుక్క పిల్లలు, చెత్తాచెదారం

కొండాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం విషతుల్యమై విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్న అధికారుల తీరు ఏమాత్రం మారడం లేదు. తాజాగా సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కుళ్లిన కూరగాయలు, పురుగులు పట్టిన బియ్యంతో భోజనం పెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థుల గదుల్లో దుర్వాసన, బాత్‌రూమ్‌లు కంపుకొడుతున్నాయని ఆదివారం ఆందోళనకు దిగారు. మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే బియ్యంలో పురుగులు, కుళ్లిన కూరగాయలతో తమ పిల్లలకు భోజనం పెడుతున్నారని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. విద్యార్థుల గదులకు పక్కనే కుక్కలు సంచరిస్తున్నాయని, కంపు, దుర్భర పరిస్థితుల్లో మా పిల్లలను చూడడం బాధగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గదులను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోందని విద్యార్థులు వాపోయారు. గదులను శుభ్రం చేయించడం, ఫ్యాన్లకు మరమ్మతులు వంటివి తమతో చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సుదర్శన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. విద్యార్థులకు మెనూ ప్రకారమే వడ్డించాలని సిబ్బందికి సూచించామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని వెల్లడించారు.

జగన్-అదానీ లంచాల్లో ఇద్దరు ఐఏఎస్‌ల కీలక పాత్ర!!

» తమ 'రాజు'కు లబ్ధి చేకూర్చడానికే!

» పకడ్బందీ విచారణతో కఠిన చర్యలు చేపట్టాలి

» రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేశ్ డిమాండ్

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఒప్పందానికి సంబంధించి అదానీ నుంచి నాటి సీఎం జగన్ రూ.1,750 కోట్ల లంచాలు తీసుకున్న వ్యవహారంలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు కీలక పాత్ర పోషించారని రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేశ్ వెల్లడించారు. తమ 'రాజు'కు లబ్ధి చేకూర్చడానికే ఇలా చేశారని 'ఎక్స్'లో పేర్కొన్నారు. '2019 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 9 పునరుత్పాదక సంస్థలకు చెందిన 23 ప్రాజెక్టులకు సంబంధించిన 2,132 మెగావాట్ల విద్యుత్ సరఫరా ఒప్పందాలను రద్దు చేసింది. అదే ప్రభుత్వం 2021 డిసెంబరులో 7,000 మెగావాట్ల సౌరవిద్యుత్ సరఫరా కోసం సెకీ ద్వారా ఒకే ఒక సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ వ్యవహారంలో వారి 'రాజు'కు ప్రయోజనాలు కల్పించడం కోసం ఇద్దరు ఐఏఎస్ అధికారులు కీలకపాత్ర పోషించారు. దీనివల్ల మంచి స్థాయిలో ఉన్న రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. ఈ చర్య ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. అందుబాటులో ధరల్లో ఉండే విద్యుత్ సౌకర్యాల అవకాశాలను చావుదెబ్బ తీసింది. వినియోగదారులపై పెనుభారం మోపింది. ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. ఇలాంటి నేరపూరిత వ్యవహారాలపై పకడ్బందీ విచారణ జరిపి, కఠినమైన చర్యలు తీసుకోవాలి' అని ఆయన తెలిపారు.

దివ్యాంగుల రిజర్వేషన్ల అమలుకు పర్యవేక్షణ కమిటీలు

» కేంద్రం తాజా మార్గదర్శకాలు




న్యూఢిల్లీ, నవంబరు 24: దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి నిష్పాక్షికంగా వ్యవహరించడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు జారీచేసింది. కనీసం 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు రిజర్వేషన్ల అమలు, పోస్టుల క్రమబద్ధీకరణ, వాటి భర్తీ వంటి అంశాలను పర్యవేక్షించేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని ఆ మార్గదర్శకాల్లో పేర్కొంది. ఒక పోస్టు దివ్యాంగులకు సరిపోతుందని భావిస్తే.. దానికి సంబంధించిన తదుపరి పదోన్నతి పోస్టులను కూడా వారికే రిజర్వ్ చేయాలని ఈ మార్గదర్శకాల్లో తెలిపింది. దివ్యాంగుల హక్కుల చట్టం-2016కు అనుగుణంగా ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ చట్టం అమలులో అవకతవకలు జరుగుతున్నాయని, దివ్యాంగుల పోస్టులను గుర్తించడంలో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) వంటి సంస్థలు అనధికారికంగా వ్యవహరిస్తున్నాయని ఢిల్లీ హైకోర్టు విమర్శించిన నేపథ్యంలో.. కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో దివ్యాంగుల ఉపాధిలో సమగ్రత, నిష్పాక్షికత, ఏకరూపత తీసుకురావడమే తాజా మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం. అంధత్వం, లోకోమోటివ్ వైకల్యం, వినికిడి లోపం, మానసిక వైకల్యం సహా వివిధ విభాగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, పదోన్నతుల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం ఈ మార్గదర్శకాల్లో సూచించింది. పోస్టుల భర్తీకి సంబంధించిన అంశాలను అంచనా వేసేందుకు దివ్యాంగుల ప్రతినిధులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొంది. అలాగే బ్యాక్‌లాగ్ పోస్టులను సకాలంలో భర్తీ చేయాలని స్పష్టం చేసింది.

ఐ బ్యాంకులు నోటోతో అనుసంధానం కావాలి

» రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 24: ఐ బ్యాంకులు, కణజాలం లేదా కార్నియా మార్పిడి చేసే ఆస్పత్రులు తప్పనిసరిగా నేషనల్ ఆర్గాన్, టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (నోటో) కింద రిజిస్టర్ కావాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించింది. రోగుల సంఖ్య, దాతల నుంచి సేకరించిన అవయవాల వివరాలు, వాటిని ఎంతమందికి అమర్చారనే సంఖ్యతోపాటు.. ఇంకా మిగిలిన సంఖ్యపై ఆస్పత్రులు, కంటి బ్యాంకులు తమ డేటాను నోటోతో పంచుకోవాల్సి ఉంటుంది. కాలేయం, కిడ్నీల వంటి అవయవాల మార్పిడి కోసం వెయిటింగ్ లిస్ట్‌ను కేంద్ర ప్లాట్‌ఫామ్‌లో చూసినట్టే.. ఈ వివరాలను సైతం అందుబాటులోకి తెచ్చేందుకు ఈ చర్యలు తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు.

వాళ్ళూ మనమూ ఒకటే!



కాలం తెస్తున్న మార్పులను కథానిక నమోదు చేసినంత ప్రభావశీలంగా మరో ప్రక్రియ చేయలేదు. తక్షణ ప్రాముఖ్యం ఉన్న అంశాన్ని పాఠకుని దృష్టికి తెచ్చే కాల్పనిక ప్రక్రియ కావటం వల్ల కథానిక సాహిత్య రంగంలో తొందరగా నిలదొక్కుకుంది. పరిమిత పాత్రలతో, సంఘటనలతో, సన్నివేశాలతో ఆయా రచయితలు సృష్టించే కాల్పనిక ప్రపంచం లోకి పాఠకుడ్ని తీసుకు వెళ్తుంది. పాత్రల ప్రపంచాన్ని పాఠకుల ప్రపంచంతో సమన్వయం చేస్తుంది. మంచి భాషా శైలులు, సంవిధాన శిల్పం కథానికను బలోపేతం చేస్తాయి. సత్యాన్నీ తాత్వికతనూ జీవితంతో మేళవించి గొప్ప రచయితలు రాసిన కథానికలు పాఠకుల స్థాయిని పెంచుతాయి.

సీనియర్ జర్నలిస్ట్ పి.వి. సూర్యనారాయణ మూర్తి ఉర్దూ భాషలో బాగా కృషి చేసి, తనకు నచ్చిన ఉర్దూ సాహిత్యాన్ని, ముఖ్యంగా కథానికలను, తెలుగు లోకి అనువదించి 'మెహక్ హైదరాబాదీ' అన్న కలం పేరుతో ప్రచురిస్తున్నందుకు అభినందించక తప్పదు. ఆయన ఇప్పటిదాకా పది పుస్తకాలను అనువదించారు. వీటిలో జిలానీ బానూ కథలు రెండు సంపుటాలు, సాదత్ హసన్ మంటో కథలు రెండు సంపుటాలు, అమృతా ప్రీతమ్ నవల 'పింజర్', మఖ్దూమ్ మొహియుద్దీన్ వివాదాస్పద రచన 'హైదరాబాద్' మొదలైనవి ఉన్నాయి. జర్నలిస్ట్‌గా 2021లో రిటైరైన తర్వాత అవిశ్రాంతంగా చేస్తున్న సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం వారిని ఉన్నత విద్యా శాఖ లోని ఉర్దూ భాషాభివృద్ధి జాతీయ మండలి సభ్యులుగా నియమించింది. ఇది ఒక అనువాదకునికి లభించిన అరుదైన గౌరవం.

'మెహక్ హైదరాబాదీ' ఇరవై రెండు ఉర్దూ కథానికలను ఉర్దూ మూలం నుంచి తెలుగులోకి అనువదించిన కథా సంకలనం పేరు 'గుల్‌దస్త'. ఈ పుస్తకంలోని కథల అనువాద కార్యక్రమంలో ఒక పరిశోధనాత్మక దృక్కోణం సూత్రం లాగా ఇమిడి ఉంది. అది– "ఇక్కడి హిందువుల జీవితాలపై ముస్లిం రచయితలు ఎలాంటి కథలు రాశారు?" అన్నది. ఇదొక అన్వేషణ. అనువాదకుడు ఈ రెండు భాషల మధ్య సరికొత్త వంతెన వేస్తున్నాడు. దీన్ని ఉర్దూ సాహితీ మిత్రులు కూడా అనుసరిస్తే రెండు భాషల సాహిత్యం సుసంపన్నమవుతుంది.

రషీద్ కురేషీ 1938లో రాసిన కథ 'వితంతువు' (బేవా). భర్త చనిపోయిన తర్వాత సాటి స్త్రీల మధ్య కూడా ఒక అస్పృశ్యగా బతకటం యుక్త వయసులో ఉన్న షీలాకు దుర్భరమైపోతుంది. కూతుళ్ళ విషయంలో ఒక రకంగా, కోడళ్ళ విషంలో మరో రకంగా ప్రవర్తించే నోరున్న అత్తలకు హిందూ సమాజంలో దాదాపు ప్రతి ఇల్లూ కేంద్రమే. ఈ అత్త కూడా షీలాను ఇంట్లో నుండి గెంటేస్తుంది. షీలాకు సవతి తల్లి రంపపు కోత భరించక తప్పలేదు. ఈ దశలో యువకుడైన శంకర్ అనే ట్యూషన్ మాస్టారితో పరిచయం ఆమెకు ఒక వరమూ, శాపమూ కూడా. శంకర్ అనే వ్యక్తి పరిధి లోకి ఆమె జీవితం కుంచించుకు పోయింది. అతని ప్రేమ ప్రతిపాదన వల్ల ఆమె ఆలోచనలు పెళ్ళి వైపు మళ్ళాయి. కానీ అతడు ఈ వితంతువును వదిలేసి ఒక కన్యను పెళ్ళాడతాడు. దీంతో కథ విషమ స్థితికి చేరుకుంది. మూడు కోణాల ప్రేమకథ ఒక ప్రాణాన్ని బలి తీసుకుంటుందన్న సూత్రం ప్రకారం షీలా ఈ లోకం నుండి నిష్క్రమిస్తుంది. చనిపోయిన భర్త, అత్త, సవతి తల్లి, శంకర్, శంకర్ భార్య – ఈ ఐదుగురితో మారుతూ వచ్చిన సంబంధాల దృష్ట్యా సంఘర్షణకు లోనైన స్త్రీ షీల. ఈ సంఘర్షణను చిత్రించిన తీరులో రచయిత సమర్థత కనిపిస్తుంది. ఒక్కోసారి ఒక సంఘటన సహజ పరిణామ క్రమంలో పతాక స్థాయిని అందుకుంటున్న ఘట్టంలో దాని నిర్వహణ చేతగాని కథకులు చేతులెత్తేస్తుంటారు. ఈ కథానికలో ఆ లోపం కనిపించదు. ఇది స్త్రీ కోణం నుంచి కథనం చేయబడ్డ కథానిక.

హిందూ సమాజంలో వితంతువుల సమస్య మతంతో ముడివడి ఉన్న అంశం. ముస్లిం సమాజంలో వితంతు సమస్య లేదనే చెప్పవచ్చు. తమ మతంలో లేని వితంతు సమస్య హిందూ సమాజంలో ఎట్లా ఉందో తమ పాఠకులకు తెలియజేయాలన్న ఆసక్తి నాటి ఉర్దూ రచయితలకు ఉండటం సహజం.

'ఉప్పెన' (సైలాబ్) కథానికను కదీర్ జమాల్ 2005లో రాశాడు. కథానాయిక నళిని పెళ్ళీడుకు వచ్చేసరికి ఒక నేపథ్యం ఏర్పడిపోయింది. ఆమెకు విష్ణుమూర్తి పట్ల ఎనలేని భక్తి శ్రద్ధలు ఏర్పడ్డాయి. ఒక రోజు పెద్ద తుఫాను వచ్చింది. సముద్రం చెలియలికట్ట దాటింది. నళిని, ఆమె భర్త పిల్లలను ఎత్తుకొని ఆత్మరక్షణ కోసం బయలుదేరారు. ఇంత ఆపదలో కూడా బరువైన విష్ణుమూర్తి విగ్రహాన్ని తనతోపాటు తెచ్చుకోవటం నళిని మరిచిపోలేదు. విగ్రహం సముద్రంలో జారిపడిపోయింది! వారు సురక్షితంగా గమ్యం చేరుకున్నారు. ఈ కథలో అంతఃసంఘర్షణకు భౌతిక పరిస్థితులు కారణమయ్యాయి. విష్ణుమూర్తి తాను సముద్రంలో మునిగిపోయి తమను కాపాడాడన్న భావన కూడా నళినికి దుఃఖ హేతువే. ఆమె భక్తిప్రపత్తులు విగ్రహాన్ని ఆశ్రయించే ఉన్నాయి. ముస్లిం సమాజంలో లేని విగ్రహారాధన హిందువుల విశ్వాసాలలో ప్రధాన భాగం. దీన్నే రచయిత ఈ కథానికలో తుఫాను ద్వారా చిత్రించాడు.

ఫాతిమా తాజ్ అన్న రచయిత్రి 2002లో రచించిన 'జీవిత చక్రం' (జీవన్ ధారా) కూడా విగ్రహారాధనకు సంబంధించిన కథే. ఇందులోని కథానాయిక పట్ల రచయిత్రి ప్రదర్శించిన గౌరవం, సానుభూతి పాఠకుడ్ని ఆకట్టుకుంటాయి. మరికొన్ని ఇతర కథల్లో కూడా హిందువుల మత సాంస్కృతిక మనోవ్యవస్థను గౌరవంతో దర్శించే శక్తి తమకు ఉందని ఉర్దూ రచయితలు నిరూపించుకున్నారు. అంతరాంతరాల్లో లౌకికవాదం బలపడుతున్నదనటానికి ఇది సూచిక.

ఏ మతం వారి జీవితానికైనా ఆర్థిక శక్తే కేంద్రం. ఈ కేంద్రం చుట్టూ తిరిగే జీవితాలలో ఎంతో సమానత్వం, కొంత భిన్నత్వం ఉంటాయి. 'గుల్‌దస్త' కథలు ఈ సత్యాన్నే చెప్తున్నాయి. ఇక అనువాద విషయానికి వస్తే– మూల విధేయ పద్ధతికి చదివించే గుణం తోడైతే అనువాదకుని కృషి సార్థకమవుతుంది. మెహక్ హైదరాబాదీ కృషి సార్థక కృషి అని 'గుల్‌దస్త' పరిమళాలు చాటి చెప్తున్నాయి.



> 'గుల్‌దస్త' పుస్తకం లోని కథల అనువాద కార్యక్రమంలో ఒక పరిశోధనాత్మక దృక్కోణం సూత్రం లాగా ఇమిడి ఉంది. అది– "ఇక్కడి హిందువుల జీవితాలపై ముస్లిం రచయితలు ఎలాంటి కథలు రాశారు?" అన్నది. ఇదొక అన్వేషణ. అనువాదకుడు ఈ రెండు భాషల మధ్య సరికొత్త వంతెన వేస్తున్నాడు. దీన్ని ఉర్దూ సాహితీ మిత్రులు కూడా అనుసరిస్తే రెండు భాషల సాహిత్యం సుసంపన్నమవుతుంది.



■ అమ్మంగి వేణుగోపాల్
✆ 94410 54637



గోడకుర్చీ వేయించాను
గుంజీళ్ళు తీయించాను
బెంచీ ఎక్కించాను
బడి చుట్టూ తిప్పించాను
బుద్ధి మారదు ససేమిరా
కుక్కతోక వంకరన్నట్లు
ఉత్తరంవైపు అడుగు పెట్టద్దంటే
అటే పరుగులు
చండికలా వద్దన్నదే ముద్దు
అరచేతిలో వాలిన చిలుకలను
అక్కర్లేదని వదిలేస్తుంది
అందరాని వాటికోసం
కాళ్ళెత్తి ఎగురుతుంది

నిజంగా దేనితో చేస్తారో
తెలిస్తే బాగుండు
ప్లాస్టిక్కా ప్లాటినమా
మృత్తికతోనా పసిడితోనా
అంతు చిక్కని రహస్యం
రికాబులో కాళ్ళు పెట్టి
కోర్కెల వారువానికి కళ్ళెం బిగించి
కొయ్యగుర్రంగా మార్చెయ్యాలనుకుంటా
కింద పడేసి రెక్కల గుర్రమై
పొగరుగా ఎటో దౌడు తీస్తుంది
ఒకసారి
తడిసిన పిట్టలా
ఒక మూల ఒదిగి కూర్చుంటుంది

దిగులు బొమ్మలా
ఒకసారి
ఎన్నికల్లో ఓడిపోయి ఎవరికీ కనిపించని
ప్రతిపక్ష నాయకునిలా
ఓసారి మట్టి ముద్దలా
ఓసారి ఉత్తుంగ శిఖరం హిమాలయంలా
ఓసారి అంతర్వాహిని సరస్వతిలా
ఓసారి వరద గోదారిలా
అర్థం కాదెప్పటికీ
అస్పష్ట వాక్యంలా...

■ మందరపు హైమవతి
✆ 94410 62732

మాతృత్వాన్ని కమ్మిన కట్టుకథలను ఛేదించే 'యోధ'

పితృస్వామ్య సమాజం మాతృత్వాన్ని చాలా గ్లోరిఫై చేసింది. పిల్లలను కనడం వేరు, మాతృత్వం వేరు. కానీ సమాజం ఈ రెండిటినీ ఒకే కోణంలో చూస్తుంది. పిల్లలను కనడానికి అనువుగా స్త్రీకి ఉన్న శారీరక నిర్మాణాన్ని అలుసుగా తీసుకున్న పురుషుడు పిల్లలను పెంచే బాధ్యతను కూడా స్త్రీ పైన మోపాడు. ఆడపిల్ల పెరుగుతున్న క్రమంలోనే మాతృత్వం లోని గ్లోరిఫికేషన్ వలన తనకు తెలియకుండానే పిల్లలను కనడంతోపాటు వాళ్ళను పెంచడం కూడా తన బాధ్యతగా భావిస్తుంది. చాలామంది స్త్రీలు పిల్లల పెంపకం బాధ్యత తమదే అని అనుకోవడానికి ఈ కండిషనింగ్ కారణం. ఇలాంటి నేపథ్యంలో మాతృత్వం కాన్సెప్ట్ మీద భండారు విజయ తన సంపాదకత్వంలో 'యోధ' పేరిట ఒక కథా సంకలనాన్ని తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెతో ముఖాముఖి.

రచయిత అయిన మీకు ప్రచురణ రంగంలోకి రావాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

ప్రథమంగా నేను రచయితను. ఒక మహిళా రచయితగా సమాజంలో వివక్షకు గురౌతున్న స్త్రీల పట్ల ఒక లోతైన అధ్యయనం చేస్తూ ఉంటాను. అలాగే మహిళా హక్కుల కార్యకర్తగా స్త్రీలను అనేక విషయాలలో ఎడ్యుకేట్ చేయాలన్న దృఢ సంకల్పం నాకు ఉంది. చిన్నప్పటి నుంచి నాకు ఇతర స్త్రీల కన్నా భిన్నంగా, కొత్తగా ఏదైనా ప్రయోగాలు చేయడం అంటే చాలా ఇష్టం. ఆ భిన్న వ్యక్తీకరణ నుంచి వచ్చిందే ఈ ప్రచురణ కర్త హోదా. ఒకప్పుడు రచయితలు రాసిన ఏ పుస్తకాలనైనా ప్రచురించాలంటే ప్రముఖ ప్రచురణ సంస్థలు చాలా ఉండేవి. అలాంటి పేరున్న సంస్థలు ఇప్పుడు ఎక్కడా కనబడటం లేదు. కొత్తగా కొన్ని ప్రచురణ సంస్థలు వచ్చినప్పటికీ, వాటికి కొన్ని పరిమితులు (ఆర్థిక, హార్దిక) ఉండడం వలన వాటి జోలికి రచయితలు వెళ్ళలేకపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రచయితలు తమ పుస్తకాలను తామే ప్రచురణ చేసుకునే ట్రెండ్ ఎక్కువైంది. నేను 1984లో 'దీపిక', 2016లో 'తడియారని దుఃఖం' కవితా సంపుటాలను నా మిత్రుల ప్రచురణ సంస్థల ద్వారా ప్రచురించాను. 2015లో వరంగల్ మిత్రులందరం కలిసి 'రుద్రమ' ప్రచురణ సంస్థను స్థాపించాము. ఆ సంస్థలో నేను సహసంపాదకురాలిగా 7, 8 పుస్తకాలకు పని చేసాను. 2017లో రుద్రమ ప్రచురణల నుంచి నేను బయటకు వచ్చి, 2018లో హస్మిత ప్రచురణ సంస్థను స్థాపించాను. మొదట్లో నా పుస్తకాలను మాత్రమే ప్రచురించాను. తర్వాత రచనలను ముద్రించుకోవడంలో నానా అవస్థలు పడుతున్న రచయితలకు నా సంస్థ ద్వారా అవకాశం ఇస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. అందులో భాగంగా 2023లో 'స్వయంసిద్ధ' ఒంటరి మహిళల జీవన గాథల పేరిట 40 మంది కొత్త, పాత రచయితలను కలుపుకొని వారితో కొత్త కథలు రాయించి ఒక కథా సంకలనాన్ని విజయవంతంగా తీసుకొని వచ్చాను. ఆ పుస్తకం ఏడాదిలోనే ద్వితీయ ముద్రణ కూడా వచ్చింది. అదే ఉత్సాహంతో ఇప్పుడు 'యోధ' మాతృత్వం భిన్నవ్యక్తీకరణల పేరిట తీసుకు వచ్చాను.


మాతృత్వం కాన్సెప్ట్ మీద కథా సంకలనం తీసుక రావాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

ఒంటరి మహిళలుగా స్త్రీలు ఈ సమాజంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను క్రోడీకరించి, వారి విజయ గాథలను 'స్వయం సిద్ధ' రూపంలో కథా సంకలనంగా తెచ్చాము. ఒంటరితనం తరువాత స్త్రీలు సమాజంలోను, కుటుంబంలోను ఎక్కువగా ఎదుర్కొనే ముఖ్యమైన సమస్య శారీరక హింస, అందులో ఒక భాగమే మాతృత్వం. ఆ హింసను పరోక్షంగా బలపరిచేది పితృస్వామిక వ్యవస్థ, దాని భావజాలం. ఆ భావజాలం స్త్రీలకు బానిసత్వాన్ని ఇంజెక్ట్ చేసింది. కుటుంబంలో తల్లి స్థానాన్ని గ్లోరిఫై చేస్తూ అనేక విధాలుగా స్త్రీలపై అధికారాన్ని మనువాదం స్థిరపరచుకుంది. ముఖ్యంగా స్త్రీలు మాతృత్వం పేరిట కుటుంబంలో అనేక రూపాల్లో వివక్ష, అణచివేతలతోపాటు వివిధ మానసిక, శారీరక హింసలకు లోనుకావడం నన్ను బాగా కలవరపరచిన విషయం. మాతృత్వం అనేది ఒక భ్రమ మాత్రమే అనేది నా నమ్మకం. పితృస్వామిక భావజాలం మాత్రం 'మాతృత్వం' అనే అంశాన్ని స్త్రీల చుట్టూ మెలికలు తిప్పుతూ అనేక కట్టుకథలను అల్లి, ఇంకా నమ్మించే ప్రయత్నం చేయడం దురదృష్టకరం.



> "సమాజంలోనూ కుటుంబంలోనూ పురుషులతో ఏ సమానత్వ హక్కునైతే ఈనాడు స్త్రీలు కోరుకుంటున్నారో, అదే సమాన బాధ్యతను పిల్లల పెంపకం, వారి ఆలనా పాలనా విషయంలో కూడా అడుగుతున్నారు. మాతృత్వం మాటున దాగిన దగాకోరుతనాన్ని ఒకవైపు నిలదీస్తూ మరోవైపు అందులోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ నిరంతరం పురుషస్వామ్యంతో పోరాడుతున్నారు. అందుకే వారిని నేను 'యోధ'లుగా చూస్తున్నాను." – విజయ భండారు

మాతృత్వం స్త్రీలను జీవితాంతం నిద్ర పుచ్చే ఒక మత్తుమందు లాంటిది. దానిని గ్లోరిఫై చేయడమే ఈ సమాజ ఉద్దేశం. అన్ని భావనల లాగా మాతృత్వం, తల్లితనం అనేది ఒక మానసిక భావన మాత్రమే అన్నది 80వ దశకం నుంచి స్త్రీవాదులు చేస్తున్న వాదనే. స్త్రీ పురుషుల సమానత్వం కోరుకుంటున్న సమాజ పరిణామ క్రమంలో వంటిల్లూ, పిల్లల బాధ్యతా కేవలం స్త్రీలదే అని వాదించడం మూర్ఖత్వం. చలం ఏనాడో చెప్పాడు. స్త్రీకి మెదడు ఉంది, దానికి ఆలోచన ఉంటుంది అని. ఆ ఆలోచన లోంచి పుట్టిందే 'యోధ'. ముందుగా 'మాతృత్వం – విభిన్న కోణాలు' పేరిట ఒక అవగాహన సదస్సును ఏర్పాటు చేశాను. అందులో దాదాపు 70 మంది రచయిత్రులు పాల్గొన్నారు. ఆ సదస్సులో మాట్లాడిన వక్తల ఆలోచనల నుండి 70మంది రచయితలు కథలు రాశారు. అందులో 53 మంది రచయితల రచనలు మాత్రమే ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి.



మాతృత్వం కాన్సెప్ట్‌తో వచ్చిన కథా సంకలనానికి 'యోధ' అని పేరు పెట్టడంలో ఉద్దేశ్యం?


'యోధ' అంటేనే పోరాట పటిమ కలిగి ఉండడం. ప్రతి విషయంలోనూ పోరాటం తర్వాతే విజయం ఉంటుంది. ప్రతి మనిషి రోజువారీ జీవితంలో కూడా అనేక పోరాటాలు చేయాల్సి ఉంటుంది. అది హద్దుల కోసం కావచ్చు, హక్కుల కోసం కావొచ్చు, మరే విషయంలోనైనా కావచ్చు. అలాగే కుటుంబంలో ప్రతి స్త్రీ ఎన్నో పోరాటాలు చేస్తేనే అనుకున్నది సాధించగలుగుతుంది. శతాబ్దాలుగా స్త్రీలపై నిత్యం పడుతున్న అదనపు భారం మాతృత్వం. అమ్మ అనిపించుకుంటేనే ఆడజన్మ సార్థకం అన్న నానుడి, పితృస్వామిక భావజాలం కలగలిపి స్త్రీలను కుటుంబ వ్యవస్థలో కట్టు బానిసలుగా మార్చివేసాయి. ఆ బానిసత్వం వెనుక ఉన్న కుట్రలను చదువుకున్న నేటి ఆధునిక స్త్రీలు గుర్తెరిగారు. మాతృత్వం అన్న దానిలో ప్రత్యేకత ఏమీ లేదనీ, అన్ని అనుభూతుల లాగే అదీ ఒక అనుభూతి అనీ తెలుసుకున్నారు. సమాజంలోనూ కుటుంబంలోనూ పురుషులతో ఏ సమానత్వ హక్కునైతే ఈనాడు స్త్రీలు కోరుకుంటున్నారో, అదే సమాన బాధ్యతను పిల్లల పెంపకం, వారి ఆలనా పాలనా విషయంలో కూడా అడుగుతున్నారు. ఆడవాళ్ళ భ్రమలు తొలగిపోయి మాతృత్వం అనేది స్త్రీ పురుషులిద్దరూ కలిసి మోయాల్సిన బాధ్యత అని ఇప్పుడు ఎలుగెత్తి అంటున్నారు. మాతృత్వం మాటున దాగిన దగాకోరుతనాన్ని ఒకవైపు నిలదీస్తూ మరోవైపు అందులోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ నిరంతరం పురుషస్వామ్యంతో పోరాడుతున్నారు. అందుకే వారిని నేను 'యోధ'లుగా చూస్తున్నాను. అందుకే 'యోధ' అనే పేరును మాతృత్వం భిన్న వ్యక్తీకరణలకు సూచనగా పెట్టాను.

ఇంటర్వ్యూ ■ గిరిజ పైడిమర్రి
✆ 99494 43414

నా మొదటి పుస్తకం

ముఖచిత్రం అసంతృప్తిని మిగిల్చింది

■ కొప్పర్తి



నా మొదటి పుస్తకం 'పిట్ట పాడే పాట కోసం'. మార్చి 1991లో అచ్చువేశాను. అది 1981–1991 మధ్య రాసిన కవిత్వం నుంచి ఎంపిక చేసిన కవితల సంపుటి. సమాజాన్ని మార్చడానికి కవిత్వం ఆయుధం అని భావించి రాసిన కవిత్వమే కానీ ఒక ఆహ్లాదకరమైన శీర్షికను ఉంచడాన్ని బట్టి ద్వైదీభావం ఏదో ఉండేదని నాకు తర్వాత అర్థమైంది. రాజమండ్రి సాహితీవేదిక, పోరుమామిళ్ల బ్రౌన్ సాహితీ సాంస్కృతిక సంస్థ, రాజోలు సాహితీ స్రవంతులలో భాగస్వామిగా ఉంటూ రాసిన కవిత్వమే అయినా నా ప్రధాన కవిత్వ కేంద్రం రాజమండ్రే. నా కవిత్వం సంపుటిగా రావాలని మొదట కాంక్షించింది డా. జయధీర్ తిరుమలరావు.

ఈ సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం మూడు వేలు ఆర్థిక సహాయం చేసింది. ప్రచురణకు అది సరిగ్గా సరిపోయింది. ముందుమాట ఎవరితోనూ రాయించ లేదు. రాజమండ్రి రత్నా ప్రింటర్స్‌లో అచ్చయ్యింది. పుస్తకం వెల ఐదు రూపాయలు పెట్టాను. ప్రచురణ బాధ్యత అంతా అప్పటికే 'కంజిర'ను అందంగా తెస్తున్న నామాడి శ్రీధర్, ఒమ్మి రమేశ్ బాబులు తీసుకున్నారు. మధ్యలో ముఖచిత్రం తతంగం ఒకటి జరిగింది. చిత్రకారుడు 'కాళ్ల'తో ముఖచిత్రం వేయించుకోవాలనే నా కోరిక తీర్చడానికి మిత్రులు గంగాధర్ నన్ను ఖమ్మం తీసుకెళ్లి ఆయనకు పరిచయం చేశారు. నావి కొన్ని కవితలు ఇచ్చి 'పిట్టపాడే పాట కోసం' శీర్షికకు బొమ్మ వేసివ్వమని కోరి వచ్చేశాం. నెలన్నర గడిచినా ఆయన నుంచి బొమ్మ రాలేదు. ఉత్తరాలకు జవాబు లేదు. ఇలా కాదనుకుని జయధీర్ తిరుమలరావు గారు నన్ను హైదరాబాద్‌లో మోహన్ దగ్గరకు తీసుకెళితే ఆయన సాయంత్రానికి బొమ్మ వేసిచ్చారు. అది పట్టుకుని ఇంటికి వచ్చేసరికి కాళ్ల నుంచి బొమ్మ వచ్చి ఉంది. ఆయన నేనడిగిన శీర్షికకు కాకుండా తనకు నచ్చిన 'ఆకలి నైరూప్యం కాదు' అనే కవితకు బొమ్మ వేసి పంపారు. ఏం చెయ్యాలో తెలీ లేదు. పుస్తకం పేరు మార్చుకోవడం నాకు ఇష్టం లేదు. అడిగి వేయించుకున్న కాళ్ల బొమ్మను తిరస్కరించడం అగౌరవించడమని భావించాను. ఆ సమస్య మోహన్ విషయం లోనూ ఉంది. చివరికి 'పిట్ట పాడే పాట కోసం' శీర్షికనే ఉంచి, కాళ్ల వేసిన బొమ్మతో, మోహన్ అక్షరాలతో ముఖచిత్రం వేశాం. ఈ నిర్ణయం పూర్తిగా నాదే. కానీ చివరకు శీర్షికకూ బొమ్మకూ పొంతన కుదరలేదనే అసంతృప్తి ఉండిపోయింది.

ఆవిష్కరణ ఆ సంవత్సరం వేసవిలో రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో జరిగింది. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షులు. శివారెడ్డి ఆవిష్కర్త.



పాపినేని శివశంకర్, సతీష్ చందర్‌లు సమీక్షకులు. మా అమ్మ నాన్నలు కనక దుర్గాంబ, అమర లింగేశ్వరరావులకు అంకితమిచ్చాను. సభ ఏర్పాట్లు అన్నాయ్ ప్రసాదమూర్తి చూశాడు. సంపుటికి అమలాపురం సరసం అవార్డు, హైదరాబాదు ఆంధ్ర మహిళా సభ దేవులపల్లి కృష్ణశాస్త్రి పురస్కారం వచ్చాయి. కృష్ణశాస్త్రి పురస్కారానికి న్యాయనిర్ణేత డా. ఎస్. గోపి. అప్పటి నా కవిత్వం నచ్చడానికి ఆస్కారంలేని ఇస్మాయిల్‌గారు ఒకసారి కలిసినప్పుడు నేను అడక్కుండానే "మీ కవిత్వంలో ఒక అక్షరం కూడా తీసెయ్యడానికి వీలులేని బిగువు ఉంటుంది" అన్నారు.

కేతు విశ్వనాథ రెడ్డి జీవితం, రచనలపై ప్రసంగం

సాహిత్య అకాడెమీ – యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప సంయుక్తంగా నిర్వహిస్తున్న 'నా దృష్టిలో...' కార్యక్రమంలో కేతు విశ్వనాథ రెడ్డి జీవితం, రచనలపై కాత్యాయనీ విద్మహే ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమం నవంబర్ 28 ఉదయం 10.30గంటలకు కవయిత్రి మొల్ల సమావేశ మందిరం, ఆర్ట్స్ బిల్డింగ్, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడపలో జరుగుతుంది.

సాహిత్య అకాడెమీ



మసకబారిన వెన్నెల బతుకు

గడియారంలోని ముండ్లు
ఒక దాని వెంట ఒకటి
విరామం లేకుండా ఉరికినట్టు
నువ్వు కూడా రోజంతా
కంటికి కనిపించని కాలం వెంటే
పరుగులు తీస్తుంటావు!

నువ్వు మంచం మీది నుండి
కాళ్లు నేల మీద దించేది
కాలం వెంట పరుగులు తీసేందుకే

ఎవరో తరుముతున్నట్టు
ఏదో అందుకోవాలన్నట్టు
అప్రకటిత పరుగు పందెంలో
ఎక్కడికో తెలియని
పరుగులు తీస్తుంటావు

రేపటి కోసం
ఇవాళ్టిని కోల్పోతుంటావు
గతాన్ని తలుచుకొని
ఒకింత ఉపశమనం పొందుతుంటావు
కోల్పోయిన వాటినన్నీ
కలల్లోనే ఊహించుకుంటూ
తాత్కాలిక సంతృప్తి చెందుతుంటావు


పరుగెత్తి పరుగెత్తి
అన్ని ఆనందాలు కోల్పోతుంటావు
అవి కోల్పోయావని
నువ్వు తేరుకునే సరికి
నిన్ను పరుగెత్తించిన
గడియారంలోని ముళ్లు
నువ్వు ఓడిపోయావని
పగలబడి నవ్వుతుంటాయి

నగరం మీద మసకబారిన
వెన్నెల బతుకు నీది
గట్టిగా నవ్వలేవు
అలాగని గట్టిగా ఏడ్వనూ లేవు
అంతా ఒక నటనల ప్రపంచంలో
ఉత్తమ నటుడివై
రోజుల్ని ఈదుతుంటావు

సడెన్‌గా నీకో గుండె ఉండాలని
ఏ అర్ధరాత్రో గుర్తుకొస్తుంది
ఛాతీ మీద చెయ్యేసి చూసుకుంటే
అక్కడ గడ్డకట్టిన సిమెంటు లాంటి
రాతి ముద్ద ఒకటి చేతికి తగులుతుంది
అది చూసి పొగిలి పొగిలి ఏడుస్తావు
చిత్రంగా ఒక్క కన్నీటి చుక్కా రాలదు!

లోకం మునిగిపోతున్నట్టు
కంగారుపడి
ఉలిక్కిపడి లేచి
అద్దం ముందుకొస్తావు
నీ రూపమే నీకు కనిపించదు
పైసల చెట్టొకటి పగలబడి నవ్వుతుంటుంది
ఇది చెప్పలేని హింసలకాలం
ఇది నిన్ను నువ్వే అప్పగించుకునే
కోర్కెల గాలం!

■ పసునూరి రవీందర్
✆ 77026 48825



నిర్వేద ఆయుర్వేదం!

ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం



వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు



మూతపడిన ఎక్స్‌రే యూనిట్

- పడకలు పెంచారు.. సిబ్బంది, పరికరాలు మరిచారు..
- రోగులకు శాపం.. వైద్య విద్యార్థులకు బోధనా లోపం..
- 100 పడకల రోగులకు 58 పడకల స్థాయి వైద్యులు, సిబ్బందే సేవలు
- దశాబ్దాలుగా తడబడి మూతపడిన ఎక్స్‌రే యూనిట్
- సర్కారు దృష్టి సారించాలంటున్న రోగులు

గిర్మాజిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారింది. అలాగే ఆయుర్వేద వైద్య విద్యార్థులకు బోధనా లోపంగా పరిణమించింది. ఆయుర్వేదంపై విశ్వాసం, మెరుగైన వైద్య సేవలు, దుష్ప్రభావాలు లేని మందులతో రోగుల సంఖ్య, బీఏఎంఎస్ సీట్లు పెరుగుతున్నా.. అవసరమైన వైద్యులు, సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు లేకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆస్పత్రిలో వంద పడకలున్నా.. వైద్యులు, సిబ్బంది మాత్రం 58 పడకల మేరకే ఉండటంతో రోగులున్నా.. వైద్యులు లేని పరిస్థితి నెలకొంది. వైద్యుల తరువాత అంతే కీలకమైన నర్సింగ్ సిబ్బంది అసలే లేని ఆస్పత్రిగా పేరు గడిచింది. దశాబ్దాలుగా ఎక్స్‌రే యూనిట్ వినియోగంలోకి రాకపోవడంతో అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి పరిస్థితి డిస్పెన్సరీకి ఎక్కువ.. బోధనకు తక్కువ.. అన్న చందంగా మారింది.

వరంగల్ రైల్వే, ఆర్టీసీ బస్‌స్టేషన్‌లకు కూతవేటు దూరంలో గ్రౌండ్, మొదటి అంతస్థులో నిర్మితమైన భవనంలో 100 పడకలతో వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి రోగులకు సేవలు అందిస్తోంది. అనంతలక్ష్మి వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు బోధన ఆస్పత్రిగా నిత్యం 300 అవుట్ పేషంట్‌లు, 90 మంది ఇన్‌పేషంట్‌లకు మెరుగైన ఆయుర్వేద వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ రోగుల విశ్వాసాన్ని చూరగొంది. ఆయుర్వేదంలో కీలకమైన కాయచికిత్స (జనరల్ మెడిసిన్), పంచకర్మ (ఆయుర్వేద ప్రత్యేక వైద్య చికిత్స), శల్య (జనరల్ సర్జరీ), శాలక్య (చెవి, ముక్కు, గొంతు), కౌమారభృత్య (పిల్లల విభాగం), ప్రసూతి స్త్రీరోగ (గైనకాలజీ), స్వస్థ్యరక్షణ (ప్రివెంటివ్ మెడిసిన్) విభాగాలు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఆస్పత్రిలోని 100 పడకలలో కాయచికిత్సకు 25, పంచకర్మకు 25, శల్యకు 15, శాలక్యకు 10, కౌమార భృత్యకు 10, ప్రసూతి స్త్రీ రోగకు 15 పడకలతో వార్డులున్నాయి. జలుబు, దగ్గు, జ్వరం, మధుమేహం రోగులు కాయచికిత్స వార్డులో, పక్షవాతం, కీళ్లు, నడుము, వెన్నుముక, స్పాండిలైటిస్ రోగులు పంచకర్మ, అర్షమొలలు, భగంధరం, వెరికోస్ వెయిన్స్, డయాబెటిక్ ఫుట్ రోగులు శల్య వార్డులో, మైగ్రేన్, సైనసైటిస్, సోరియాసిస్ రోగులు శాలక్య వార్డులో, పిల్లలకు సంబంధించి ముఖ్యంగా మానసికంగా, శారీరకంగా ఎదుగుదలలేని, నడువలేని వ్యాధులకు కౌమార భృత్య వార్డులో, ప్రసవాలు, స్త్రీ సంబంధిత వ్యాధులకు ప్రసూతి స్త్రీ రోగ వార్డులో వైద్య చికిత్స పొందుతారు. అన్ని ఇన్‌పేషంట్ వార్డులలో సుమారు 80 మందికి పైగా రోగులు వైద్య చికిత్సలు పొందుతుంటారు. అలాగే ప్రైవేటు చార్జీలతో ప్రత్యేక గదులు కూడా ఉన్నాయి.

100 పడలకు 58 పడకల సిబ్బందే..

ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు అనుబంధ బోధన ఆస్పత్రిగా ఉన్న దీన్ని 58 పడకల నుంచి 100 పడకలకు రాష్ట్ర ప్రభుత్వం 20ఏళ్ల కిందటే అప్‌గ్రేడ్ చేసింది. అంతేకాదు 150 పడకల స్థాయిలో ఆస్పత్రికి ప్రస్తుత నూతన భవనం నిర్మించారు. కానీ, పడకలను పెంచి నూతన భవనం నిర్మించినా గత ప్రభుత్వాలు వైద్యులు, సిబ్బంది, మౌలిక వసతులను 100 పడకల స్థాయిలో పెంచకపోవడంతో ఆయుర్వేద వైద్యం అరకొరగానే అందుతుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయుర్వేద వైద్యంకు సంబంధించిన 8 వైద్య విభాగాలలో అవసరమైన వైద్యులకు తోడు వైద్య సహాయకులు లేని పరిస్థితి ఉంది. దీంతో నిత్యం ఆస్పత్రికి వచ్చే 300లకు పైగా ఔట్‌పేషంట్, ఆస్పత్రిలో ఉండే 90 ఇన్‌పేషంట్ రోగులకు తగిన వైద్య చికిత్సలు అందించడంలో వైద్యులు, సిబ్బందిపైనే తీవ్రమైన ఒత్తిడి పడుతున్నదని అంటున్నారు.

మూతపడిన ఎక్స్‌రే యూనిట్

ఆస్పత్రి ప్రారంభంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యూనిట్ పాడవటంతో దానిని మరమ్మతు చేయించకపోవడంతో పాటు రేడియోగ్రాఫర్, ఎక్స్‌రే టెక్నీషియన్ తదితర పోస్టులు రిటైర్ అవడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో ఎక్స్‌రే యూనిట్ మూతపడి దశాబ్దాలు గడిచింది. నడుము, కీళ్ల నొప్పులు, స్పాండిలైటిస్, మెడనొప్పులు, పక్షవాతం తదితర వ్యాధులకు పంచకర్మలో మంచి చికిత్స ఉన్నప్పటికీ ఈ రోగులకు ఎక్స్‌రే తప్పనిసరి. దీంతో ఈ రోగులు బయట ఎక్స్‌రే, ఎంఆర్ఐ ప్రైవేటుగా తీయించుకుని ఇక్కడ ఆయుర్వేద వైద్యచికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో పాడైన ఎక్స్‌రే యూనిట్ స్థానంలో కొత్తగా కలర్ డాప్లర్, స్కానింగ్, ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.



నర్సింగ్, నాలుగో తరగతి సిబ్బంది అసలే లేరు..

ఈ ఆస్పత్రిలో వైద్యుల తరువాత అంతే ప్రాముఖ్యం ఉన్న నర్సింగ్ అధికారులు అసలే లేరు. ఆస్పత్రిలోని 7 నర్సింగ్ అధికారులు, ఒక సీనియర్ నర్సింగ్ అధికారి (హెడ్‌నర్సు) రిటైర్ అయి సంవత్సరాలు గడుస్తోంది. ప్రభుత్వం ఇంత వరకు ఇక్కడ నర్సింగ్ అధికారులను నియమించలేదు. అలాగే నాలుగో తరగతి సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రిలో ఊడ్చడం మొదలు ఆపరేషన్ థియేటర్‌లో వైద్య సహాయకులు లేరు. ఆస్పత్రికి సెక్యూరిటీ సిబ్బంది సైతం లేకపోవడంతో వరంగల్ బస్, రైల్వేస్టేషన్‌లలో గంజాయి సేవించి తిరిగే పలువురు వ్యక్తులు రాత్రి వేళ ఆస్పత్రిలో చొరబడి రోగుల వస్తువులు దొంగిలిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ అల్లోపతి ఆస్పత్రి తరహాలో ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలోనూ సెక్యూరిటీ, పారిశుధ్యం, రోగుల సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఏర్పాటుచేస్తే ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుతాయని ప్రజలు అంటున్నారు. ఆస్పత్రిలో సిబ్బంది, వైద్యులు, వైద్య పరికరాల కొరతను ప్రభుత్వం సత్వరం తీర్చితే రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు, వైద్య విద్యార్థులకు మెరుగైన బోధన అందుతాయంటున్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పాల్గొన్న కలెక్టర్ సత్యశారద

కుటుంబ సర్వేలో డాటా ఎంట్రీ కీలకం

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన డాటాను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయడం కీలకమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఉదయం జార్ఖండ్ రాజధాని రాంచీ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా హైదరాబాద్ నుంచి ఆర్థిక, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. కుటుంబ సర్వేలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తాయని, అలాంటి వారికి ఫోన్ చేసి సర్వే వివరాలను సేకరించాలని సూచించారు. కొన్ని వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు అవుతున్నాయని, ఆయా పాఠశాలల్లో అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్యూమరేటర్లు స్వయంగా డాటా ఎంట్రీ ఆపరేటర్ల వద్ద ఉండి ఎంట్రీ చేయిస్తున్నారని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వివరాలను నమోదు చేస్తున్నారని వివరించారు. గ్రామాల్లో స్టిక్కర్ వేసిన వారి ఇంటికి అధికారులు సర్వేకు రాకపోతే పంచాయతీ సెక్రటరీని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీవో గోవింద రాజన్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలి..

- ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం
- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) వరంగల్ జిల్లా 6వ మహాసభ వరంగల్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు చేస్తున్న సంఘం టీఎస్ యూటీఎఫ్ అన్నారు. యేడాది గడిచిపోయినప్పటికీ పీఆర్‌సీ అమలులో తాత్సారం తగదని, వెంటనే నివేదికను తెప్పించుకొని అమలు చేయాలన్నారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల ఒంటిపూట బడులతో విద్యకు దూరమవుతున్నారని, కులగణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు డాటా ఎంట్రీ విధులు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో అశాస్త్రీయ ఆలోచనలు పెంపొందించే విధంగా ఉన్న ఎన్ఈపీ 2020ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు సోమశేఖర్, మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాద్‌రావు, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ సంపాదకవర్గ సభ్యురాలు విద్యాదేవి, ఎస్.సదానందం, సదాశివరెడ్డి, మేకిరి దామోదర్, అన్నాదేవి, రవూఫ్, పెండెం రాజు, కిరణ్ కుమార్, శ్రీనివాస్, లింగమూర్తి, శ్రీనివాస్, రవీందర్, విజయ్, సమ్మక్క, రమేశ్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం బల్దియా ఆవరణలోని పౌరసేవా కేంద్రంలో జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్దియా కౌన్సిల్ హాల్ మరమ్మతు జరుగుతున్న నేపథ్యంలో ఈ వారం బల్దియా కార్యాలయం ముందు గల పౌరసేవా కేంద్రం కార్యాలయంలో జరుగుతుందని వెల్లడించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

పర్యాటక స్థలాలను చుట్టొద్దాం..

- తెలంగాణ దర్శినితో విద్యార్థులకు అవకాశం
- పర్యాటక ప్రాంతాలపై అవగాహనే లక్ష్యం
- విద్యాశాఖ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అమలు
- నిధులు విడుదల చేసిన సర్కారు
- ఉమ్మడి జిల్లాలో 12వేల మంది విద్యార్థులకు లబ్ధి

8



మహాకాళేశ్వరుడిగా రుద్రేశ్వరుడు

హనుమకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరుడిని మహాకాళేశ్వరుడిగా అలంకరించారు. కార్తీకమాసం ఆదివారం ప్రాతఃకాల నిత్యాన్హిక పూజా కార్యక్రమాల అనంతరం రుద్రేశ్వరస్వామి వారికి 51 కిలోల పెరుగన్నంతో మహా అన్న సూక్త మంత్ర పఠనం, మహాన్న పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఉజ్జయిని మహాకాళేశ్వరుడిగా అలంకరించారు. తదనంతరం భక్తులకు చిత్రాన్న ప్రసాదం వితరణ చేశారు. సోమవారం మారేడు దళబిల్వార్చన, కార్తీకమాసం చివరి సోమవారం పుష్కరించుకొని కార్తీక వనభోజనం, కార్తీక సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు.

‘లగచర్ల’పై ప్రభుత్వం దిగివచ్చేంతవరకు పోరాడుతాం

- తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వంద సీట్లు గెలుస్తాం..
- మానుకోటలో నేటి మహాధర్నాను జయప్రదం చేయండి
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మహబూబాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మహబూబాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్ల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి గిరిజన రైతులకు న్యాయం చేసేంతవరకు బీఆర్ఎస్ పోరాటాలు ఆగవని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. మహబూబాబాద్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడుతూ.. లగచర్లలో గిరిజన రైతులకు జరిగిన అన్యాయంపై మానుకోటలో ధర్నా నిర్వహిస్తామంటే ఎందుకంత భయపడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధర్నాను అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. కోర్టు అనుమతితో ధర్నా నిర్వహించేందుకు తాము సిద్ధం కాగా, ఎవరు ధర్నాకు వెళ్లవద్దంటూ బెదిరింపులు ఆరంభం చేశారని విమర్శించారు. సీఎం తన సొంత నియోజకవర్గంలోని గిరిజనులపై దౌర్జన్యాలెందుకని ప్రశ్నించారు. మహారాష్ట్రలో దుమ్ములేపుతానని వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసిన స్థానాల్లో కాంగ్రెస్ ఓటమి పాలైందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ బయటకు వస్తేనే సభలకు అనుమతి ఇవ్వడం లేదని, ఇక మాజీ సీఎం కేసీఆర్ వస్తే ఇస్తారా? అంటూ నిలదీశారు. రాష్ట్రంలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలొచ్చినా బీఆర్ఎస్ పార్టీ వంద సీట్లు గెలుస్తుందని ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇది తాము చెబుతున్నది కాదని, కాంగ్రెస్ సర్వేలే చెబుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన వల్ల రాష్ట్ర ఆదాయం పడిపోయిందని, పరిశ్రమలు రావడం లేదని పేర్కొన్నారు. సీఎం సొంత ఊరిలో ఆయన సోదరుల ఒత్తిళ్లతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు ఎంతో మేలు చేసిందని, తండాలను జీపీలుగా చేయడంతో పాటు 10శాతం రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. మహబూబాబాద్‌లో సోమవారం జరిగే ధర్నాలో ప్రజలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


సీఎం ఎందుకు స్పందించడం లేదు..

లగచర్లలో గిరిజనులకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో రాహుల్‌గాంధీ జోడోయాత్ర, రేవంత్‌రెడ్డి పాదయాత్రకు అనుమతిచ్చామని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ధర్నాలు చేసే, సభలు పెట్టుకునే హక్కు ఉంటుందని, అది అధికార కాంగ్రెస్‌కు తెలవకపోవడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా నిర్వహిస్తామని అనుమతి కోరితే ప్రభుత్వం అడ్డుకుందని, హైకోర్టును ఆశ్రయిస్తే అనుమతిచ్చిందని, ఇది ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని చెప్పారు. మాజీ మంత్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్ మాట్లాడుతూ... లగచర్లలో గిరిజనులపై దాడి దుర్మార్గమైన చర్య అని అన్నారు. మానుకోట మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత మాట్లాడుతూ.. లగచర్ల రైతులకు మద్దతుగా ఈ నెల 25న మానుకోటలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా ఉంటుందని, అన్నివర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులకు భయపడి సీఎం రేవంత్‌రెడ్డి యూటర్న్ తీసుకున్నారని అన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీల కోసం కాదని, పారిశ్రామిక కారిడర్‌ను ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని తెలిపారు.

అనంతరం జిల్లా కేంద్రంలోని తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించే ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మర్రి రంగారావు, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బానోత్ రవికుమార్, ఎమ్డీ. ఫరీద్, తేళ్ల శ్రీను, నాయిని రంజిత్, అయూబ్‌పాషా, మంగలంపల్లి శ్రీనివాస్, కన్న, జెరిపోతుల వెంకన్న, ఎడ్ల వేణు, బూర్ల ప్రభాకర్, మార్నేని రఘు, అశోక్‌నాయక్, బోడ లక్ష్మణ్, గోగుల రాజు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో నగరాభివృద్ధిని వివరించండి...

- సీఎం ప్రకటించిన వరాలను ప్రచారం చేయాలి
- ట్విట్టర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే నాయినితో టీపీసీసీ మీడియా చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి
- రేవంత్‌రెడ్డి లక్ష్యాల సాధనే ధ్యేయంగా కృషి : నాయిని



మీడియా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్న సహకారం, అభివృద్ధి ఫలితాలను సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి సూచించారు. సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. శనివారం రాత్రి ట్విట్టర్ ద్వారా రామ్మోహన్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వరంగల్ నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికపై నిత్యం విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఇందుకు సోషల్ మీడియా సెల్‌ను పటిష్ఠం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించాలని నాయిని రాజేదర్‌రెడ్డికి సూచించారు.

వరంగల్ నగరాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నడూ లేని రీతిలో నిధుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళిక విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. రూ.84 కోట్లతో నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి, రూ.30 కోట్లతో భద్రకాళి మాడవీధుల నిర్మాణం, రూ.6కోట్లతో గోకుల్‌నగర్ జంక్షన్ నుంచి రాజాజీనగర్ వరకు సైడ్ డ్రెయిన్ నిర్మాణం, రూ.28 కోట్లతో పాలిటెక్నిక్ భవన నిర్మాణం, రూ.50కోట్లతో రోడ్ల మరమ్మతు పనులు, రూ.10కోట్ల సీడీపీ నిధులతో చేపట్టే అభివృద్ధి, రూ.90కోట్లతో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం పూర్తి, రూ.15 కోట్లతో నగరంలోని కూడళ్ల అభివృద్ధి, రూ.4170 కోట్లతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.205 కోట్లు, వివిధ నగరాభివృద్ధి పనుల కోసం కేటాయించిన రూ.180కోట్లతో పాటు జీడబ్ల్యూఎంసీ పరిపాలన భవనానికి మంజూరైన రూ.34కోట్ల నిధులు, ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం తదతర నిర్మాణ పనుల వివరాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రామ్మోహన్‌రెడ్డి దిశా, నిర్దేశం చూశారు.

సీఎం ఆశయ సాధనే లక్ష్యంగా..

వరంగల్ నగరాభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేస్తున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు రామ్మోహన్‌రెడ్డికి అభివృద్ధి పనులు, నిధుల వినియోగం తదితర అంశాలను తెలియచేశారు. ముఖ్యమంత్రి ప్రకటించిన వరాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామన్నారు. అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయిలో ఆవిష్కరించడం ద్వారా ప్రజల ఆశీస్సులు పొందుతున్నట్లు రాజేందర్‌రెడ్డి తెలియచేశారు. ఇక కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు ఖండిస్తూ ప్రజలకు ఆ వివరాల స్పష్టం చేస్తున్నట్లు రాజేందర్‌రెడ్డి వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయపాల్‌రెడ్డి

వినియోగదారుల హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

వడ్డెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ సౌత్ ఇండియా వైస్ ఛైర్మన్ జయపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలోని సంస్థ కార్యాలయంలో డివిజనల్ సెక్రటరి కె. సూర్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 ప్రకారం వస్తువులను కొనుగోలు చేసిన వినియోగదారుడు తమ రశీదులను భద్రపర్చుకోవాలని తద్వారా ఏమైనా మోసాలు జరిగితే ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర, జిల్లా నాయకులు దేవా సాంబమూర్తి, నారగోని జగదీష్, వెంకటేశ్వర్లు, రాజయ్య, లక్ష్మీనారాయణ, దారం జనార్ధన్, అనితారెడ్డి, గట్టు రవి, హరీష్ , తిరుపతి, రాంచందర్, శైలజ పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 24:(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(డబ్ల్యూడీసీఏ) మూడేళ్ల కాలపరిమితి ఈనెల 28న ముగియనున్న నేపథ్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడానికి ఎన్నికల షెడ్యూల్‌ను క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపు సమ్మిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ నెల 25నుంచి 27వరకు పోటీలో నిలిచే అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు అందజేయుట, 28నుంచి 30వరకు నామినేషన్లు సమర్పించుట, డిసెంబర్ 2న స్క్రూటిని, 3న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అదే విధంగా 4న ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తుది జాబితా విడుదల, డిసెంబర్ 8న హనుమకొండ హంటర్‌రోడ్ లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో ఉదయం 11గంటల నుంచి 2గంటల 30నిమిషాల వరకు ఎన్నికలు ప్రక్రియ నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను విడుదల చేస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 45క్లబ్‌లకు గాను 45ఓట్ల బలం ఉండగా 1అధ్యక్ష పదవి, 5ఉపాధ్యక్షులు, 1ప్రధాన కార్యదర్శి, 1సంయుక్త కార్యదర్శి, 1కోశాధికారి, 4ఈసీ మెంబర్లు మొత్తం 13సభ్యులతో నూతన కార్యవర్గం కొలువు దీరనుంది. అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగుతుందని సమ్మిరెడ్డి వెల్లడించారు.

క్యాన్సర్‌పై వినూత్న ప్రచారం



శ్రీకాంత్‌కు స్వాగతం పలుకుతున్న వైద్యులు

కాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పురుషులకు మాత్రమే వచ్చే ప్రోస్టేట్ గ్రంధి క్యాన్సర్‌పై అవగాహన కలిగించేందుకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ అథ్లెట్ తాడు శ్రీకాంత్ వినూత్న ప్రచారం నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి రన్నింగ్ చేస్తూ ఫాతిమానగర్‌లోని సెయింట్ ఆన్స్ ఆస్పత్రికి వచ్చారు. ఆసుపత్రి బృందం శ్రీకాంత్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రజలు ఆదా చేసిన డబ్బులను తనకు ఇస్తే క్యాన్సర్‌పై చికిత్సలు చేసే సంస్థలకు అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవయ్య, ధామసమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించాలి

సంస్మరణ సభలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ప్రజాస్వామిక, వామపక్ష, లౌకికవాదుల ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలికే పాలకులే ప్రొఫెసర్ సాయిబాబాను హత్య చేశారని, సాయిబాబా ఆశయాలను కొనసాగించినప్పుడే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ.. సాయిబాబా జీవితమే పోరాట సందేశమని, ఆయన ఎప్పుడు విప్లవోద్యమ పక్షాన ఉండి పోరాటం చేశాడన్నారు. రిజర్వేషన్ల ఉద్యమంలో బహుజనుల పక్షాన ఉండి చురుకుగా పాల్గొన్నాడని, ఖైదీల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు సాయిబాబా అని, నడవలేని సాయిబాబా సమాజానికి నడక నేర్పాడన్నారు. సాయిబాబా కుమార్తె మంజీర మాట్లాడుతూ.. 'నాన్న నాకు ఎప్పుడు ఉత్తరం రాసినా ధైర్యంగా ఉండేదని, నేను నాన్నను కోల్పోలేదు, ఆయన ఆలోచనలు నాలోనే ఉన్నాయి' అని భావోద్వేగానికి లోనయ్యారు.

అనంతరం సాయిబాబాపై కవి శోభా రమేష్ రాసిన డాక్యుమెంటరీ పాటను సాయిబాబా కూతురు మంజీరా ఆవిష్కరించారు. గంటా రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో వెంగల్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నున్నా అప్పారావు, అరసం రాష్ట్ర అధ్యక్షులు పల్లేరు వీరస్వామి, మార్క శంకర్‌నారాయణ, సిద్దోజు రామబ్రహ్మం, రమేష్ చంద్ర, శాంతి, బిల్లా మహేందర్, రాజ్ మహ్మద్, దొమ్మాటి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్రికెట్ టోర్నీ విజేత వాగ్దేవి కళాశాల జట్టు

రన్నర్‌గా సుబేదారి యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ● బహుమతులను అందజేసిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ పురుషుల టోర్నమెంట్ వరంగల్ జోన్ విజేతగా కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల నిలిచింది. రన్నర్‌గా సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గెలుపొందింది. మూడు రోజులుగా కేయూ క్రీడామైదానంలో హోరాహోరీగా జరిగిన టోర్నీలో ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి మొదటగా బ్యాటింగ్‌కు దిగిన బహుమతి వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 183 పరుగులను సాధించింది. వాగ్దేవి కళాశాల జట్టుకు చెందిన జాకోబ్ 33 బంతుల్లో 43 పరుగులు, శివరాం 35 బంతుల్లో 42 పరుగులు చేశారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల చెందిన రాజేందర్ 2 వికెట్లు తీశారు. రెండవ ఇన్నింగ్స్‌లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 127 పరుగులకు జట్టు కుప్పకూలింది. ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సందీప్ 31 పరుగులు, కల్యాణ్ 26 పరుగులు సాధించారు. వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల జట్టు 56 పరుగుల తేడాతో విజయం సాధించింది.



క్రికెట్ విజేతగా నిలిచిన వాగ్దేవి క్రీడాకారులకు ట్రోఫీ ఇస్తున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వెంకయ్య

వాగ్దేవి జట్టుకు క్రికెట్ ట్రోఫీ అందచేత

గెలుపొందిన వాగ్దేవి కళాశాల జట్టుకు ఆదివారం సాయంత్రం కేయూ క్రీడా మైదానంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తదితరులతో కలిసి గెలుపొందిన జట్టుకు ట్రోఫీ, బహుమతులను అందచేసి క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.హరేందర్‌రెడ్డి, కొమురెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ అబ్బాల్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.భాస్కర్, మధుకర్, పల్లెపు కిషన్, బత్తిని జీవన్, మోహనకృష్ణ, రాము, మట్టెడ కుమార్, మహ్మద్ అస్లాం, ఎంపైర్స్ బండారి ప్రభాకర్, వేల్పుల సురేశ్‌లు వ్యవరించారు. ఈ సందర్భంగా వాగ్దేవి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్‌చందుపట్ల దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శేషాచలంలు క్రీడాకారులను అభినందించారు.



బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా రంజిత్

హనుమకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ విద్యార్థి సంఘం కొత్త అధ్యక్షుడిగా బొమ్మ రంజిత్ నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్,, ఉమ్మడి జిల్లా ఈసీ సంఘం అధ్యక్షుడు బుట్టి శ్యాందేవ్ సిఫార్సుల మేరకు ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ.. తనకు పదవి రావడానికి తోడ్పాటు అందించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య, పులి శ్రీనివాస్, బుట్టి శ్యాందేవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాని, బీసీ విద్యార్థుల పోరాటాన్ని కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.



ఇంతకీ ఎంజీఎం బాస్ ఎవరు?

- ఆమోదం కాని సూపరింటెండెంట్ డాక్టర్ మురళి రాజీనామా
- పోస్టుకోసం మరో ఇద్దరు మాజీ సూపరింటెండెంట్ల ప్రయత్నం?

వరంగల్ మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ రాజీనామాతో సూపరింటెండెంట్ ఎవరు అనే అయోమయం నెలకొంది. ఆయన రాజీనామాపై ప్రభుత్వం కూడా ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదు. ఫలితంగా ఎంజీఎంకు బాస్ ఎవరూ అన్నదానిపై స్పష్టత లేదు. పరిపాలనపరమైన విషయాలు, రోగుల సమస్యలపై ఎవరు స్పందిస్తారో అర్థం కాని పరిస్థితి ఎంజీఎంలో నెలకొంది. కొద్దికాలంలోనే అందరినీ కలుపుకొని ఎంజీఎంలో సమర్థవంతంగా నడిపిస్తున్న సమయంలో కొన్ని అనుకోని సంఘటన వల్ల రాజీనామా చేయడం పై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మరో ఇద్దరు మాజీల ప్రయత్నం

ఎంజీఎం ఆస్పత్రిలో సూపరింటెండెంట్ విధులు నిర్వరిస్తూ అనుకోని ఘటన వల్ల ఆకస్మికంగా మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయిన డాక్టర్ శ్రీనివాస్‌ను కూడా ఎంజీఎం సూపరింటెండెంట్‌గా నియమించే యోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు సమాచారం. డాక్టర్ శ్రీనివాసరావు ఎంజీఎంలో పనిచేసిన కాలంలో సమర్థతతో విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందారు. అనుకోని ఓ సంఘటన వల్ల ఆయన బదిలీకి కారణమైంది. అయితే డాక్టర్ శ్రీనివాస్ ఎంజీఎంకు గానీ.. కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, డాక్టర్ మురళీకి ముందు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలకు ప్రొఫెసర్‌గా బదిలీ అయిన మరో వైద్యుడు కూడా ఎంజీఎం సూపరింటెండెంట్‌గా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరితోపాటు ఎంజీఎం ఆర్థో విభాగం అధిపతి ప్రొఫెసర్ కిశోర్ కూడా ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో సిద్దిపేటలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది.

కుంటుపడిన ఎంజీఎం పాలన?

ఎంజీఎంలో ఏ పనికైనా సూపరింటెండెంట్ అనుమతి తప్పనిసరి. డాక్టర్ చిలుక మురళి రాజీనామాతో పరిపాలన మొత్తం స్తంభించినట్లు తెలుస్తోంది. వివిధ అవసరాల కోసం వచ్చే రోగులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.

రేపు కేయూలో భారత రాజ్యాంగ దినోత్సవ సదస్సు

కేయూ క్యాంపస్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో నవంబరు 26న భారత రాజ్యాంగ దినోత్సవ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఇండియన్ కాన్‌స్టూషన్ అండ్ డెమొక్రటిక్ గవర్నెన్స్: ఏ ప్రాసెక్టివ్ అనే అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వక్తగా కేయూలా కళాశాల రిటైర్డు ప్రొఫెసర్ విజయచంద్రలు హాజరై ప్రసంగిస్తారు. సదస్సుకు ముందు అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులతో కలసి వర్సిటీ మొదటి గేటు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర, అంబేద్కర్ విగ్రహనికి పూల మాలతో నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌కు చేరుతారు.

బీఆర్ఎస్, బీజేపీలవి దిగజారుడు రాజకీయాలు

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బోనస్ బోగస్ అంటూ బోగస్ మాటలు మాట్లాడడం సరికాదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం ఘన్‌పూర్ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మాజీ హరీశ్‌రావు మాటిమాటికీ బోనస్ బోగస్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు అడుగడుగునా సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. ఇలాంటి దివాలాకోరు రాజకీయాలను మానుకోవాలని సూచించారు. ప్రభుత్వం వచ్చి ఏడాది కూడా కాలేదని, అప్పుడే ఎన్నికలు వచ్చే అవకాశం కూడా లేనప్పటికీ ప్రతిపక్షాలు హడావుడి చేస్తున్నాయంటే ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు ఎంత అక్కసుతో ఉన్నారో అర్థమవుతోందన్నారు. జనగామ జిల్లాలో రూ.134కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేస్తే ఇప్పటివరకు రూ90కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని, వెయ్యి మంది రైతులకు బోనస్ చెల్లించామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, నూకల ఐలయ్య పార్టీ మండలాధ్యక్షులు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, గడ్డమీది సురేష్, లింగాజీ, అంబటి కిషన్‌రాజ్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

కాజీపేట జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో నవంబరు 30, డిసెంబరు 1 తేదీల్లో జరుగనున్న భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహా సభలను జయప్రదం చేయాలని ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ కోరారు. ఆదివారం ఐఏఎల్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్దన్ అధ్యక్షతన నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు, హత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని న్యాయవాదులకు తగిన రక్షణ చట్టాలు లేవని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకొని రక్షణ చట్టాలను అమలు చేయాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజలకు చట్టాల, హక్కుల అమలుకు నిరంతరం కృషి చేస్తూ దేశ సామాజిక పురోగతికి దోహదపడుతున్న న్యాయ వాదుల జీవితాలకు ఎలాంటి గ్యారంటీ లేదని అన్నారు. నిధుల కేటాయింపులు లేవని నామమాత్రంగా కొన్ని చర్యలు ఉన్నప్పటికీ జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్, హౌసింగ్ స్కీం, వృద్ధాప్యంలో ప్రవేశించిన న్యాయవాదులకు ఆరోగ్య పథకం , సంక్షేమ నిధి పెంపు వంటి చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి భీమనాథం, శ్రీనివాస్, ఉపాధ్య క్షుడు ప్రేమ్‌సాగర్‌రావు, వలస సుధీర్, బిల్ల ప్రభాకర్, ట్రెజరర్ గంజి గణేష్, సహాయ కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, ప్రచార కమిటీ కో ఆర్డినేటర్లు కొత్తపల్లి చిరంజీవి, మెరుగు సుభాష్ పాల్గొన్నారు.

ఖాకీ దోబూచులాట!

- సీఐ రవికుమార్ కోసం పోలీసుల వేట
- కేసు నమోదైనా చిక్కని పోక్సో కేసు నిందితుడు
- రాజీ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి
- టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సవాల్‌గా మారిన వ్యవహారం



హనుమకొండ టౌన్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కరుడుగట్టిన నేరస్థులను కటకటాల్లోకి పంపించిన ఘనత ఉన్న వరంగల్ కమిషనరేట్ పోలీసులకు పోక్సో కేసులో నిందితుడైన పోలీసు అధికారిని పట్టుకోవడం సవాల్‌గా మారింది. కేసు నమోదై చాలా రోజులైనా పోలీసులకు దొరకకుండా ఎప్పటికప్పుడు స్థావరాలను మార్చుతూ ముచ్చెమటలు పట్టిస్తున్నాడు. చిక్కడు.. దొరకడైన ఈ అధికారి వ్యహారం కవిషనరేట్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

గత నెల 22న కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధి వడ్డెపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సీఐ రవికుమార్ అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న తన కూతురి స్నేహితురాలైన బాలికను లైంగికంగా వేధించడంతో పోక్సో కేసు నమోదైంది. వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిన రవికుమార్.. రాజీకి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఇంతలోనే ఈ కేసు విచారణాధికారిగా ఉన్న సెంట్రల్ జోన్ డీసీపీ.. అపార్ట్‌మెంట్‌ను సందర్శించి బాధిత కుటుంబం నుంచి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు అందజేశారు. అనంతరం సీఐపై పోలీసు ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటువేశారు. అయితే అజ్ఞాతంలో ఉన్న రవికుమార్ కోసం టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందం విస్తృతంగా గాలింపు చేపడుతోంది. అయినా పట్టుబడకుండా తప్పించుకుంటూ పోలీసులకు అగ్ని పరీక్ష పెడుతున్నట్లుగా తెలుస్తోంది. పోలీసు అధికారిగా తనకున్న తెలివితేటలతో తప్పించుకుంటున్నాడా? లేదా పోలీసుశాఖ నుంచి ఎవరైనా సమాచారం చేరవేస్తున్నారో.. తెలియదు కానీ పోలీసుల స్కెచ్‌ను ముందే పసిగడుతూ ఎప్పటికప్పుడు స్థావరాలను మార్చుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నాడు.

అయితే ఎంతటి కరుడుగట్టిన నేరస్తుడినైనా పట్టుకొని కటకటాలపాలు చేసే కమిషనరేట్ పోలీసులు ఈ టెక్నాలజీ యుగంలో రవికుమార్‌ను పట్టుకోవడంలో ఎందుకు విఫలమవుతున్నారనేది అంతుచిక్కని ప్రశ్న. అయితే రవికుమార్ విషయంలో మొదటి నుంచి కొందరు పోలీసులు సహకరిస్తూ ఎలాంటి విషయాలను బయటకి పొక్కకుండా దాచిపెడుతున్నారనేది పలువురు అభిప్రాయపడుతున్నారు. కేసు నమోదైన తర్వాత కూడా వివరాలను వెల్లడించడానికి పోలీసులు ఇష్టపడలేదని, చివరికి ఆన్‌లై...న్‌లో ఎఫ్ఐఆర్ సైతం కనిపించకుండా తొలగించారని తెలుస్తోంది. రవికుమార్ విషయం వెలుగులోకి వచ్చాక ప్రత్యేకంగా ఆయన చేసిన అవినీతి, ఆరాచకాలపై గుర్తుతెలియని వ్యక్తి కరపత్రం విడుదల చేయడం వరంగల్ కమిషనరేట్‌లో కలకలం రేపింది. రవికుమార్ విషయంలో పోలీసులు ఆయనను పట్టుకొని పోలీసుశాఖపై వచ్చే ఆరోపణలకు చెక్‌పెడతారో లేదో చూడాలి.

దేశం మోదీ నాయకత్వాన్ని కోరుతోంది

బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రదీప్‌రావు

శంభునిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశమంతా నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ పాలనను కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించిన సందర్భంగా ఆదివారం శంభునిపేట జంక్షన్‌లో సంబురాలు నిర్వహించారు. మోదీ చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. 100 మంది అడ్డా కార్మికులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలో సైతం రామరాజ్యం స్థాపిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని మహారాష్ట్ర ప్రజలు విస్మరించారని, కర్ణాటక, తెలంగాణలో బూటకపు హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేసినా హామీలు అమలు చేయకపోవటాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు శేర్ల అనిల్ కుమార్, కర్నె రవీందర్, మోహనాచారి, చాపల నాగరాజు, సుధీర్, దుబ్యాల అశోక్, పి.చంద్రశేఖర్, బోయిని రాజు, పస్తం భిక్షపతి, పెద్దపల్లి సుకుమార్, మాదాసి రాజు, శేఖర్, కర్నె వాసుదేవ్, గందె గోపి, శివరాత్రి వెంకన్న, సాంబయ్య, మహిళా నాయకులు పాల్గొన్నారు.

కోటలో ప్రారంభమైన బొడ్రాయి వేడుకలు



బొడ్రాయి వేడుకలలో దేవతామూర్తుల అలంకరణ

ఖిలావరంగల్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత భూలక్ష్మి, మహాలక్ష్మి సమేత నాభిశిల బొడ్రాయి 5వ వార్షికోత్సవాన్ని ఖిలావరంగల్‌లో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు ఇనుముల మల్లేశం అధ్యక్షతన అర్చకులు పాలకుర్తి సుబ్రహ్మణ్యం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బైరబోయిన ఉమా-దామోదర్ యాదవ్, బొడ్రాయి కమిటీ ప్రధాన కార్యదరి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి గజ్జెల శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ పుప్పాల రాజేందర్, బోళ్ళ కుమార స్వామి, బెల్లంకొండ సుధాకర్, బజ్జూరి ప్రసాద్, మిట్టపెల్లి వెంకటేశ్వర్లు, గొర్రె కోటి, నలిగంటి నవీన్, బజ్జూరి రవిందర్, రావుల రాజేష్, పులిశేరి ఎల్లయ్య, పొన్నం బాబురావు, అంకాల జనార్ధన్, అనుమాస సత్యం, కట్టమల్లు, చంద్రమౌళి, స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వడ్డెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1974 పదో తరగతి పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఆదివారం హనుమకొండ వడ్డెపల్లిలోని పరిణయ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. గత ఐదు దశాబ్దాలకు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై చేరి అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో 1974 ఎస్సెస్సీ బొల్లికుంట బ్యాచ్ కన్వీనర్ దొంతి సుదర్శన్‌రెడ్డి, డి.భాస్కర్‌రెడ్డి, ఆర్.రమాకాంత్‌రెడ్డి, సమ్మయ్య, ఎస్. వెంకట్రాంనర్సయ్య, ఆర్టీసీ ఓదెలుతోపాటు సుమారు 20 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఖిలావరంగల్ పద్మశాలీ వనభోజనాల కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి కొండా సురేఖ



కమ్మ సేవా సంఘం వనభోజన వేడుకలకు హాజరైన సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన



కోటిలింగాల గుడి సమీపంలో ఆర్యవైశ్య వనభోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్

కుల సంఘాలు - వనభోజనాలు

- నగరంలో పద్మశాలి, కమ్మ, గౌడ, ఆర్యవైశ్యుల సామూహిక వేడుకలు
- ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి

ఖిలావరంగల్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు ఐక్యంగా ఉండి రాజకీయ, విద్యా, ఆర్థిక, సామాజిక రంగాలలో రాణించాలని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయశాఖామంత్రి కొండా సురేఖ, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి సూచించారు. ఆదివారం కార్తీకమాసం పద్మశాలీల వనభోజనాలను కుసుల సతీష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా మార్కండేయ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా కార్తీకమాస వనభోజనాలను నిర్వహించుకోవడం పద్మశాలీల ఐక్యతకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు ప్రభుత్వ పథకాలను అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పట్టణ పద్మశాలీ సంఘం నాయకులు ఆడెపు రవిందర్, వడ్నాల నరేందర్, కుసుమ సతీష్‌బాబు, డిఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాల కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, పద్మశాలి కుల రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, మొగలిరేకుల సీరియల్ హీరో గోరంట్ల రాజు, బేతి అశోక్, భైరి శ్యాంసుందర్, చిప్ప వెంకటేశ్వర్లు, నందాల చందర్‌బాబు, భైరి మురళీ కృష్ణ, కూచన క్రాంతి, రాజేందర్, వెంకటేశ్వర్లు, బచ్చు ఆనందం, మార్గం ఎల్లయ్య, మాచర్ల దీన్‌దయాళ్, తుమ్మ రమేష్, గుర్రం సత్యనారాయణ, అన్ని డివిజన్ అధ్యక్షులు, వరంగల్ ఉమ్మడి జిల్లాతో పా టు, నగరంలోని పద్మశాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- కమ్మ కులస్థులకు సేవాభావం ఎక్కువ

సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

న్యూశాయంపేట: కమ్మ కులస్థులకు సేవాభావం ఎక్కువ అని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన అన్నారు. కమ్మ సేవా సంఘం ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ గార్డెన్‌లో ఆదివారం కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా కమ్మ సేవా సంఘం మహిళలు ఉసిరిచెట్టు, తులసి చెట్టుకు శివుని, విష్ణువు పూజలు చేశారు. ఈ సందర్భంగా 20 మంది పేద పిల్లలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు, వికలాంగ బాలుడికి రూ.55వేల విలువ చేసే మూడు చక్రాల ఎలక్ట్రానిక్ బైక్ అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కల్చరల్ ప్రోగామ్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు రావిపాటి వెంకటేశ్వర్‌రావు, కమ్మ సేవా సంఘం ఉపాధ్యక్షుడు కాపా వెంకటేశ్వర్లు, పూనాటి హరిబాబు, బత్తిని వెంకటనారాయణరావు, త్రిపురనేని సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి గంగవరపు రామకృష్ణ ప్రసాద్, రెసిడెంట్ సెక్రెటరీ యలమంచిని వెంకట కృష్ణారావు, కోశాధికారి బండ్ల రవీంద్రబాబు, సహాయ కార్యదర్శులు కొల్లి అనిల్‌కుమార్, మాదాల గోపాల్ పాల్గొన్నారు.

- వైభవంగా ఆర్యవైశ్యుల వనభోజనాలు

వరంగల్‌సిటీ: నగరంలోని కోటిలింగాల గుడి సమీపంలో శనివారం ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో కార్తీకమాసం వనబోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి వేలాది మంది ఆర్యవైశ్యులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉమ్మడి వరంగల్ జిల్లా పీఎస్‌టీలను సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్ర బాబు, కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా, మహిళా విభాగం, యూత్ విభాగం పీఎస్టీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోరాటవీరుడు సర్వాయి పాపన్న

- బీసీలు ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలి
- గౌడ వనభోజనాల్లో మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): గౌడ జాతిలో పుట్టిన గొప్ప పోరాటవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని, ఆయన అడుగుజాడలలో గౌడలు నడవాలని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయశాఖా మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం మధ్యకోటలోని ఏకశిల పార్కులో గోపా వరంగల్ జిల్లా అధ్యక్షుడు బైరి లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో కార్తికమాస వనభోజనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీసీలంతా ఐక్యంగా పోరాడి రిజర్వేషన్లను సాధించుకోవాలన్నారు. గౌడలకు జిల్లాలో కార్యాలయం నిర్మించేందుకు కృషిచేస్తామన్నారు. వరంగల్‌కోటలో సర్దార్ సర్వాయి పాపన్న, బత్తిని మొగిలయ్య గౌడ్‌ల విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరెల్లి బుచ్చయ్య, మాచర్ల జగన్నాథం, నాగపురి రాజలింగం తదితరులు ఎమ్మెల్యేలుగా పనిచేశారన్నారు. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, 40వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ, స్వామిగౌడ్, వరంగల్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొమ్మెర కుమార్, కోశాధికారి అనంతుల రమేష్ గౌడ్, గౌడ అఫిషియల్ ప్రొఫెషనల్స్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, భీమగాని లక్ష్మీనారాయణగౌడ్, రాంగోని సుధాకర్, నాయకులు రాజేష్‌కుమార్‌గౌడ్, పెద్ది వెంకట నారాయణగౌడ్, భైరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

హసన్‌పర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని మాల మహానాడు అధ్యక్షుడు పోతరాజు ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మాలల సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. మాలలందరు సమైఖ్యంగా పోరాటం చేసి వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ మాల కుటుంబం నుంచి ఇద్దరు చొప్పున చలో హైదరాబాద్ మాలల సింహగర్జన సభకు తరలి వచ్చి మాలల సత్తాను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకుడు పోతరాజు సుక్క ప్రభాకర్, పోతరాజు రమేష్, పోత రాజు మల్లికార్జున్, సారంగం, రాజేందర్, చంద్రమౌళి, పాపయ్య, రమేష్, గణేష్, గణపతి, లిల్లీ, ప్రసా ద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

- ఎస్సీ వర్గీకరణ అగ్రకులాల కుట్ర

మడికొండ: ఎస్సీ వర్గీకరణ అగ్రకులాల కుట్ర, వర్గీకరణతో సామాజిక న్యాయం జరగదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గ్రేటర్ వరంగల్ కన్వీనర్ పనికల శ్రీనివాస్ అన్నారు. మడికొండ అంబేద్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్గీకరణతో సామాజిక న్యాయం జరగదన్నారు. ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమ న్నారు. డిసెంబరు 1న హైదరాబాద్‌లో జరిగే మహాసభకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో- కన్వీనర్‌లు పానుగంటి లక్ష్మీనారాయణ, కాశేశ్వరపు రాము, నాయకులు దండు మోహన్, అంబేద్కర్ సంఘ అధ్యక్షులు ఏడబోయిన ప్రభాకర్, కార్యదర్శి శివాజీ కిషన్, కంకణాల సంతోష్, జానపట్ల సారయ్య, కట్టబాబు, జిట్ట అనిల్, మద్దెల కుమార్, రొడ్డ దయాకర్, మూల ప్రశాంత్, మూల నవీన్, విమల, మంజుల పాల్గొన్నారు.

- నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ పనుల్లో భాగంగా సోమవారం విష్ణుపురి, వెంకటాద్రి ఫీడర్ పరిధిలోని కాజీపేట పోలీస్‌స్టేషన్ ఏరియా, విష్ణుపురి వాటర్ ట్యాంక్ ఏరియా, కాజీపేట మెయిన్‌రోడ్డు, ట్రూ వాల్యూ డీటీఆర్, డీమార్ట్ షాపింగ్ మాల్ పక్క ఏరియా, రహమత్‌నగర్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు.

- ప్రశాంతంగా ముగిసిన స్కాలర్‌షిప్ పరీక్ష

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ స్కాలర్‌షిప్ టెస్ట్ ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో డి.వాసంతి, ఏసీజీఈ బి. భువనేశ్వరి తెలిపారు. ఆదివారం 4 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 628 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 593 మంది హాజరు కాగా 35 మంది గైర్హాజరైనట్లు వారు పేర్కొన్నారు. మొత్తంగా పరీక్షకు 94 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

- పూర్వ విద్యార్థుల సంఘం నేత ఈవీ శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని రెడ్ క్రాస్ సొసైటీ పాలకమండలి సభ్యుడు, పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం నేత ఈవీ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూర్వవిద్యార్థుల సమ్మేళన సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారంతో అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా మహిళా పాలిటెక్నిక్ విద్యార్థులు శ్రీనివాస్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌ప్రసాద్, విద్యార్థి ప్రతినిధులు అనిత, జయంతి, రమాదేవి, సౌమ్య, పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ చైర్మన్ మేకల అక్షయ్‌కుమార్, రిటైర్డ్ ఉద్యోగులు వెంకటనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.



శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థినులు

లారీ సప్లయర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన నూతన కమిటీ సభ్యులు

శంభునిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సభ్యుల ఐక్యతతో అసోసియేషన్‌ను మరింత అభివృద్ధి చేసుకుందామని వరంగల్ జిల్లా లారీ సప్లయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వంగాల సమ్మిరెడ్డి అన్నారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన లారీ సప్లయర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వంగాల సమ్మిరెడ్డితో పాటు కమిటీ బాధ్యులు మాట్లాడారు. అసోసియేషన్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి పాటుపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండా సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సయ్యద్ హిదయతుల్లా, కోశాధికారి దాసరి నాగరాజు, జాయింట్ సెక్రెటరీ మందాటి రవీందర్, ఈసీ మెంబర్లు తాళ్ళ కుమార్, బాసాని రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. న్యాయ సలహాదారు చకిలం ఉపేందర్, సలహాదారులు మెంగని సదానందం, తోట దేవేందర్, కందిమల్ల భాస్కర్ రావు, వెలిశాల శ్రీనివాస్, ఇంజమూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత సోషల్ మీడియా మాయలో పడొద్దు

- ఎల్‌బీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ సాయిబాబా

కేయూ క్యాంపస్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యువత సోషల్ మీడియా మాయలో పడి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని వరంగల్ ఎల్‌బీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ సాయిబాబా ఉద్బోధించారు. ఆదివారం హనుమకొండ నయీంనగర్‌లో డాక్టర్ పీఎల్ఎన్ ట్రస్టు, లయన్స్ క్లబ్ తదితర సంస్థల సంయుక్త నేతృత్వంలో ఇన్‌స్పైర్ ప్రొఫెషనల్స్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రుద్ర సాయిబాబా మాట్లాడుతూ యువత జీవితంలో అనుకున్నది సాధించాలంటే కష్టపడాలన్నారు. అనంతరం పీఎల్ఎన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ జ్యోతి పూజారి, ఇన్‌స్పైర్ హెచ్ఆర్ ఆల్ ప్రాసెస్, ఫాతిమా బీఈడీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ అన్నారాణి, స్ట్రాంగ్ సిగ్నల్ మీడియా సీఈఓ వరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ప్రమాదం పొంచి ఉంటుందని.. సక్రమంగా ఉపయోగించుకోకుంటే జీవితాలను నాశనం చేస్తుందని అన్నారు. సోషల్‌లో మీడియాలో వ్యక్తిగత విషయాలను పోస్టు చేయొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.వెంకట్‌రెడ్డి, అశోక్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, ధనలక్ష్మి, గణపతి పొనగంటి, వరుణ్ కామగోనితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రుద్ర సాయిబాబా తదితరులు

దత్తక్షేత్రంలో తైలాభిషేకం

వరంగల్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఆదివారం దత్తాత్రేయ స్వామికి వైభవంగా తైలాభిషేకం నిర్వహించారు. అర్చకులు రాపాక గోపీకృష్ణ శర్మ ప్రజల ఆరోగ్యం, గ్రహబలం బాగుండాలని అందరి గోత్రనామాలతో స్వామివారికి నువ్వుల నూనెతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు, అర్చకులు, భక్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహాపడిపూజ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి

వరంగల్ కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి దేవస్థానం సమీపంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో డిసెంబరు 11న జరిగే అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమానికి సంబంధి చిన పోస్టర్లను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్తీక మాసంలో స్వాములు ఆధ్యాత్మిక చింతనతో ధ్యాన, భక్తియోగంతో ఉంటారని అన్నారు. మహాపడి పూజకు తాను తప్పకుండా హాజరవుతానని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ నాయకురాలు మంతెన సునిత, అర్చకులు బాలసుబ్రహ్మణ్యశర్మ, గణపతి శర్మ, పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

హసన్‌పర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం అంబేద్కర్ కాలనీకి చెం దిన మేకల ప్రీతి ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. దీంతో మేకల వంశస్తులు ఆదివారం ప్రీతీని సన్మానిం చి అభినందించారు. ఈ సందర్భంగా మేకల వంశస్తుల అధ్యక్షుడు మేకల యుగందర్ మాట్లాడుతూ.. దళిత జాతిలో ప్రీతి లాంటి విద్యార్థినిలను స్ఫూర్తిగా తీసుకొని తోటి విద్యార్థులు విద్య లో ఉన్నతంగా రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్ర మంలో మేకల వంశస్తులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మేకల హరిశంకర్, రాజేందర్, అశోక్, చెన్నయ్య పాల్గొన్నారు.

'స్వచ్ఛగుడి' ప్రారంభం

వరంగల్ కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛగుడి పేరుతో ప్రతీ ఆలయాన్ని నెలకోసారి శుభ్రపర్చే కార్యక్రమాన్ని చేపట్టామని సమితి నిర్వాహ కులు చిట్టిమల్ల శ్రీనివాస రావు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం రంగంపేట భద్రకాళి ఆలయం రోడ్డులో గల శ్రీజ్ఞాన సరస్వతి మాత ఆలయాన్ని శుభ్రపర్చారు. కార్యక్రమంలో చైతన్య పోరాట సమితి సభ్యులు దేవా అరవింద్‌బాబు, బోనగిరి రాజన్న, చందా జగదీష్, గాదె వాసుదేవ్, చిదురాల నాగరాజు, గుండా రమేష్, దారా పూర్ణ సంతోష్, దివ్వెల పూర్ణచందర్, వెంకటనారాయణ, తాళ్లపెల్లి రాంప్రసాద్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం ఎన్నిక

కరీమాబాద్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ మండల రేషన్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం ఫోర్ట్‌రోడ్‌లో గల రోటరీ క్లబ్‌లో నిర్వహించారు. మొత్తం 68మందికి గాను 60 మంది రేషన్ డీలర్లు పాల్గొన్నారు. అధ్యక్షురాలిగా మంద భారతీరామచంద్రం, ప్రధాన కార్యదర్శిగా మంద శ్రీవాణి మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు ధరావత్ మోహన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్, ఖిలావరంగల్ మండల రేషన్ డీలర్‌లు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే - సన్మానించిన రైతులు

హనుమకొండ సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లికి చెందిన రైతులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రజాభవన్ కార్యాలయంలో రాజేందర్‌రెడ్డిని కలిశారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని గ్రీన్ పార్కులో అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పరిష్కరించడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయనను సన్మానించి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న రైతులు

- నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

న్యూశాయంపేట: న్యూశాయంపేటలోని దోనగుట్టపై వెలిసిన త్రివే దాద్రి సంతోష లక్ష్మీ నరసింహస్వామిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ గ్రంథి సత్యవతి ఆధ్వర్యంలో అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, కాం గ్రెస్ నాయకులు సత్తు రమేష్, పున్నం చందర్, పిండి రమేష్, కనుకుంట్ల కృష్ణ, మామిండ్ల సురేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

విచ్ఛిన్నకర విధానాలను ఎండగట్టాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య

వరంగల్ చౌరస్తా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద, ప్రజా విచ్ఛిన్నకర విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్. రంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రామన్నపేట సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన 8వ మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని, పేద ప్రజలపై ఆర్థికంగా భారం మోపుతోందని అన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ విధానాలకు ముందుకు తీసుకెళ్లడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు. అనంతరం 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల, భారత వీరస్వామి, సింగారపు బాబు, అరూరి కుమార్, రంగరాజు విజయ, ఎండి ఆలం పాల్గొన్నారు.

రైల్వే పరిశ్రమలు సకాలంలో పూర్తికావాలి

- మెట్టుగుట్టపై జేఏసీ నాయకుల పూజలు

మడికొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ, కోచ్‌ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ నిర్మాణంలో ఎలాంటి ఆటంకాలు జరుగకుండా దేవతామూర్తుల చూడాలని కోరుతూ ఆదివారం తెల్లవారు జామున మడికొండ మెట్టుగుట్టపై తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు మహా రుద్రాభిషేకం, హోమం నిర్వహించారు. దేవతామూర్తుల అనుగ్రహంతో రైల్వే పరిశ్రమలు సకాలంలో పూర్తికావాలని సీతారామస్వామికి, మెట్టు రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ భూములు తెలంగాణ ప్రభుత్వం నుంచి రైల్వే పరిశ్రమలకు దేవతామూర్తుల అనుగ్రహంతోనే దక్కాయని చెప్పారు. జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ కోండ్ర నర్సింగరావు, వైస్ చైర్మన్‌లు గుర్రపు సుధాకర్ రావు, పి. రమేష్, ఎస్. రాజేశ్వర్‌రావు, డి.రవీందర్, ఎం.కె. మూర్తి, శివ, కోటి, కన్వీనర్లు బి. మాధవరావు, అనుమాల శ్రీనివాస్, వి .నగేశ్, జి.భాస్కర్, సంపత్, దేవస్థాన చైర్మన్ రఘుచందర్, ప్రధాన అర్చకులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు

పత్తాలేని ప్లాస్టిక్ నిషేధం

- రికార్డుల్లో అమలు..
- క్షేత్రస్థాయిలో విచ్చలవిడితనం
- నివారణకు పకడ్బందీ కార్యాచరణ

వర్ధన్నపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాలిథిన్ వినియోగం విపరీతంగా పెరిగిపోయి పర్యావరణానికి విఘాతం ఏర్పడుతోంది. ఇటు వంటి పరిస్థితుల్లో వీటి వాడకాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నా, ఎక్కడా ఆశించి నంత ఫలితం దక్కడం లేదు. ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం పురపాలికల్లో పాలిథిన్ నిషేధానికి దశల వారీగా చర్యలు చేపట్టే పక డ్బందీగా అమలు చేయాలని తాజాగా ఆదే శాలు జారీ చేసింది. ఈ మేరకు తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని స్పష్టం చేసింది. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని పేర్కొంది. ఇందులో భాగంగా ఆ శాఖ అధికారులు రంగంలోకి దిగి, వ్యాపార సం స్థల్లో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగిం చిన వారికి భారీగా జరిమానా లు విధించనున్నారు. ఈ పరిణా మంతో జిల్లాలోని నాలుగు పురపాలికల్లో మార్పు వస్తుం దని ఆశిస్తున్నారు.



ప్రత్యామ్నాయం ఉంటేనే..

గతంలో చాలాసార్లు పురపా లికల్లో ప్లాస్టిక్ నిషేధిస్తు న్నట్టు కమిషనర్లు ప్రకటించారు. తని ఖీలు చేపట్టి దుకాణదారులకు తాఖీదులు ఇవ్వడమే కాకుండా, పాలిథిన్ సం చులను స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు. వీటి వినియోగంతో జరిగే అనర్థా లపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించినా పరిస్థితులో మార్పు రాలేదు. వీటికి ప్రత్యామ్నాయం లేకపో వడమే ఇందుకు కారణమంటున్నారు. పట్టణా ల్లో ఎక్కడ చూసి నా, ఈ వ్యర్థాలే కనిపిస్తు న్నాయి. రోడ్ల పక్కన ఉన్న ఖాళీ స్థలాలు, మురుగు కాల్వల్లో కవర్లు పేరుకుపోయాయి.

నిబంధనలు పాటించక..

రహదారులపై వ్యాపారాలు కొనసాగించే హోటళ్ల నిర్వాహకులు, చిరు వ్యాపారాలు నిర్వ హించే వారు ఎక్కడపడితే అక్కడ చెత్తను పారబోస్తున్నారు. నిబంధనల ప్రకారం సొం తంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాల్లో వేయాల్సి ఉన్నా ఆ విషయాన్ని విస్మరిస్తున్నారు. పోయ్యే చెత్తను ఉదయం పురపాలిక వాహనాల్లో వేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

ఇలా చేయాలని సూచనలు

పట్టణ దుకాణదారులకు, అధికారులు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. దుకాణం ముందు చెత్త బుట్టలు ఏర్పాటు చేసు కోవాలి. వాటిల్లోనే వ్యర్థాలను వేయాలి, నిత్యం వచ్చే మునిసిపల్ ట్రాక్టర్, రిక్షాల్లో తడి, పొడి చెత్తను వేరువేరే వేయాలి.

ఇందుకోసం ఇళ్లలో రెండు వేర్వేరుగా బుట్ట లు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరు ద్ధంగా వ్యవహరించినా, చెత్త ఎక్కడపడితే అక్క డ వేసినా జరిమానా విధిస్తారు. హోటళ్లలో, టీ దుకాణాలు, టిఫిన్‌సెంటర్లు, పండ్ల విక్రయదారులు, దాబాల యాజమానులు ప్లాస్టిక్ వాడొద్దు అన్నారు.

తాజాగా ఆదేశాలు

120 మైక్రాన్లకంటే మందం తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వినియోగించవద్దని తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 120 మైక్రాన్లకు కంటే మందం తక్కువ మైక్రాన్లు ఉన్నవి, ఒకసారి వాడిన వి ఉన్నా, నిల్వచేసినవి ఉన్నా, విక్రయించినా ఉప యోగించిన ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్టు 1986 ప్రకారం సీడీఎంఏ హై దరాబాద్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సామగ్రి జప్తు, రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా, లైసెన్స్ రద్దుతోపాటు చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ప్రజల సహకారం అవసరం

సుధీర్‌కుమార్, మునిసిపల్ కమిషనర్, వర్ధన్నపేట



ప్లాస్టిక్ వ్యర్థాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజల సహకారం అవసరం. దుకాణ దారుల్లో కొంతమందికి నోటీసులు సైతం జారీ చేస్తున్నాం. ఖచ్చితంగా నిషేధా న్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దశలవారీగా చర్యలు తీసు కుంటాం. గతంలో మాదిరి కాకుండా పకడ్బందీగా వ్యవహరిస్తాం.

పర్యాటక స్థలాలను చూసొద్దాం..

'తెలంగాణ దర్శిని'తో విద్యార్థులకు అవకాశం

- పర్యాటక ప్రాంతాలపై అవగాహనే లక్ష్యం
- విద్య, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అమలు
- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 12 వేల మందికి లబ్ధి
- హనుమకొండ జిల్లాలో శ్రీకారం

హనుమకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గతంలో విద్యార్థులకు విహారయాత్రలు (ఎక్స్‌ కర్షన్) ఉండేవి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలే విద్యార్థుల నుంచి నామ మాత్రపు ఫీజు వసూలు చేసి విహారయాత్రలకు తీసుకెళ్లేవి. విహారయాత్ర అంటే విద్యార్థులకు ఎక్కడ లేని ఉత్సాహం వచ్చే ది. తల్లిదండ్రులు వారించినా విహారయాత్రకు వెళ్తామని మారాం చేసి డబ్బులు వసూలు చేసు కొని వెళ్లేవారు. ఇది ఒకప్పటి మాట. తర్వాత కాలంలో ప్రైవేటు విద్యా సంస్థల ర్యాంకుల గోలలో పడి, ప్రభుత్వ విద్యా సంస్థల నిధులు లేక ఇరుకున పడటంతో విద్యార్థులను విహారయా త్రలకు తీసుకువెళ్లడం మానివేశాయి.



విహారయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య (ఫైల్)

ఇప్పుడు విద్యార్థులు విహార యాత్రలకు వెళ్లే అవకాశాన్ని 'తెలంగాణ దర్శిని' పేరుతో ప్రభుత్వం కల్పిస్తోంది. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ స్థాయి విద్యార్థుల వరకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో వారిని ఉచితంగా వి హార యాత్రలకు తీసుకెళ్లే కార్యక్రమాన్ని చేపట్టింది.

వారసత్వాన్ని తెలుసుకునేందుకే..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సంద ర్శించేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య, నిధులను ప్రభుత్వం ఖరారు చేసింది.

ఉమ్మడి జిల్లాకు రూ. 36 లక్షల నిధులను విడుదల చేసింది. తెలంగాణ దర్శిని కింద ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 12వేల మందికిపైగా విద్యార్థులు విహారయాత్ర చేసే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వి ద్యార్థులు ఈ కార్యక్రమం కింద చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.

తరగతుల్లో నాలుగు విభాగాలు

విద్యార్థుల తరగతుల ప్రకారం నాలుగు విభాగాలుగా విభజి స్తా రు. మొదటి విభాగంలో 2-4 తరగతుల విద్యార్థులను గ్రా మం లేదా మండల పరిధిలోని స్మారక చి హ్నాలు, వారసత్వ ప్ర దేశాలు, ఉద్యాన వనాలను సం దర్శించేలా ప్రణాళిక తయారు చేసుకోవాలి. రెండో విభాగంలో 5-8 తరగతుల విద్యార్థులు 20 కిలోమీటర్ల నుంచి 30 కి.మీ పరిధి లోని ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తారు. తొమ్మిది తరగతి నుం చి ఇంటర్ విద్యార్థులు 50-70 కి.మీ పరిధిలో ఉన్న ప్రదేశాలను రెండు రోజుల పాటు సందర్శించవచ్చు. డిగ్రీ విద్యార్థులు నాలుగు రోజుల పాటు పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు కార్యక్రమం రూపొందిస్తారు. సొంత జిల్లా వెలుపల లేదా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా పర్యటించే అవకాశం కల్పిస్తారు. 2-4 తరగతి విద్యార్థులకు ఒక రోజు పర్యటన కోసం ఒక్కో వి ద్యార్థిపై రూ. 300, 5-8 తరగతి విద్యార్థులకు ఒక రోజు పర్యటనకు రూ.800, తొమ్మిది నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు రెండు రోజుల పర్యటనకు రూ. 2వేల చొప్పున డిగ్రీ విద్యార్థులకు నాలుగు రోజుల పర్యటనకు రూ. 4వేల చొప్పున ఖర్చు చేస్తారు. విద్యార్థుల భద్రత, పర్యటనను సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు పర్యవేక్షిస్తారు. విద్యార్థులకు కావాల్సిన రవాణాను టీఎస్‌ఆర్టీసీ సమకూరుస్తుంది. విద్యార్థుల భద్రత, రవాణాను కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు బాధ్యత వహిస్తారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు, సమన్వయాధికారులు ఉంటారు.

మర్కజీ విద్యార్థులతో శ్రీకారం

ఎకో టూరిజం, ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించే లా ప్రణాళికలు రూపొందించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. దసరా సెలవుల తర్వాత ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయం చినా ఒక్క హనుమకొండ జిల్లా తప్పా మిగతా జిల్లాల్లో ఇంకా మొదలు కాలేదు. హనుమకొండలోని మర్కజీ ద్వారా జనీవల తెలంగాణ దర్శిని పథకంలో భాగంగా వరంగల్‌లోని పర్యాటక ప్రాంతాలను దర్శించారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్య, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో హనుమ కొండ ప్రభుత్వ మర్కజీ పాఠశాల విద్యార్థులు పర్యాటక ప్రదేశా లకు వెళ్లే బస్సును కలెక్టర్ ప్రావీణ్య జెండా ఊపి ప్రారం భించారు. విద్యార్థులు ఖిలా వరంగల్, కుష్‌మహల్, పురావస్తు మ్యూజియం, భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాన్ని సం దర్శించారు. విద్యార్థుల వెంట ఉన్న గైడ్ దర్శ నీయ స్థలాల గురించి వివరించారు.

యువ టూరిజం క్లబ్బులు

తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేశారు. ఏడు నుంచి 12వ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులతో ఏ ర్పాటైన ఈ క్లబ్బులు వి హార యాత్ర నిర్వహ ణలో తోడ్పాటు అంది స్తాయి. పర్యటనకు వచ్చే విద్యార్థులను సమీకరించ డం, విహార యాత్ర సంద ర్భంగా వారిని క్రమశిక్షణలో ఉం చడం, దర్శనీయ స్థలాల గురించి వారికి వివరించడం వారి బాధ్యత. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే యువ టూరిజం క్లబ్బులు ఏర్పాటు పూర్తయింది. ఈ క్లబ్బులు ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పని చేస్తాయి. ప్రతీ క్లబ్‌కు ఒక విద్యార్థి నాయకుడిగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ యువ టూరిజం క్లబ్బులు వెబ్‌సైట్‌లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకొని సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది.

చారిత్రక ప్రాంతాలపై అవగాహన

వాసంతి, డీఈవో హనుమకొండ



తెలంగాణ దర్శిని ద్వారా విద్యా ర్థులకు చారిత్రక ప్రాంతాలను ఉచి తంగా చూసే అవకాశం కలుగు తుం ది. తద్వారా విద్యార్థులు ఆ ప్రాంతాల గొప్పతనం, తెలంగాణ వారసత్వం, సంస్కృతి, సంప్రదా యాలను తెలుసు కుంటారు. వార సత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అవుతారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని విద్యార్థులు పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు పర్యాటక శాఖ సమన్వయం తో ప్రణాళికలను రూపొందించి అమలు చేయనున్నాం.

దర్శనీయ స్థలాల సందర్శన

శివాజీ, హనుమకొండ జిల్లా పర్యాటక అధికారి



విద్యార్థులకు తరగతి గది వెలుపల అభ్యాస అనుభవాన్ని తెలంగాణ దర్శి ని అందిస్తుంది. తెలంగాణ వారస త్వం, చారిత్రక కట్టడాలు అపురూ పమైనవి, దర్శనీయ స్థలాల గురించి వి ద్యార్థులు తెలియజేయడమే ఈ పథకం ఉద్దేశ్యం. మన వారసత్వ సంపద, వాటి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుంది.

చలి మోత.. చెరువులో ఈత

- ఆరోగ్యం కోసం వింటర్‌లోనూ స్విమ్మింగ్
- వేకువజామునే ఉత్తమ వ్యాయామం
- వరంగా మారిన వెంకటగిరి చెరువు

కేసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు గజగజవణి కిస్తూ చలి మోత మోగిస్తోంది. మరోవైపు చెరువులో ఈత కొడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు కొందరు గ్రామస్తులు. అన్ని వ్యాయా మాల్లో ఈత ఉత్తమమైందని వైద్యులు చెబుతుంటారు.

ఇలా ఈత కొట్టేందుకు స్వచ్ఛమైన నీటితో కేసముద్రం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని కాకతీయుల నాటి వెంకట గిరి గ్రామ 'సూరారం' చెరువు అందుబాటులో ఉండడం నిజంగా 'సూర్యుడి వరం'గానే చెప్పవచ్చు. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సూక్తిని ఒంటబట్టించుకుని కొంత మంది యువకులు, పెద్దలు ప్రతీరోజు వేకువ జామునే ఈత కొట్టడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ చలికాలంలో



సూరారం చెరువులో ఈత కొడుతున్న కేసముద్రం వాసులు

గాని గోవర్ధన, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగులోత్ వీరు నాయక్, ముంజ బిక్షపతి, దేశబోయిన సుధాకర్, జిల్లా ప్రేమ్‌కుమార్, రవీందర్‌చారి, తుమ్మ పరమేశ్వర్, పాషా, కుసుమ కిరణ్, బండి కుమారస్వామి తదితరులు తెలి పారు. కేసముద్రం స్టేషన్ నుంచి కాలినడకన కొందరు, మరికొందరు సైకిళ్లపై, మోటార్‌సైకిళ్లపై చెరువు వద్దకు చేరుకొని, సుమారు గంటన్నరపాటు ఈత కొట్టి ఆ తర్వాత ఇంటికి వెళ్తారు.

ఆహ్లాదకర వాతావరణం..

నిత్యం వివిధ పనుల ఒత్తిడితో ఉండే వారు ప్రభాతవేళ వెంకటగిరి చెరువుపైనుంచి వచ్చే పచ్చనిపొలాలు, పక్షుల కిలకిలా రావాలను ఆస్వాదిస్తూ ప్రశాంతత పొందుతున్నారు. ఈ మార్గంలో ఎక్కువగా వాహనాల రాకపోకలు ఉండవు కాబట్టి శబ్ద, వాయు కాలుష్యం సైతం ఉండదు. ఇక ఈత కొట్టే వారితో సంఘాలు ఏర్పాటు చేసుకొని అలుగు పోసిన ప్పుడు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వెంకటగిరి చెరువు వ్యాయామం చేసేవారికి ఒక వరంలా మారిందని పలువురు ఈతకొట్టేవారు తెలిపారు. ఇక చలిలో ఈత మరో అనుభూతిని ఇస్తుందని వారు చెబుతు న్నారు. నీళ్లలోకి దిగిన ఒక నిమిషంపాటే చలి అనిపిస్తుందని, ఆ తర్వాత శరీరం ఆ నీటికి అనుకూలంగా మారిపోతుందని చెబు తున్నారు. ఈత వల్ల సమయానుకూలంగా ఆకలి, నిద్ర కొనసాగుతూ శరీర గడియారం సక్ర మంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఏదేమైనా ఇద యం శరీరక, మానసిక ప్రశాంతత కోసం వెంకట గిరి చెరువు వద్దకు ఈతకు వెళ్లడం వారికి ప్రతీరోజు ఒక కొత్త అనుభవాన్ని ఇస్తుంది.

సైతం కేసముద్రం స్టేషన్‌కు చెందిన సుమారు 20 మంది ప్రతీరోజు తెల్లవారుజామున 5 గంటల నుంచి 7 గంటల వరకు బ్యాచ్ బ్యాచ్‌లుగా సూరారం చెరు వులో ఈతకు వెళుతున్నారు.

ఈ చెరువులో నీళ్లు ఎలాంటి కలుషితం లేకుండా స్వచ్ఛంగా ఉంటాయని 15 నుంచి 22 ఏళ్లుగా నిత్యం ఈత కొడుతున్న కరివేదుల కృష్ణారెడ్డి, పెరుమాండ్ల గుట్టయ్య, తాళ్ల 'పెల్లి' కృష్ణమూర్తి, మార

ఏళ్లుగా నిత్యం ఈత కొడుతు న్నాను. నీళ్లలోకి దిగిన ఒక నిమిషం వరకే చలి ఉంటుంది. ఆ తర్వాత శరీర ఉష్ణో

22 ఏళ్లుగా ఈత కొడుతున్నా..

కరివేదుల కృష్ణారెడ్డి, కేసముద్రం స్టేషన్

ఈ చెరువులో 22



గ్రత చెరువు నీటికి అనుకూలంగా మారుతుంది. ఈత కొట్టడం వల్ల రోజంతా వివిధ పనుల్లో ఉండే ఒత్తిడి దూరమైన మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుంది. ఈత వల్ల ఎముకలపై ఒత్తిడి పడకుండా శరీ రంలో ఉండే కొవ్వును కరిగించి, దృఢంగా చేస్తుంది. ఈ చెరువు మాకు అందుబాటులో ఉండడం మా అదృష్టం.



వరంగల్ కోటలో 3 కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 3కే రన్

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఖిలా వరంగల్‌లో ర్యాలీ

ఖిలావరంగల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అలవాటు పడితే భవిష్యత్ నాశనం అవుతుందని ఎస్ఆర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కొప్పుల రవీందర్ అన్నారు. ఆదివారం ఖిలావరంగల్‌లో ఎస్ఆర్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ వి ద్యార్థులు చింతల్‌నుంచి మధ్యకోట శిల్పాల మీదుగా మెట్టుకోట వరకు డ్రగ్స్ వ్యతిరేకంగా 3కే రన్ చేపట్టారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ యువతను స్వార్థంతో నిరోధించడానికి ఎన్ఎస్ఎస్ దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో 70 మంది ఎస్ఆర్ యూనివర్సిటీ వి ద్యార్థులు పాల్గొన్నారు.

కోటలో పర్యాటకుల సందడి..

ఖిలావరంగల్ మధ్యకోట ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. ఈ నెల 19 నుంచి 24 వరకు ప్రపంచవారసత్వ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లా పర్యాటకశాఖ అధికారి మల్లేశం పర్యవేక్షణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఏకశిల విల్లాల పార్కుల్లో గోడ సంఘం కార్తీకమాస వన భోజనాలు, వాకింగ్ గ్రౌండ్‌లో వర్షపాల వనభోజనాలు ఉండడంతో పాటు వరంగల్ నగరంలోని వివిధ కళాశాల, పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులతో కోటలో సందడి కనిపించింది.

- స్వామి వారికి నారికేళాలు, అమ్మవారికి జంతు బలులు
- శివరాత్రి నుంచి నెల రోజుల పాటు జన జాతర
- మేడారం తర్వాత భారీగా గిరిజన భక్తుల దర్శనాలు
- కురవి నగరాన్ని రాజధానిగా చేసుకుని పాలించిన భీమరాజు
- కాకతీయుల కళాపిపాసకు ఆనవాళ్లు ఆలయ చరిత్ర

వైవిధ్యం.. వీరన్న పూజా విధానం

మహబూబాబాద్ జిల్లాలోని కురవి దేవాలయం





గుడిలో భద్రకాళి సమేత వీరభద్రుడు

ప్రాశస్త్యం

మహబూబాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆసి యా ఖండంలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందుతూ.. వీర వనితలైన సమ్మక్క-సారలమ్మ తల్లులే దేవతలుగా కొలువు దీరే మేడారం గిరిజన జాతర తర్వాత రెండో స్థానంలో నిలుస్తున్న రుద్రమదేవి కొలిచిన వీరభద్రేశ్వరస్వామి కురవి దివ్య జాతర మహబూబాబాద్ జిల్లాలో గిరిజన, గిరిజనేతర భక్తులతో నిత్యం కళకళలాడుతోంది. కోరిన వారికి కొంగు బంగారంగా కొలిచే వేలాది మంది భక్తుల కొలువుతీర్చిన శ్రీభద్రకాళి సమేత కురవి వీరభద్రస్వామి దేవాలయం వైవిధ్య భరితమైన సంప్రదాయాలకు నెలవుగా విలసిల్లుతోంది. భద్రకాళి సమేత వీరభ ద్రుడిగా భక్తుల కొర్కెలు తీర్చే దైవాలుగా ఏటేటా మహాశివ రాత్రి నుంచి నెల రోజులపాటు నిర్వహించనున్న జాతర ఉదాక పర్వదినంతో ముగుస్తుంది. ఈ ఆలయంలో పూజలు వైవిధ్యంగా జరగడం విశేషం. ఆలయ ప్రాంగణంలో శ్రీవా రైనా వీరభద్రుడికి మాత్రం నారికేళం (కొబ్బరికాయలు) సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ కాగా, ఆలయానికి వెలుపల నిర్వహించిన ప్రహరీ వెలుపల భద్రకాళి అమ్మవారికి జంతు (కోళ్లు, యాటపోతుల) బలులతో మొక్కులు తీర్చుకోవడం అనాదిగా కొనసాగుతోంది.

తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి నెల రోజుల పాటు కొనసాగే జాతరకు భారీగా తరలివచ్చే భక్తజనం మొక్కులు కూడా వైవిధ్యంగానే ఉంటాయనడానికి ఈ ఆలయమే నిద ర్శనం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రు లుగా కొనసాగిన చంద్రబాబు, దివంగత వైఎస్‌రాజశేఖర్‌రె డ్డితో పాటు తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే బంగారు మీసాలు సమర్పిస్తానని మొక్కుకున్న పూర్వ సీఎం కల్వకుంట్ల చంద్ర శేఖర్‌రావు ఈ ఆలయాన్ని దర్శించుకుని, మొక్కులు తీర్చు కున్నారు. ఆలయ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వి డతల వారీగా మంజూరి ఇచ్చారు.

చారిత్రక ప్రాధాన్యతతో కురవి

కురవి ఒకప్పుడు మహోన్నత దశను అందుకున్న నగ రంగా పేరుగడించింది. క్రీ.శ 850 ప్రాంతంలో తూర్పు చాళు క్యులతో ముఖ్యుడైన గుణగ విజయాదిత్యుడు వేంగి (ఏలూ రు)ను రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. వేంగి చాళు క్యుల కాలంలో చోళరాజులతో సత్సంబంధాలు, బంధుత్వాలు ఏర్పడ్డాయని చెబుతారు. ఇందుకు నిదర్శనంగానే రాజరాజ చోళుని కుమార్తెను రాజమహేంద్రవరాన్ని ఏలుతున్న విమ లాదిత్యుడు వివాహం చేసుకున్నట్టు చరిత్ర పేర్కొంటోంది. సదరు విమలాదిత్యుడు కుమారుడే రాజరాజనరేంద్రుడు ఆ కాలంలో తమిళ దేశపు ద్రావిడ సంస్కృతిని ప్రతిబింబించే విశిష్టాద్వైత ప్రబంధాలు వ్యాస భారతాన్ని ఆదికవి నన్నయ్య ఆంధ్రీకరించాడు. ఈ నేపథ్యంలోనే అనేక తెలుగు కుటుంబాలు తమిళ దేశానికి తరలివెళ్లాయి. అప్పట్లోనే వేంగి రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించే రోజుల్లో రాష్ట్ర కూటులచే పరాజితుడైన భీమరాజు ప్రస్తుత ఈ కురవి నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. ఆ కాలంలోనే శ్రీ వీరభద్రేశ్వరుని కురవి ఆలయాన్ని నిర్మించినట్టు శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. నాటి వేంగి చాళుక్యుల అనంతరం ఈ దేవస్థానాన్ని కాకతీయ తొలి స్వతంత్ర రాజైన 1వ బేతరాజు పునరుద్ధరించారు. తరువాత కాలంలో రెండో బేతరాజు కురవి చెరువును తవ్వించినట్టు అనేక ఆధారాలు ఉన్నాయి. తూర్పు చాళుక్య రాజైన శ్రీవీరభద్రుని వివాహమాడిన కాకతీయ సామ్రాజ్య రుద్రమదేవి ఈ కురవి దేవాలయాన్ని సందర్శించినట్టు విదేశీ యాత్రికుడు మార్కో పోలో తన రచనల్లో పేర్కొన్నాడు. శ్రీ వీరభద్రుడి దేవాల యం చుట్టు కురవి పట్టణప్రాంతం ఏర్పడినట్టు వేంగి చాళు క్యుల రెండవ రాజధాని నగరంగా మహోన్నత శిఖరాలు అధిరోహించి సాహితీ సాంస్కృతిక రంగాల్లో ఎనలేని వైభవా న్ని చవి చూసినట్టు చరిత్ర చెబుతోంది.

ప్రాచీ నాంధ్ర చరిత్రలో కాక తీయ ప్రభువుల ప్రత్యేక స్థానం ఉందనడంలో అతిశయోక్తి లేదు. కాకతీయుల సామ్రాజ్యం అత్యంత వైభ వంగా వెలుగొందిన 12వ శతాబ్దంలో కాకతీ యుల కళాపిపాస, కళల పోషణ అధిరుడికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప దేవాల యం, వేయిస్తంభాల గుడి, ఇలాంటి దేవాలయాలు

చరిత్ర పుటల్లో కురవి వీరన్న..

నిదర్శనాలుగా నిలుస్తాయి. ఈ కోవలోనిదే.. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రం లోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవా లయం. ఘనకీర్తితో విలసిల్లుతూ.. ఈ మం దిరం చారిత్రక పర్యాటక ప్రాధాన్యతను సంతరిం చుకుంటోంది. ఈ కురవి ఆలయాన్ని దర్శించుకునేం దుకు ఒక్క తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఏటేటా తరలివస్తున్నారు. సికింద్రాబాద్, విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఉన్న మహబూ బాబాద్ రైల్వేస్టేషన్‌కు తొమ్మిది కిలోమీ టర్ల దూరంలో కురవి ఉంది.

తొలుత స్వామి ఒక్కడే..

కురవిలో తొలుత వీరభద్రస్వామి ఒక్కడే ఉండేవారని, సుమారు 150 ఏళ్ల కిందట భక్తులు తాము చేసిన తప్పొప్పులను ఆలయ ప్రాంగణంలోకి రాగానే వీరభద్రుడే పూనకాల ద్వారా భక్తుడి నోటివెంట నిజాలు చెప్పించేవాడని నమ్మకాలు ఉండేవని చెబుతున్నారు. దీంతో అనేక కుటుంబాలు విడిపోవడం లాంటి అన ర్థాలు జరిగాయట. ఆ క్రమంలోనే ఉగ్రరూపమైన వీరభద్రుడి రౌద్రాన్ని తగ్గించడానికి అమ్మవారిని తీసుకురావాలనే ఆలోచన భక్తులకు కలిగిందట. ఫలితంగా భద్రకాళి అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి ఇదే ఆలయంలో వీరభద్రుడి పక్కన ప్రతిష్ఠించారని ప్రతీతి. అప్పట్నుంచి ప్రతిశివరాత్రి ఈ ఇరువురికి కల్యాణం జరుగుతోంది. అయితే తనకు నారికేళాలు కాదని, బలులు కావా లని, ప్రత్యేక ఆలయం కట్టించాలని ఓ భక్తుడి కలలో అమ్మవారు కన్పించి కోరిందంట. ఆపై వీరభద్రుడి ఆలయానికి సమీపంలోనే ప్రత్యేకంగా భద్రకాళి ఆలయాన్ని నిర్మించారు. ఆ అమ్మవారు స్వయంగా అవతారమన్నట్టు వాదన కూడా ఉంది. ఏదేమైనా అప్పట్నుంచి ఇటు వీరభద్రుడికి నారికేళాలు సమర్పించే మకునే భక్తులు, భద్రకాళి అమ్మవారి ప్రత్యేక ఆలయంలో జంతు బలులు ఇస్తూ వస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 25 నవంబరు 2024



కండరాలు బలంగా ఉండాలంటే

శరీరం ఆరోగ్యంగా ఉన్నపుడే కండరాలు కూడా పటిష్టంగా ఉంటాయి. పాలు, పండ్లు, తాజా కూరగాయలు తరచూ తీసుకుంటూ ఉంటే శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు అంది కండరాలు దృఢంగా పెరుగుతాయి. కండరాల ఆరోగ్యాన్ని పెంచే కొన్ని పండ్ల గురించి తెలుసుకుందాం.

అరటిపండు

● దీనిలో అత్యధికంగా పిండిపదార్థాలు, పొటాషియం, గ్లైకోజెన్ నిల్వలు ఉంటాయి. ఇవి కండరాల తిమ్మిరిని పోగొడతాయి. వ్యాయామం చేసేముందు తర వాత కూడా అరటి పండు తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది.

జామ

● ఈ పండులో ప్రోటీన్లు, పీచుపదార్థం, సి విటవిఎస్ ఉంటాయి. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం ఒక జామపండు తినడం వల్ల కండరాల్లో శక్తి పెరుగుతుంది

మామిడి

● మామిడి పండులో పిండిపదార్థాలతోపాటు ఎ, సి, కె విటమిన్లు ఉంటాయి. ఇవి కండరాల బలహీనతను నివారిస్తాయి.

దానిమ్మ

● ఈ పండులో యాంటీఆక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి. దానిమ్మ పండు గింజలను తరచూ తినడం వల్ల కండరాలకు రక్త ప్రసరణ సజావుగా జరుగుతుంది. కండరాల్లో వాపు, నొప్పి రాకుండా ఉంటాయి.

బొప్పాయి

● ఈ పండులో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది శరీరంలోని ప్రోటీన్లను త్వరగా జీర్ణం చేసి కండరాల్లో పుళ్లు రాకుండా చేస్తుంది. బొప్పాయిని తరచూ తినడం వల్ల శరీరానికి, కండరాలకు సత్తువ లభిస్తుంది.

పుచ్చకాయ

● ఇది శరీరంలో నీటి శాతం తగ్గకుండా చేస్తుంది. దీనిలో ఉండే సిట్రులైన్ అనే పదార్థం శరీర కండరాలకు రక్త ప్రసరణను పెంచి అవి బిగుసుకోకుండా చేస్తుంది. తరచూ పుచ్చకాయ ముక్కలు తినడం వల్ల కండరాల్లో కదలికల సమస్యలు రాకుండా ఉంటాయి.

సీతాఫలం

● ఈ పండులో అత్యధికంగా పిండిపదార్థాలు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం సీతాఫలం తినడం వల్ల శరీరంలో గ్లైకోజెన్ నిల్వలు పెరిగి కండరాలు పటిష్టంగా ఉంటాయి.

ముురిపించే ముత్యాల సరాలు

మహిళలకు ఎన్ని రకాల నగలున్నా ముత్యాలపై ఉండే ఇష్టం మాత్రం ప్రత్యేకం. సంప్రదాయకంగా కనిపిస్తూనే ట్రెండీగా ఆకట్టుకుంటాయి ముత్యాల నగలు. చీరలు, లెహంగాలు, డ్రెస్‌లపై అందంగా అమరి అతివల దర్పాన్ని పెంచుతాయి. ప్రతి మహిళ ఎంతో అపురూపంగా ఇష్టంగా ధరించే ముత్యాల చెవిపోగుల వివరాలు మీకోసం....

స్టడ్స్

● పెద్ద సైజు తెల్లని ముత్యం అమర్చిన బంగారు లేదా ప్లాటినం దిద్దులు మధ్య వయసు మహిళలకు చక్కగా నప్పుతాయి. ఒక ముత్యం చుట్టూ చిన్న చిన్న అమెరికన్ డైమండ్స్ లేదా చిన్న చిన్న ముత్యాలు చేర్చిన స్టడ్స్ లేటెస్ట్ ట్రెండ్.

హూప్స్

● ఇవి రింగుల మాదిరి ఉంటాయి. అన్ని సైజుల్లో లభ్యమవుతాయి. బంగారు రింగుల మీద వివిధ సైజుల ముత్యాలు కలగలిపి పొదిగిన పెర్ల్ హూప్స్ ఎంతో అందంగా ఉంటాయి. ఇవి ఏ వయసు మహిళలకైనా నూటవుతాయి. పూర్తిగా ముత్యాలతోనే తయారు చేసిన హూప్స్ అమ్మాయిలకు మోడ్రన్ డ్రెస్‌ల మీద ట్రెండీ లుక్‌నిస్తాయి.

జుంకాలు

● పెద్ద బుట్టల మీద రకరకాల ముత్యాలు పొదిగిన అందమైన జుంకాలు అమ్మాయిలకు అద్భుతంగా ఉంటాయి. ముఖం ఏ తీరులో ఉన్నా ఈ జుంకాలు చక్కగా నప్పుతాయి. ముత్యాలను గుత్తులుగా గుండ్రంగా పేర్చి పైన పెద్ద ముత్యాన్ని స్టడ్‌గా జతచేసిన జుంకాలను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. జుంకాలకు వ్రేలాడే ముత్యాలు అదనపు సొగసునిస్తాయి.

చాంద్‌బాలియన్లు

● గుండ్రని లేదా అర్థ చంద్రాకారపు చాంద్‌బాలియన్లకు ముత్యాలు జతచేస్తే ఆ అందమే వేరు. ఇవి చీరలమీద, లెహంగాల మీద గ్రాండ్ లుక్‌నిస్తాయి. చాంద్‌బాలీలకు వాటి ఆకారాన్ని అనుసరించి కొన్ని వరసల్లో ముత్యాలు పొదిగి మరికొన్ని చిన్న ముత్యాలను వ్రేలాడేలా రూపొంది స్తున్నారు. ఇవి ఏ ఛాయలో ఉన్నవారికైనా చక్కగా నప్పుతాయి.



అభిరుచి

తిరుపతి గోవిందరాజస్వామి దేవాలయం... తరచూ వెళ్లేదే.
కానీ అక్కడున్న రుక్మిణీ సత్యభామ సమేత పార్థసారథి పెరుమాళ్ గురించి ఎంతమందికి తెలుసు?
బ్రహ్మంగారు ప్రస్తావించిన అనిమెల సంగమేశ్వర ఆలయం ప్రత్యేకత ఏమిటి?
నంద్యాల వాల్మీకీ గుహలు... బేతంచర్ల బిల్వసర్గం గుహలు... విగ్రహ రూపంలో దర్శనమిచ్చే పరమేశ్వరుడు... భారతీయ సంస్కృతికి చిహ్నంగా నిలిచే అలనాటి వారసత్వ కట్టడాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, వాటిల్లోని వాస్తుశిల్ప శైలులను తన యూట్యూబ్ చానల్ ద్వారా మన ముందు ఉంచుతోంది... లా విద్యార్థిని... ఇందిరా ప్రియదర్శిని.
విలువైన మన సాంస్కృతిక వైభవాన్ని తరతరలకూ అందించే మహాసంకల్పంతో ముందుకు సాగుతున్న ఇందిరతో 'నవ్య' మాటామంతి.

ఆమె కళ్లతో... అపురూప దర్శనం

"గుడికి వెళతాం. దైవ దర్శనం చేసుకొంటాం. వచ్చేస్తాం. పురాతన కట్టడాలను సందర్శిస్తాం. ఆ అపురూపాలను చూసి మురిసిపోతాం. కానీ వాటి నిర్మాణ శైలి ఏంటి? ఆ ప్రాంతాలను ఏలిన రాజులు ఎవరు? ఎవరి వారసత్వానికి అవి చిహ్నాలు? అక్కడి శాసనాలు ఏం చెబుతున్నాయి? వాటితో ముడిపడివున్న మన సంస్కృతి గురించి చాలామందికి తెలియకపోవచ్చు. ఇలాంటి విలువైన సమాచారాన్ని... తద్వారా ఘనమైన భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలన్న లక్ష్యంతోనే నేను యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. కొవిడ్ సమయంలో దీనికి అంకురార్పణ జరిగింది. మా సొంతూరు అనంతపురం. మా నాన్న పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. దాదాపు పదేళ్లుగా కడపలో నివాసం.



అమ్మ గృహిణి. ఫ్యాషన్ డిజైనర్ కూడా. నా డ్రెస్‌లు తనే డిజైన్ చేస్తుంది. నేను కడప 'కోటిరెడ్డి ఉమెన్స్ కళాశాల'లో బీఎస్సీ చేశాను. న్యాయమూర్తి కావాలనేది నా కోరిక. అందుకే ప్రస్తుతం తిరుపతి 'పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం'లో ఎల్ఎల్‌బీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను.

▸▸ పర్యటనలకు వెళుతూ...

మా ఇంట్లో అందరం కలిసి పర్యటనలకు వెళ్లడం అలవాటు. చాలా దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు చుట్టివచ్చాం. కొవిడ్ సమయంలో మా నాన్న పల్లెటూరులో తన చిన్ననాటి అనుభవాల గురించి రాశారు. అవి నాకు బాగా నచ్చాయి. వాటిని డాక్యుమెంట్‌గా చేసి, యూట్యూబ్‌లో పెట్టాను. ఆ సమయంలోనే అనిపించింది... నేను కూడా వివిధ ప్రాంతాలకు వెళుతుంటాను కదా... వాటిపై వీడియోలు చేస్తే బాగుంటుందని! అలా 2021లో 'ఇందూస్ మా ఊరి కథలు' పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ, పురాతన ఆలయాలు, చారిత్రక, వారసత్వ కట్టడాల మీద దృష్టి పెట్టాను. అదేసమయంలో కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో కూడా కొన్ని వీడియోలు తీశాను.

▸▸ ఎన్నో విశేషాలు...

నా వీడియోల్లో అందరికీ తెలిసినవే కాకుండా కొత్త విషయాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. వాటిల్లో ప్రసిద్ధి చెందిన కట్టడాలున్నాయి. స్థానికులకు తప్ప బయటి ప్రపంచానికి పెద్దగా పరిచయం లేని పురాతన ఆలయాలూ ఉన్నాయి. కడపలో అనిమెల సంగమేశ్వరస్వామి గుడి, అల్లాడుపల్లె వీరభద్రస్వామి గుడి... అలాగే నంద్యాల దగ్గర బిల్వసర్గం, వాల్మీకి గుహలున్నాయి. బ్రహ్మంగారు సంగమేశ్వర ఆలయాన్ని ప్రస్తావించారు. కానీ దీని గురించి బయటి ప్రాంతాలవారికి ఎక్కువగా తెలియదు. అలాగే తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో పూజలు అందుకొనే స్వామే మూల విరాట్టు అనుకొంటారు. నిజానికి అక్కడి రుక్మిణీ సత్యభామ సమేత పార్థసారథి పెరుమాళ్ ప్రధాన విగ్రహం. నవాబులు దాడి చేసినప్పుడు విగ్రహాలను కాపాడుకోవడానికి స్వామికి గోడ కట్టేశారు. దాంతో ఆ పక్కనే ఉన్న గోవిందరాజస్వామి విగ్రహం తీసుకుపోయారు. ఆ స్థానంలో ప్రస్తుత సున్నపురాయి విగ్రహం పెట్టారు. 1978 ప్రాంతంలో టీటీడీ ఈవోగా చేసిన పీవీఆర్‌కే ప్రసాద్ గారి ద్వారా, లోపల విగ్రహం ఉందనేది వెలుగులోకి వచ్చింది. ఆయన రాసిన పుస్తకాల ఆధారంగా నేను ఈ విషయాలు తెలుసుకున్నాను. ప్రతి ఆలయానికీ ఒక ప్రాశస్త్యం ఉంటుంది. వాటిని క్షుణ్ణంగా తెలుసుకొని ప్రజల ముందు పెట్టే ప్రయత్నం చేస్తున్నాను.

▸▸ చెట్టు కింద స్వామి...

తిరుపతి దగ్గర మంచినీటిగుంటలో చెట్టు కింద గోవిందరాజస్వామి ఉంటారు. అక్కడ గుడి లేదు. చిదంబరంలో క్రిమికంఠ చోళ అనే రాజు ఉండేవాడు. వైష్ణవుడైనా ఆయన శైవం స్వీకరించి, వైష్ణవ దేవాలయాలన్నీ కూలగొట్టి, ఆ స్థానంలో శివాలయాలు నిర్మించేవాడు. 'దశావతారం' చిత్రం దీని ఆధారంగా తీసిందే. ఆయన నుంచి కాపాడుకోవడానికి కొందరు గోవిందరాజస్వామి విగ్రహాన్ని తెచ్చి మంచినీటిగుంటలో పెట్టారని చెబుతారు. అయితే ఇందుకు స్పష్టమైన ఆధారాలు లేవు. తెచ్చే క్రమంలో విగ్రహం పగిలింది. పగిలిన విగ్రహానికి ఆరాధనలు చేయకూడదు కాబట్టి, గుడి నిర్మించలేదు. అయితే స్థానిక ఎన్ఆర్ఐ ఒకరు చూసి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి, స్వామివారికి ప్రతి శనివారం పూజాదికాలు జరిపిస్తున్నారు. ఆయనతో మాట్లాడి దీనిపై ఒక వీడియో రూపొందిచాను.

▸▸ ఏడు వందలకు పైనే...

ఇప్పటివరకు ఏడు వందలకు పైగా వీడియోలు చేశాను. 'తిరుమల కథలు' పేరుతో వారం వారం ఎపిసోడ్స్ విడుదల చేస్తున్నాను. అలాగే గండికోటకు సంబంధించి కూడా పలు ఎపిసోడ్స్ తీశాను. షూటింగ్, ఎడిటింగ్, డబ్బింగ్... అన్నీ నేనే. అదికూడా నా మొబైల్ ఫోన్‌తోనే. చదువుకొంటూనే ఇవన్నీ చేస్తున్నాను. ఎడిటింగ్ తదితర పనులవల్ల ఒక్కోసారి రాత్రిళ్లు నిద్ర ఉండదు. గండికోట వీడియోల నుంచి నా చానల్ చూసేవారి సంఖ్య బాగా పెరిగింది. ఇప్పటికైతే దాదాపు లక్షన్నరమంది సబ్‌స్క్రైబ్ చేశారు. ప్రతి వీడియోకు వ్యూస్ వేలల్లో ఉంటాయి.

▸▸ అక్కడికి వెళ్లింది నేనే...

కర్ణాటక సరిహద్దులో, అనంతపురం దగ్గర హేమావతి అనే గ్రామం ఉంది. అక్కడి దేవాలయంలో శివుడు లింగ రూపంలో కాకుండా విగ్రహ రూపంలో దర్శనమిస్తాడు. ఇలా మరెక్కడా చూడం. నోలంబులు అనే రాజులు ఆ ప్రాంతాన్ని పాలించారు. వారు పల్లవులు, చాళుక్యుల మధ్య వారధిగా ఉండేవారు. చరిత్ర పుస్తకాల్లో ఎక్కడా ఇది కనిపించదు. అక్కడ అన్ని రకాల వాస్తుశిల్ప శైలులనూ చూస్తాం. అద్భుత ఆలయం అది. దీనిపై తీసిన వీడియోకు విశేష స్పందన వచ్చింది. అలాగే వాల్మీకి గుహలు పాతాళంలోకి వెళ్లినట్టు చాలా కిందికి ఉంటాయి. అందరూ వెళ్లలేరు. కిందికి దిగేకొద్దీ ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోతుంటాయి. గుహల్లో ఒక్కోచోట ఒక్కో రకమైన రాళ్లు ఉంటాయి. అక్కడివరకు వెళ్లిన తొలి మహిళా యూట్యూబర్‌ను నేనే. భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని మరింతమందికి చేరువ చేయాలనేది నా ప్రధాన లక్ష్యం. అందుకే చదువు తరువాత కూడా నా ఈ ప్రయాణం కొనసాగిస్తాను."

● హనుమా

> **సీఎం నుంచి అవార్డు...**
>
> "సాధారణ యూట్యూబ్ చానళ్లకు భిన్నంగా, ఏపీలో పర్యాటకాన్ని ప్రోత్సహించేలా నేను రూపొందిస్తున్న వీడియోలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. నా కృషిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో నాకు 'బెస్ట్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్' అవార్డును ఇచ్చింది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకున్నా. ఇది నా జీవితంలో మధుర ఘట్టం. ఆనాటి నుంచి నా పేరు ఎంతోమందికి పరిచయమైంది. నా చానల్ చూసేవారి సంఖ్య పెరిగింది. ఇదేకాకుండా ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొంటున్నాను."

ఇంటి భోజనమే అయినా...

ఇంట్లో తయారుచేసే భోజనంలో ప్రేమ, అభిమానం దాగి ఉంటాయి. ఇవి ఇంటిల్లిపాదికీ ఆనందాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయి. అయినప్పటికీ భోజనం వండేటపుడు అనుసరించే కొన్ని పద్ధతులు, వంటలో ఉపయోగించే ఆహార దార్థాల మోతాదు వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదముంది. కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్యకరమైన భోజనం అందించేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం!

నూనె, నెయ్యి

● మనం కూరలు వండేటపుడు అవసరమైనదానికంటే కొంచెం ఎక్కువ నూనె ఉపయోగిస్తూ ఉంటాం. దీనివల్ల కూర రుచి పెరుగుతుంది అనుకుంటాం. అట్లు వేసేటపుడు, చపాతీలు కాల్చేటపుడు కూడా నెయ్యి లేదా వెన్న ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటాం. రుచిగా ఉంటాయని తరచూ వేపుళ్లు, పకోడీలు తయారు చేస్తూ ఉంటాం. ఇలా నూనె పదార్థాలు తినడం వల్ల శరీరంలో కొవ్వు శాతం, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి అధికమవుతాయి. బరువు పెరగడంతోపాటు గుండె సంబంధిత సమస్యలు ఎదురవుతాయి. వంటచేసేటపుడు అవసరమైనంత వరకు మాత్రమే నూనె, నెయ్యి ఉపయోగించడం మంచిది.

పంచదార

● పుట్టిన రోజులు, పండుగల సందర్భాల్లో తయారు చేసే గులాబ్ జామూన్, హల్వా, పాయసం, పొంగలి తదితర వంటకాల్లో పంచదారను అవసరమైనదానికంటే ఎక్కువగా వాడుతూ ఉంటారు. ఇలాంటి తీపి పదార్థాలు తినడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం మందగిస్తుంది. పొట్టలో ఆమ్లాలు ఉత్పత్తి అవుతాయి. మధుమేహం వచ్చే ప్రమాదముంటుంది. పంచదారను వీలైనంత తక్కువగా వాడడం, బదులుగా బెల్లం ఉపయోగించడం శ్రేయస్కరం.

ఉప్పు

● రోజూ వండే వంటల్లో ఉప్పును కాస్త తగ్గించి వేయడం మంచిది. ఉప్పు ఎక్కువగా ఉండే నిల్వ పచ్చళ్లు, అప్పడాలు, రోటి పచ్చళ్లను భోజనంలో మితంగా వడ్డించాలి. కుటుంబ సభ్యులు పెరుగన్నంలో ఉప్పు కలుపుకోవడాన్ని సమర్థించకూడదు. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో సోడియం స్థాయి పెరిగి రక్తపోటు తద్వారా గుండె సంబంధిత వ్యాధులు వస్తాయి.

మైదా

● గోధుమ పిండిని పూర్తిగా శుద్ధి చేస్తే తెల్లని మైదా వస్తుంది. ఇందులో ఏ పోషకాలు ఉండవు. రుచిగా ఉంటాయని మైదా పిండితో పునుగులు, పూరీలు, చపాతీలు చేస్తూ ఉంటారు. వీటిని తినడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులు వస్తాయి. మైదాకి బదులు గోధుమ పిండిని ఉపయోగించడం చాలా మంచిది. మైదా, పంచదార, వెనీలా ద్రావణం చుక్కలు కలిపి ఇంట్లో తయారుచేసే కేక్ కన్నా కిరాణా కొట్లో అమ్మే గోధుమపిండి మఫిన్ ఆరోగ్యానికి ఎంతో మంచిది.



పోషకాలు ఉండేలా..

● కూరగాయలను అతిగా ఉడికించడం, వేపడం వల్ల వాటిలోని పోషకాలు నశించిపోతాయి. ఆకు కూరలను కూడా చిన్నమంట మీద తగినంత మేరకు మాత్రమే మగ్గించాలి. వంట చేసేటపుడు ఆవిరి మీద ఉడికించడం, కాల్చడం వంటి పద్ధతులను పాటిస్తే ఆహార పదార్థాల్లోని విటమిన్లు, మినరల్స్ నష్టపోకుండా ఉంటాయి. కూర వండేటపుడు ఎక్కువగా మసాలా పొడులు కలపడం మంచిది కాదు. దీనివల్ల కడుపులో మంట, అజీర్ణం తదితర సమస్యలు ఏర్పడతాయి.

ఆరోగ్యం

ఇన్‌ఫ్లమేషన్‌ను తరిమేద్దామిలా!

శరీరంలో కొన్ని రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు ప్రవేశించి వ్యాధులను కలిగిస్తాయి. వీటికి చికిత్స తీసుకున్న తరవాత కూడా కోలుకోకపోతే అవి ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తాయి. దీనివల్ల కడుపులో మంట, కీళ్లవాపు, చలిజ్వరం, నీరసం, తల నొప్పి, చర్మంపై దద్దుర్లు, తినాలనిపించకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి ఇన్‌ఫ్లమేషన్‌ను నివారించేందుకు ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకోవాలో తెలుసుకుందాం!

ఆకు కూరలు : పాల కూర, బచ్చలి కూరలను తరచూ తినడం వల్ల శరీరానికి కావాల్సిన మినరల్స్, విటమిన్లు అంది ఇన్‌ఫ్లమేషన్ సమస్యలు తగ్గుముఖం పడతాయి. క్యాబేజీ ఆకులను సలాడ్‌లు, స్మూతీలు, ఇతర వంటకాల్లో చేర్చుకుని తింటే కడుపులో మంట, చర్మ వ్యాధులు తగ్గుతాయి.

ఆలివ్ ఆయిల్ : ఇందులో ఉండే ఒలియోకాంతల్ సమ్మేళనాలు ఎముకల సమస్యలు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల వాపులు, నరాల బలహీనత, క్యాన్సర్ వాపుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. పలు రకాల సలాడ్స్‌లో ఆలివ్ ఆయిల్ కలిపి తీసుకోవడం మంచి ఫలితాన్నిస్తుంది. టొమాటోలను ఆలివ్ ఆయిల్‌లో వేయించి తినడం వల్ల వాటిలోని లైకోపీన్ శరీరానికి అంది వాపులు, నొప్పులు తగ్గుముఖం పడతాయి.

స్ట్రాబెరీ : దీనిలో ఉండే ఆంథోసైనిన్స్ సమ్మేళనాలు శరీరంలోని వాపులను, దీర్ఘకాలిక వ్యాధులను హరించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. స్ట్రాబెరీ ముక్కలను పెరుగులో కలుపుకుని తింటే మంచి ప్రయోజనం ఉంటుంది.

గింజలు : బాదం, వాల్‌నట్స్, అవిసె గింజలు, గుమ్మడి గింజలను తరచూ తినడం వల్ల శరీరంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు వృద్ధిపొందుతాయి. పలు రకాల గింజల్లో ఉండే క్రొవ్వులు, పీచు పదార్థాలు శరీరంలో పేరుకున్న వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతాయి.

పసుపు : వంటకాల్లో పసుపును తరచూ చేర్చడం వల్ల అందులోని కర్క్యుమిన్ మధుమేహం, క్యాన్సర్ కారణంగా వచ్చే వాపులను తగ్గిస్తుంది. పసుపులోని ఇతర ఔషధగుణాలు కీళ్లనొప్పులను నివారిస్తాయి.

అల్లం : ఆహారంలో భాగంగా అల్లం చేర్చుకుంటే దీనిలోని జింజెరోల్స్ అనే పదార్థం శరీరంలోని వివిధ భాగాల్లో ఏర్పడే వాపులను, నొప్పులను నివారిస్తుంది. అల్లం టీ తాగితే అరుచి తగ్గి జీర్ణక్రియ మెరుగవుతుంది.

దాల్చిన చెక్క: ఇందులో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఓట్‌మీల్, స్మూతీలు, ఇతర వంటకాల్లో దాల్చిన చెక్క పొడిని కలిపి తీసుకుంటే అరికాలి మంటలు, నీరసం తగ్గుతాయి. రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది.

వెల్లుల్లి : ఇన్‌ఫ్లమేషన్ కారణంగా శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. వెల్లుల్లిని వంటల్లో ఉపయోగించినా పచ్చిగా తిన్నా అందులోని అల్లిసిన్ సమ్మేళనం ఈ ఒత్తిడిని తగ్గించి ఉపశమనం కలిగిస్తుంది.

తులసి : పలు రకాల సలాడ్‌లు, పాస్తా వంటకాల్లో తులసి ఆకులను కలిపి తినడం వల్ల శరీరానికి యూజినాల్ సమ్మేళనాలు అంది వాపులు, నొప్పులను హరిస్తాయి. ఉదయాన్నే నాలుగు తులసి ఆకులు తిన్నా కూడా రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది.



గ్రీన్ టీ: గ్రీన్ టీని తరచూ త్రాగడం వల్ల అందులోని పాలీఫెనాల్స్ రక్షణ కవచంలా పనిచేసి ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమైన క్యాన్సర్, మధుమేహం, గుండెకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధులను తరిమికొడతాయి. డార్క్ చాక్లెట్‌ను మితంగా తిన్నా కూడా వాపులన్నీ మాయమవుతాయి.



వినూత్నం

తేనెతో తారాస్థాయికి

నాన్న కష్టాన్ని దోచుకుంటూ, తేనెను కల్తీ చేసి విక్రయిస్తున్న వ్యాపారులకు బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో, కాశ్మీరుకు చెందిన సానియా జెహ్రా, తండ్రి వ్యాపార పగ్గాలను చేపట్టింది. వ్యాపారంలోకి అడుగుపెట్టిన కొద్ది కాలంలోనే తేనె ఉత్పత్తితో పాటు తేనెటీగల పుప్పొడితో వ్యక్తిగత ఉత్పత్తులను రూపొందిస్తూ, నెలకు రెండు లక్షలు సంపాదించే స్థాయికి ఎదిగిపోయింది. 19 ఏళ్ల ఆ యువ మహిళా వ్యాపారవేత్త కథనమిది.

భారతదేశంలోని అత్యంత నాణ్యమైన తేనె జమ్మూ కాశ్మీర్‌లో ఉత్పత్తవుతూ ఉంటుంది. అయితే డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకూ గడ్డకట్టే చలికాలం, తేనె ఉత్పత్తికి అనువైన కాలం కాదు కాబట్టి, ఆ ఐదు నెలల పాటు తేనెటీగల పెట్టెలను పంజాబ్, రాజస్థాన్‌లకు తరలించక తప్పదు. అలా బాల్యం నుంచి, తండ్రితో పాటు తేనెటీగలను పెంచే చెక్క పెట్టెలను వెంటబెట్టుకుని, పంజాబ్‌కూ, రాజస్థాన్‌కూ తిరుగుతూ ఉండేది సానియా.

ఆ క్రమంలో 180 కాలనీల నుంచి తండ్రి ఎంతో కష్టపడి తేనెను సేకరిస్తూ వ్యాపారాలకు విక్రయించడాన్ని దగ్గరి నుంచి గమనించింది. కానీ ఎంత కష్టపడినా వ్యాపారులు సరసమైన ధరకు తేనెను విక్రయించకపోవడం, తమ దగ్గర కొనుక్కున్న తేనెను కల్తీ చేసి, నాలుగింతలు ఎక్కువ లాభానికి అమ్ముకుంటూ ఉండడాన్ని కూడా ఆమె గ్రహించింది. ఆ దోపిడీని తట్టుకోలేక, టీనేజీ వయసు నుంచి తండ్రి బాధ్యతను తన తలకెత్తుకుంది.

▸▸ ఏకంగా 650 కాలనీలతో...

"డబ్బు మీద ఆశతో మా దగ్గర కొన్న తేనెను కల్తీ చేసి ఎక్కువ లాభానికి అమ్ముకుంటున్న వ్యాపారులను చూశాను. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో నేనీ వ్యాపారంలోకి అడుగుపెట్టాను. తేనెటీగల పెంపకం మా కుటుంబ వ్యాపారం. అయితే తేనెటీగల పెంపకంతో మా కుటుంబానికి ఉన్న అనుబంధం ఎంతో బలీయమైనది. సంప్రదాయ విధానాలను అనుసరిస్తూనే, కుటుంబ వ్యాపారాన్ని మరింత సుస్థిరంగా కొనసాగించే ఆధునిక మార్గాల కోసం నేను అన్వేషించాను. నిజానికి కాశ్మీరు మహిళలు వ్యాపారంలోకీ, మరీ ముఖ్యంగా తేనెటీగల పెంపకంలోకి అడుగు పెట్టడం ఎంతో అరుదు. పదో తరగతి పూర్తయ్యాక, ఫిజియోథెరపీ డిప్లొమాలో చేరాను. కానీ నా మనసంతా తేనెటీగల పెంపకం మీదే నిమగ్నమై ఉంది. ఈ విషయాన్ని స్నేహితులతో, కుటుంబంతో చర్చించినప్పుడు వాళ్లు నా అభిప్రాయాన్ని వ్యతిరేకించారు. కానీ అంతిమంగా నాన్న గుల్జార్ అహ్మద్ మిర్, నా నిర్ణయాన్ని అంగీకరించడంతో నా సంతోషానికి అవధులు లేకుండా పోయాయి" అంటూ తేనెటీగల పెంపకంలోకి అడుగుపెట్టే వరకూ సాగిన తన ప్రయాణం గురించి వివరించింది సానియా. అలా రెండేళ్ల క్రితం, స్థానిక వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ మార్పుకు తోడ్పడే, జమ్ము అండ్ కాశ్మీర్ హోలిస్టిక్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అందించే సబ్సిడీ కోసం అర్జీ పెట్టుకుంది. కాలనీకి నాలుగు వేల రూపాయల చొప్పున 35 తేనెటీగల కాలనీలను ఒకటిన్నర లక్షతో కొనుగోలు చేసింది. ఆ తర్వాత 35 కాలనీలను రెండుగా విడగొట్టి వాటిని రెట్టింపు చేసింది. అలా కాలనీల సంఖ్య పెంచుకుంటూ నేటికి 650 కాలనీలను నెలకొల్పగలిగింది సానియా.

▸▸ తేనెటీగల స్రావాలతో, పుప్పొడితో...

"ఈ మొత్తం కాలనీల ద్వారా ప్రతి రుతువులో 5,500 కిలోల తేనె సమకూరుతూ ఉంటుంది. శీతాకాల మాసాల్లో రాజస్థాన్, పంజాబ్‌లకు తరలివెళ్లే తేనెటీగల పెట్టెలు, ప్రస్తుతం దక్షిణ కాశ్మీరులోని పుల్వామా జిల్లాలో ఉన్న పాంపోర్ కుంకుమ పువ్వు పొలాల్లో నెలకొని ఉన్నాయి. వీటి నుంచి సేకరించిన తేనెను వ్యాపారులకు బదులుగా నేరుగా వినియోగదారులకే విక్రయించడం మొదలుపెట్టాను. మా తేనెకు 'కాశ్మీరు ప్యూర్ ఆర్గానిక్స్' అనే పేరు కూడా పెట్టుకున్నాను. తేనెటీగల కాలనీలకు సంబంధించిన దేదీ వృథా కాకూడదనే ఉద్దేశంతో, తేనెటీగలు సేకరించే పుప్పొడి, వాటి నుండి వెలువడే స్రావాలతో సబ్బులు తయారుచేసి విక్రయించడం మొదలుపెట్టాను. ఉత్పత్తుల్లో వైవిధ్యాన్ని కనబరచడం ద్వారా బహుళ ఆదాయాలను ఆర్జించగలుగుతున్నాను" అంటూ చెప్పుకొచ్చిన సానియా, నెలకు ఏకంగా 2 లక్షల రూపాయలను ఆర్జిస్తూ ఉండడం విశేషం.



బీమా సుగమ్ కోసం రూ.500 కోట్లు

ముంబై: భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) తలపెట్టిన 'బీమా సుగమ్' ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బీమా మంథన్ సదస్సులో బీమా కంపెనీలు ఈ అంచనాకు వచ్చినట్టు సమాచారం. అన్ని రకాల బీమా పాలసీల మార్కెటింగ్, ఇతర సేవలు ఒకే చోట అందించేందుకు ఐఆర్‌డీఏఐ ఈ సింగిల్ విండో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను తలపెట్టింది. ఇందుకు రూ.100 నుంచి రూ.200 కోట్లు ఖర్చవుతుందని మొదట్లో అంచనా వేశారు. తాజా అంచనాల ప్రకారం ఇందుకు ఎంతలేదన్నా రూ.500 కోట్లు ఖర్చవుతుందని కంపెనీలు ఒక అంచనాకు వచ్చాయి.

- ప్రీ-ఇంజనీర్డ్ బిల్డింగ్ తయారీ సంస్థ ఈప్యాక్ ప్రీఫ్యాబ్.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా, మాంబట్టులో కేవలం 150 గంటల్లో అడ్వాన్స్‌డ్ ప్రీఫ్యాబ్, పీఈబీ టెక్నాలజీతో ఫ్యాక్టరీ బిల్డింగ్ నిర్మాణాన్ని పూర్తి చేసింది.
- డ్రోన్ టెక్నాలజీ సంస్థ ఐడియాఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్.. ఫ్లైట్ పెట్రోల్ డ్రోన్ సేవలను ప్రారంభించింది. ప్రజా రక్షణ, ట్రాఫిక్ నిర్వహణలో ఇది కీలకంగా ఉండనుంది.
- గోవాలో ఈ నెల 28 నుంచి 30 వరకు దక్షిణాసియా కాంక్లేవ్ 2024ను నిర్వహిస్తున్నట్లు స్టాన్‌ఫోర్డ్ సీడ్ ట్రాన్స్‌ఫార్మేషన్ నెట్‌వర్క్ ప్రకటించింది. ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఈ సదస్సు ఒక ప్లాట్‌ఫామ్‌గా ఉపయోగపడుతుందని స్టాన్‌ఫోర్డ్ సీడ్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ అభిషేక్ మోదీ అన్నారు.

దీన్ దయాళ్ క్షేత్రంలో అరకొర ఉత్పత్తితో

ఓఎన్‌జీసీకి తిప్పలు



రోజుకు కేవలం 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ గ్యాస్ ఉత్పత్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ తీరంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో ఉన్న దీన్ దయాళ్ సహజ వాయువు క్షేత్రం.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి పెద్ద గుదిబండలా మారింది. భారీ గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయనే పేరుతో గుజరాత్ ప్రభుత్వ రంగ సంస్థ గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎస్‌పీసీఎల్) ఈ గ్యాస్ ఫీల్డ్‌ను 2017 జూలైలో ఓఎన్‌జీసీకి అంటగట్టింది. అంతకు ముందే జీఎస్‌పీసీ ఈ సహజ వాయు క్షేత్రంలో తనకున్న 80 శాతం వాటాలో 50 శాతం ఇస్తానన్నా ఓఎన్‌జీసీ తిరస్కరించింది. అయితే 2017కు వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. దీన్ దయాళ్ ఫీల్డ్ ఈక్విటీలో తనకున్న మొత్తం 80 శాతం వాటాను జీఎస్‌పీసీ.. ఓఎన్‌జీసీకి రూ.7,738 కోట్లకు విక్రయించింది.

అంతా 'గ్యాసే'

జీఎస్‌పీసీఎల్ ఈ గ్యాస్ ఫీల్డ్‌లో 20 లక్షల కోట్ల ఘనపుటడుగుల (టీసీఎఫ్) గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు, దీన్నుంచి రోజూ 20 కోట్ల ప్రామాణిక ఘనపుటడుగుల (ఎంఎస్‌సీఎఫ్‌పీడీ) గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని మొదట్లో గ్యాస్ కొట్టింది. ఓఎన్‌జీసీకి తన 80 శాతం వాటా అమ్మే నాటికే జీఎస్‌పీసీ ఈ క్షేత్రంలో మూడు గ్యాస్ బావులు తవ్వింది. ఓఎన్‌జీసీ చేతికి వచ్చాక మరో ఏడు బావులు తవ్వారు. సాంకేతిక సమస్యలతో ఇందులో మూడు బావుల డ్రిల్లింగ్ మధ్యలోనే ఆపేశారు. పూర్తి చేసిన మిగతా నాలుగు బావుల్లోనూ రోజువారీ గ్యాస్ ఉత్పత్తి 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ మించడం లేదు.

ఖర్చు బారెడు

తన చేతికి వచ్చాక ఓఎన్‌జీసీ.. దీన్ దయాళ్ క్షేత్రం ఫీల్డ్ అభివృద్ధి కోసం పెద్ద మొత్తమే ఖర్చు చేసింది. ఈ కొనుగోలుతో జీఎస్‌పీసీఎల్ మాత్రం తన అప్పుల భారం కుదించుకుంది. ఓఎన్‌జీసీ మాత్రం తన మిగులు నిధుల్లో ఎక్కువ భాగం ఇందుకోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. మంచి ఆర్థిక స్తోమత, టెక్నాలజీ ఉన్న ఏదైనా సంస్థ ముందుకు వస్తే భాగస్వామ్యంతో దీన్ దయాళ్ గ్యాస్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేయాలని ఓఎన్‌జీసీ చూస్తోంది. అందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఈ గ్యాస్ ఫీల్డ్ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి పెద్ద భారంగా మారింది.

ఐసీఐసీఐ ప్రు మల్టీ అసెట్ ఫండ్‌తో మెరుగైన రిటర్నులు



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీకి చెందిన మల్టీ అసెట్ ఫండ్.. మదుపరులకు అద్భుతమైన రిటర్నులను అందించింది. 2002 అక్టోబరు 31న ప్రారంభమైన ఈ ఫండ్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.50,495.58 కోట్లుగా ఉంది. దేశంలోని అతిపెద్ద మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్స్‌ల్లో ఇది ఒకటి. ఈ ఫండ్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఏటా సగటున 21.58 శాతం రిటర్నులు అందించింది. ఈ ఫండ్ ప్రారంభంలో ఏకమొత్తంగా రూ.10 లక్షలు పెట్టుబడిగా పెట్టి ఉంటే ఈ ఏడాది సెప్టెంబరు 30 నాటికి ఈ మొత్తం రూ.7.26 కోట్లకు చేరుకుందని ఐసీఐసీఐ ప్రు వెల్లడించింది. ఇదే సమయంలో నిఫ్టీ 200 టీఆర్ఐ, నిఫ్టీ కాంపోజిట్ డెట్ ఇండెక్స్ ఏటా 17.39 శాతం వృద్ధితో రూ.3.36 కోట్ల రిటర్నులను మాత్రమే అందించాయి. సిప్ రూపంలో నెలకు రూ.10,000 ఇన్వెస్ట్ చేసినా ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ఆ మొత్తం రూ.2.9 కోట్లకు చేరింది. సంపద సృష్టిలో ఐసీఐసీఐ ప్రు మల్టీ అసెట్ ఫండ్ ఎంతో కీలకంగా ఉందని, ఎప్పటికప్పుడు వ్యూహాలను మార్చుకుంటూ వివిధ అసెట్ క్లాస్‌ల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇన్వెస్టర్లకు మంచి రిటర్నులు అందించగలిగినట్లు ఐసీఐసీఐ ప్రు ఏఎంసీ ఎండీ, సీఈఓ నిమేశ్ షా అన్నారు.

24,300 పైన బుల్లిష్

(నవంబరు 25-29 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,956-23,263 పాయింట్ల మధ్యన కదలాడి 375 పాయింట్ల లాభంతో 23,907 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,562, 23,644, 23,909, 24,482 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,300 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,400
నిరోధ స్థాయిలు: 24,100, 24,200, 23,400 (24,000 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,700, 23,500, 23,400 (23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	595
వరంగల్	582	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		దజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	75
కర్నూలు	107	నెల్లూరు	75
విశాఖపట్నం	120	అనంతపురం	75
గోదావరి	108		

లాభాల బాటలోనే.!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, డాలర్ దూకుడు తగ్గటం, చైనా ఉద్దీపన పథకంతో పెద్దగా ప్రయోజనాలు లేకపోవటం, విదేశీ సంస్థాగత మదుపరులు మళ్లీ తిరిగొచ్చే సూచనలు, అదానీపై కోర్టు అభియోగాల ప్రభావం తగ్గిపోవటమే ఇందుకు కారణాలు. గత శుక్రవారం సెషన్ ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. ఫండమెంటల్స్ బలంగా ఉన్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో బీజేపీ విజయం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపింది.

స్టాక్ రికమండేషన్స్

జుబిలెంట్ ఫుడ్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. తాజా త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటం, ఈపీఎస్ పెరగటంతో మూమెంటమ్ కనిపిస్తోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేరు కొంత దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో ఉంది. గత శుక్రవారం 4.5 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.630/600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.675/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.580 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పేటీఎం: పేమెంట్ బ్యాంక్ సేవలకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో దూసుకుపోతోంది. నష్టాల మార్కెట్లోనూ పటిష్ఠతను సూచించింది. రిలేటివ్ స్ట్రెంత్ చాలా బాగుంది. ప్రస్తుతం కీలక రెసిస్టెన్స్ జోన్ వద్దకు చేరుకుంటోంది. దాన్ని బ్రేక్ చేస్తే ఇక తిరుగులేదు. గత శుక్రవారం 6.5 శాతం లాభంతో రూ.900 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫీనిక్స్ మిల్స్ లిమిటెడ్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 33 శాతం మేర పతనమైంది. తాజాగా మళ్లీ పెరుగుతూ వస్తోంది. చివరి నాలుగు సెషన్లలో ఏకంగా 18 శాతం పెరిగింది. గత శుక్రవారం 5.33 శాతం లాభంతో రూ.1,616 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,600 స్థాయిలో ప్రవేశించి రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రియా లైఫ్ సైన్సెస్: ఐపీఓ ఇష్యూ ధర నుంచి 70 శాతం మేర పతనమైన ఈ షేరు గత ఏడాది మార్చి నుంచి టర్న్ అరౌండ్ అయ్యాయి. అప్పటి నుంచి బుల్‌రన్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ షేరుకు ఐపీఓ గరిష్ఠ స్థాయి వద్ద మద్దతు లభించింది. సేల్స్, ఈపీఎస్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం 14 శాతం లాభంతో రూ.806 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.780 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.860/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విజయ డయాగ్నోస్టిక్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. మెరుగైన ఫలితాలు ప్రకటించటం, ఈపీఎస్, సేల్స్ పెరగటంతో మూమెంటమ్ పెరిగింది. బడా ఇన్వెస్టర్లు అక్యుములేట్ చేసుకుంటున్నారు. చివరి మూడు సెషన్లలో 25 శాతం పెరిగిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,160 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 ఎగువన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో డౌన్ ట్రెండ్‌ను కొనసాగిస్తూ 23,300 కన్నా దిగజారినా శుక్రవారం ఏర్పడిన బలమైన రికవరీలో 560 పాయింట్ల మేరకు లాభపడింది. చివరికి గత వారంతో పోల్చితే 375 పాయింట్ల లాభంతో 23,900 సమీపంలో ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ ఎనిమిది వారాల డౌన్ ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీ సాధించింది. అయితే మార్కెట్ ఇప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ నిట్టనిలువుగా బౌన్స్‌బ్యాక్ సాధించినందు వల్ల స్పష్టమైన సందేశం ఇవ్వాలంటే కన్సాలిడేట్ కావడం తప్పనిసరి. అయితే ఈ రివర్సల్‌తో తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పును మాత్రం తప్పించుకుంది. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 975 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 155 పాయింట్లు లాభపడ్డాయి. ఈ వారంలో నిఫ్టీ మరింత పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో 24,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత పాజిటివ్ సంకేతం ఇవ్వాలంటే నిఫ్టీ తదుపరి నిరోధం 24,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ స్థాయిలు 24,350, 24,550. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు.

బేరిష్ స్థాయిలు: ఏ మాత్రం బలహీనత ప్రదర్శించినా మద్దతు స్థాయి 24,000 వద్ద కన్సాలిడేషన్ తప్పనిసరి. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 23,800, 23,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 950 పాయింట్ల మేరకు రికవరీ సాధించి చివరికి 51,000 కన్నా స్వల్పంగా పైన క్లోజైంది. మరింత సానుకూలత కోసం తదుపరి నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,200. ప్రస్తుత మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 49,400.

పాటర్న్: నిఫ్టీ గత వారం 200 డీఎంఏ వద్ద రికవరీ సాధించింది. ఇప్పుడు నిరోధ స్థాయి 24,100 సమీపంలో గల 25 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ గత వారం ఓవర్‌సోల్డ్ స్థితి నుంచి కోలుకుంటున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,000, 24,155
మద్దతు	24,000, 23,920



నవ్య | చిత్రజ్యోతి



ఆ కోరికను పుష్ప 2 తీర్చింది

'పుష్ప చిత్రం అంతర్జాతీయ స్థాయిలో నాకు నటుడిగా గుర్తింపును ఇచ్చింది. డిసెంబర్ 5న వస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంతో దేశవ్యాప్తంగా వైల్డ్ ఫైర్ రాబోతోంది. మూడేళ్లు నా జీవితాన్ని ఈ సినిమాకు అంకితం చేశాను. హీరో అయినప్పటి నుంచి చెన్నైలో నా సినిమా కార్యక్రమం ఒక్కటైనా చేయాలనుకుంటున్నాను. ఆ కోరికను 'పుష్ప 2' తీర్చింది' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఆదివారం చెన్నైలో 'వైల్డ్ ఫైర్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అల్లు అర్జున్, శ్రీలీల నర్తించిన ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ 'రష్మిక తక్కువ సమయంలోనే నా మనసుకు దగ్గరయ్యారు. తను నన్ను చాలా బాగా ప్రోత్సహించారు. అల్లు అర్జున్ పాట కావడంతో బాగా కష్టపడ్డాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'పుష్ప'కు ముందు తర్వాత అనేలా నా కెరీర్ మారింది. నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా ఈ చిత్రం మిగిలిపోతుంది' అన్నారు.

ఖరీదైన కానుకలు ఇచ్చా



ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన వెబ్ సిరీస్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె హీరో వరుణ్ ధావన్‌తో 'స్పైసీ ర్యాపిడ్ ఫైర్' అనే సరదా సంభాషణలో పాల్గొన్నారు. 'ట్రూత్ అండ్ డేర్' గేమ్‌లా ఉండే ఇందులో.. వరుణ్ అడిగిన దానికి సమాధానం చెప్పాలి.. చెప్పలేకపోతే పచ్చిమిర్చి తినాలి. 'మీరు ఏ వస్తువుల కోసం డబ్బులు అనవసరంగా ఖర్చు చేశారు' అని వరుణ్ అడిగారు. "నా ఎక్స్‌కు ఇచ్చిన కానుకల కోసం' అని సమంత సమాధానమిచ్చారు. 'అవునా.. ఎంత ఖర్చైంది' అని వరుణ్ అడగ్గా.. 'కొంచెం ఎక్కువే.. ఇక, తరువాతి ప్రశ్నకు పోదామా' అని సమంత బదులిచ్చారు. 'మీరు ఈ కార్యక్రమానికి వచ్చే ముందు ఎవరికి చివరగా మెసేజ్ చేశారు. దాన్ని పైకి చదివి వినిపిస్తారా' అని వరుణ్ అడగ్గా.. ఆ ప్రశ్నకు సమాధానమివ్వని సామ్ పచ్చిమిర్చి తిన్నారు.

ప్రేమంటారా? కాదంటారా?



ప్రేమలో ఉన్నామని పైకి చెప్పకపోయినా తరచూ చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతూ కెమెరాలకు చిక్కుతున్నారు విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్న. తాజాగా ఈ జంట మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. వీరిద్దరూ కలసి ఓ రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చెన్నైలో నిర్వహించిన 'పుష్ప 2' కార్యక్రమంలో 'మీ ప్రేమ, పెళ్లి గురించి చెప్పండి' అని యాంకర్ రష్మికను అడగ్గా 'తొందరెందుకు 'పుష్ప 2' విడుదలయ్యాక మీరే చూస్తారు కదా' అని బదులిచ్చారు. ఇండస్ట్రీకి చెందిన వ్యక్తా, బయట వ్యక్తా అని అడిగితే 'అది అందరికీ తెలిసిన విషయమే కదా' అంటూ స్పందించారు.



సమరానికి నేడే ఆరంభం

లిరెన్‌తో గుకేష్ పోరు

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్

మ. 2.30 నుంచి ఫిడే యూట్యూబ్ చానెల్‌లో..

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఆరంభ సంబరాలు ముగిశాయి. ఇక అసలు సమరానికి వేళైంది. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, చాలెంజర్ గుకేష్ విశ్వ కిరీటం కోసం 14 రౌండ్లలో తలపడనున్నారు. రెండు వారాల టోర్నీలోని తొలి రౌండ్ సోమవారం జరగనుంది. విజయానికి ఒక పాయింట్, డ్రాకు అర పాయింట్ లభిస్తాయి. తొలుత 7.5 పాయింట్లకు చేరిన వారిని విజేతగా ప్రకటిస్తారు. 14 గేమ్‌ల తర్వాతా ఇద్దరు ఆటగాళ్ల స్కోరు సమంగా ఉంటే.. టైబ్రేకర్ ద్వారా చాంపియన్‌ను నిర్ణయిస్తారు.

సింగపూర్: అరవై నాలుగు గళ్ల ఆటలో ఆధిపత్యం ఎవరిదో తేల్చుకునేందుకు డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, భారత యువ సంచలనం గుకేష్ సిద్ధమయ్యారు. ప్రతిష్ఠాత్మక ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో ఈ ఇద్దరు సోమవారం నుంచి తలపడనున్నారు. ప్రస్తుత ఫామ్ పరంగా చూస్తే భారత్‌కు చెందిన 18 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ గుకేష్‌నే చెస్ పండితులు తిరుగులేని ఫేవరెట్‌గా భావిస్తున్నారు. అయితే ఒత్తిడి పరిస్థితులను అతడు ఎలా ఎదుర్కొంటాడనేది కీలకమని వారు చెబుతున్నారు. 2023లో ఇయాన్ నెపోమ్నియాచి (రష్యా)తో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా 32 ఏళ్ల లిరెన్ విశ్వ విజేతగా ఆవిర్భవించాడు. కానీ అప్పటినుంచి చైనా గ్రాండ్‌మాస్టర్ ఎన్నో మానసిక సమస్యలు ఎదుర్కొన్నాడు. గుకేష్‌తో పోలిస్తే గత సంవత్సరం లిరెన్ చాలా తక్కువ పోటీలలో పాల్గొన్నాడు. మరోవైపు విశ్వనాథన్ ఆనంద్ (2012) తర్వాత ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన తొలి భారత ఆటగాడిగా నిలవాలని గుకేష్ పట్టుదలగా ఉన్నాడు. గత డిసెంబరులో క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి క్వాలిఫై కావడం ద్వారా ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌వైపు గుకేష్ అడుగులు పడ్డాయి. హాట్ ఫేవరెట్లు కరువాన, నకమురాలను తలదన్ని క్యాండిడేట్స్ టోర్నమెంట్ టైటిల్ దక్కించుకోవడం ద్వారా గుకేష్ సంచలనం సృష్టించాడు. ఇటీవల బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల జట్టు స్వర్ణం గెలుచుకోవడంలో గుకేష్ కీలక భూమిక పోషించాడు. ఇక..గణాంకాల పరంగా చూసినా లిరెన్‌పై గుకేష్‌దే పైచేయి. గత నవంబరు నుంచి 37 రేటింగ్ పాయింట్లు దక్కించుకోగా, అదే సమయంలో లిరెన్ 52 పాయింట్లు కోల్పోవడం గమనార్హం.

ముఖాముఖి..

గుకేష్-లిరెన్ ఇప్పటివరకు క్లాసికల్ గేమ్‌లలో మూడుసార్లు ముఖాముఖి తలపడ్డారు. ఇందులో లిరెన్ రెండుసార్లు విజయం సాధించగా, ఓ గేమ్ డ్రా అయ్యింది. చివరిసారి..ఈ ఏడాది ఆరంభంలో నెదర్లాండ్స్‌లో జరిగిన టాటా స్టీల్ చెస్ టోర్నీతోపాటు, 2023లో ఇదే టోర్నమెంట్‌లో గుకేష్‌పై నెగ్గాడు. ఇక సింక్వీఫీల్డ్ కప్ టోర్నీ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఇదీ ఫార్మాట్

తొలి 40 ఎత్తులకు 120 నిమిషాలు. తదుపరి 20 ఎత్తులకు 60 నిమిషాల సమయం. తర్వాత మిగిలిన ఆటకు 15 నిమిషాలు. 61వ ఎత్తు నుంచి ప్రతి ఎత్తుకు 30 సెకన్ల అదనపు సమయం ఉంటుంది. 41వ ఎత్తుకు ముందు డ్రాకు అంగీకరించరు.


రిషభ్ పంత్

అనుకున్నదే జరిగింది. విధ్వంసకర బ్యాటర్ రిషభ్ పంత్ ధాటికి ఐపీఎల్ బాక్సులు బద్దలయ్యాయి. ఢిల్లీ క్యాపిటల్స్ మెగా వేలానికి వదిలేసినప్పుడే అతడికి పలికే ధరపై అంతా ఊహించారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా పంత్ రేటు పైపైకి ఎగబాకుతూ ఏకంగా రూ.27 కోట్ల దగ్గర ఆగింది. అంతే.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డుపుటలకెక్కాడు. రైట్ టు మ్యాచ్ ద్వారా అతడిపై డీసీ కన్నేసినా.. లఖ్‌నవూ మాత్రం పట్టు వదల్లేదు. అంతకుముందు పంజాబ్ సైతం దూకుడుగా వెళ్లి శ్రేయాస్‌ను రూ.26.75 కోట్లకు దక్కించుకుంది. అయితే అంచనాలకు భిన్నంగా కేఎల్ రాహుల్ కేవలం రూ.14 కోట్లకే ఢిల్లీ సొంతమవడం గమనార్హం. ఇక వెంకటేశ్ అయ్యర్‌ను అతడి పాత జట్టు కేకేఆర్ రూ.23.75 కోట్ల భారీ మొత్తానికి చేజిక్కించుకోవడం ఆశ్చర్యపరిచింది.

ధర దద్దరిల్లింది

రూ.27 కోట్లతో పంత్ రికార్డు

లీగ్ చరిత్రలోనే అత్యధిక రేటు

ఐపీఎల్ తొలిరోజు వేలం



శ్రేయాస్‌కు రూ.26.75 కోట్లు

వెంకటేశ్‌కు రూ.23.75 కోట్లు

భారత ఆటగాళ్లకే ప్రాధాన్యం

జెద్దా: ఐపీఎల్ వేలం ఎప్పుడు జరిగినా ఆయా ఫ్రాంచైజీలు ఎక్కువగా విదేశీ ఆటగాళ్లపై దృష్టి సారిస్తుంటాయి. కానీ ఈసారి మెగా వేలంలో మాత్రం భారత ఆటగాళ్లపై కనకవర్షం కురిపించాయి. ఆదివారం తొలిరోజు వేలంలో వీరు కనీవినీ ఎరుగని రేటు పలికారు. రిషభ్ పంత్‌ను లఖ్‌నవూ రూ.27 కోట్లతో, శ్రేయాస్ అయ్యర్‌ను ఢిల్లీ రూ.26.75 కోట్లతో కొనుగోలు చేశాయి. ఐపీఎల్ చరిత్రలో ఈ ఇద్దరివే టాప్-2 రికార్డు ధరలు కావడం విశేషం. దీంతో గతేడాది ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ (రూ.24.75 కోట్లు) అత్యధిక ధర బద్దలయ్యింది. ఈసారి స్టార్క్‌ను ఢిల్లీ రూ.11.75 కోట్లకే దక్కించుకోవడం గమనార్హం. తొలిరోజు మొత్తంగా 72 మంది ఆటగాళ్లు అమ్ముడవగా.. వీరికోసం ఫ్రాంచైజీలు రూ. 467.95 కోట్లు వెచ్చించాయి. సోమవారంతో వేలం ముగుస్తుంది.

ప్చ్.. రాహుల్

గత సీజన్‌లో లఖ్‌నవూ కెప్టెన్‌గా ఉన్న కేఎల్ రాహుల్ వేలంలో సులువుగా రూ.20 కోట్ల మార్క్ దాటుతాడని భావించారు. కానీ ఫ్రాంచైజీలు అతడిపై పెద్దగా ఆసక్తి చూపలేదు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఫామ్ కోల్పోడం ప్రభావం చూపిందేమో. ఆర్‌సీబీ, చెన్నై ఆరంభంలో బిడ్ వేసినా రూ.14 కోట్లకే ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుని సంబరపడింది. వచ్చే సీజన్‌లో అతడినే తమ కెప్టెన్‌గా ప్రకటించే అవకాశం ఉంది.


వెంకటేశ్ అయ్యర్

వావ్.. వెంకటేశ్

గత సీజన్‌లో కోల్‌కతాకు ఆడిన ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌కు మాత్రం ఎవరూ ఊహించని ధర పలికింది. అతడిని రిటైన్ చేసుకోకుండా వేలానికి వదిలిన కోల్‌కతానే తిరిగి అతడిని ఎలాగైనా సొంతం చేసుకోవాలనే కసి చూపింది. అందుకే వేలంలో ఆర్‌సీబీతో దూకుడుగా పోటీ పడింది. చూస్తుండగానే రేటు రూ.20 కోట్ల మార్క్‌ను దాటేసింది. చివరకు కేకేఆర్ రూ.23.75 కోట్లతో అతడిపై కనకవర్షమే కురిపించింది.

ఈ ఇద్దరి కోసం హోరాహోరీ

వేలంలో ఐదో ఆటగాడిగా రిషభ్ పంత్ పేరు చెప్పగానే ఆడిటోరియంలోని ప్రేక్షకులు చప్పట్లతో స్వాగతం పలికారు. అటు వేలం కూడా అత్యంత ఆసక్తికరంగా సాగింది. మొదట పంత్ కోసం లఖ్‌నవూతో పోటీపడిన ఆర్‌సీబీ రూ.12 కోట్ల దగ్గర వెనక్కి తగ్గింది. ఈ దశలో సన్‌రైజర్స్ ప్రవేశించి రేటును రూ.20 కోట్లు దాటించింది. చివరకు రూ.20.75 కోట్ల దగ్గర వెనక్కి తగ్గడంతో.. ఢిల్లీ తమ పాత కెప్టెన్ కోసం ఆర్‌టీఎం ఉపయోగించింది. కానీ లఖ్‌నవూ మాత్రం పట్టు వదలకుండా రేటును ఒకేసారి రూ.27 కోట్లకు పెంచడంతో డీసీ షాకయ్యింది. దీంతో ఐపీఎల్ రికార్డు ధరతో పంత్ లఖ్‌నవూ కెప్టెన్‌గా మారబోతున్నాడు. అయితే పంత్ ధర ఊహించిందే అయినా.. శ్రేయాస్ అయ్యర్ మాత్రం జాక్‌పాట్ దక్కించుకున్నట్టే. వేలంలో అతడి పేరు పంత్‌కన్నా ముందే రావడం కూడా కలిసివచ్చింది. ఈ ఇద్దరిలో ఒకరిని దక్కించుకోవాలని పంజాబ్ కింగ్స్ ముందే భావించినట్టుంది. అందుకే శ్రేయాస్ కోసం పట్టుదల చూపింది. మొదట కేకేఆర్ కూడా తమ పాత కెప్టెన్ కోసం ఆసక్తి చూపింది. ఆ తర్వాత డీసీ రేసులోకి రావడంతో తొలిసారి రూ.20 కోట్ల మార్క్‌ను దాటిన భారత ఆటగాడయ్యాడు. ఆ జట్టు కూడా కెప్టెన్ కోసం చూస్తుండడంతో రేటు వేగంగా పెరిగింది. చివరకు రూ.26.75 కోట్లతో పంజాబ్ ఖాతాలో చేరాడు.


అర్ష్‌దీప్


చాహల్

స్వదేశీ ఆటగాళ్లే ముద్దు

తొలిసారిగా ఐపీఎల్ వేలంలో భారత ఆటగాళ్లు మెరిశారు. ముఖ్యంగా పేసర్లపై ఆయా జట్లు ఎక్కువగా దృష్టి సారించాయి. ఈ వేలం మొదట పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌తో ఆరంభం కాగా రూ.2 కోట్ల కనీస ధర ఉన్న అతడిని తీసుకునేందుకు సగంజట్లు పోటీపడ్డాయి. చివర్లో సన్‌రైజర్స్ ఎంట్రీతో రేటు రూ.15.75 దగ్గర ఆగింది. ఈ దశలో పంజాబ్ కింగ్స్ ఆర్‌టీఎం ఉపయోగించగా.. రైజర్స్ ధరను రూ.18 కోట్లకు పెంచింది. దీనికి కూడా పంజాబ్ అంగీకరించడంతో అర్ష్‌దీప్ తన పాత జట్టులోనే చేరాడు. ఇక స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌కు అధిక ధరే పలికింది. గుజరాత్, చెన్నైన, లఖ్‌నవూ, సన్‌రైజర్స్ అతడికోసం ప్రయత్నించాయి. చివరకు రూ.18 కోట్ల దగ్గర రైజర్స్ వైదొలగగా.. పంజాబ్ వశమయ్యాడు. అలాగే బెంగళూరుతో చాలాకాలం కొనసాగిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను గుజరాత్ టైటాన్స్ రూ.12.25 కోట్లకు తీసుకుంది. వెటరన్ పేసర్ మహ్మద్ షమి (రూ.10 కోట్లు), కీపర్ ఇషాన్ కిషన్ (రూ.11.25 కోట్లు) ఈసారి సన్‌రైజర్స్ తరఫున ఆడనున్నారు. బ్యాటర్ జితేశ్ శర్మ (రూ.11 కోట్లు) బెంగళూరు మారాడు. పేసర్లు నటరాజన్ (రూ.10.75 కోట్లు)ను ఢిల్లీ, అవేశ్ (రూ.9.75 కోట్లు)ను లఖ్‌నవూ, ప్రసిద్ధ్ (రూ.9.50 కోట్లు)ను టైటాన్స్ తీసుకోగా, స్పిన్నర్ ఆర్.అశ్విన్ (రూ.9.75 కోట్లు) తొమ్మిదేళ్ల తర్వాత తిరిగి 'సొంత' జట్టు చెన్నైకి ఆడబోతున్నాడు.

వేలంలో టాప్-5 ప్లేయర్లు

రిషభ్ పంత్	లఖ్‌నవూ	రూ.27 కోట్లు
శ్రేయాస్ అయ్యర్	పంజాబ్	రూ.26.75 కోట్లు
వెంకటేశ్ అయ్యర్	కోల్‌కతా	రూ.23.75 కోట్లు
అర్ష్‌దీప్ సింగ్	పంజాబ్	రూ.18 కోట్లు
యుజ్వేంద్ర చాహల్	పంజాబ్	రూ.18 కోట్లు



రసిక్ పంట పండింది

అన్‌క్యాప్‌డ్ క్రికెటర్లలో రసిక్ దార్ సలామ్‌కు అత్యధిక ధర పలికింది. రూ.30 లక్షల కనీస ధర కలిగిన అతడిని బెంగళూరు రూ.6 కోట్లకు తీసుకుంది. అయితే రసిక్‌ను ఆర్‌సీబీ రూ.2 కోట్లకే తీసుకోగా, ఢిల్లీ జట్టు ఆర్‌టీఎంను ఉపయోగించింది. దీంతో ఆర్‌సీబీ ఒక్కసారిగా రేటును రూ.6 కోట్లకు పెంచి సొంతం చేసుకుంది. నమన్ ధిర్‌ను కూడా ముంబై ఇండియన్స్ ఆర్‌టీఎం ద్వారా రూ.5.25 కోట్లకు తీసుకుంది. అబ్దుల్ సమద్ (లఖ్‌నవూ), నేహల్ వదేరా (పంజాబ్) రూ.4.20 కోట్ల చొప్పున, అభినవ్ మనోహర్ (సన్‌రైజర్స్) రూ.3.20 కోట్లు, రఘువంశీ (కోల్‌కతా) రూ.3 కోట్లకు అమ్ముడయ్యారు. గత మినీ వేలంలో రూ.8.40 కోట్ల ధర పలికిన సమీర్ రిజ్వీని ఈసారి రూ.95 లక్షలకే ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుంది.

విదేశీ ఆటగాళ్లలో..

ఈ సారి వేలంలో విదేశీ ఆటగాళ్లపై ఆయా ఫ్రాంచైజీలు జాగరూకతతో వ్యవహరించాయి. గుజరాత్ టైటాన్స్ జోస్ బట్లర్ (రూ.15.75 కోట్లు)పై పెట్టినదే అత్యధిక ధర కావడం గమనార్హం. ఆ తర్వాత పేసర్లు ట్రెంట్ బౌల్ట్ (ముంబై, రూ.12.50 కోట్లు), చివరి నిమిషంలో వేలంలోకి వచ్చిన జోఫ్రా ఆర్చర్ (రాజస్థాన్, రూ.12.50 కోట్లు), హాజెల్‌వుడ్ (ఆర్‌సీబీ, రూ.12.50 కోట్లు) నిలిచారు. ఫిల్ సాల్ట్ (ఆర్‌సీబీ, రూ.11.50 కోట్లు), స్టొయినిస్ (పంజాబ్, రూ.11 కోట్లు), రబాడ (టైటాన్స్, రూ.10.75 కోట్లు), నూర్ అహ్మద్ (సీఎస్‌కే, రూ.10 కోట్లు) మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరారు.

వీరికి నిరాశే..

ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌పై ఎవరూ ఆసక్తి చూపలేదు. రూ.2 కోట్ల కనీసధర కలిగిన దేవ్‌దత్ పడిక్కళ్, బెయిర్‌స్టోకు సైతం నిరాశే ఎదురైంది. అలాగే అన్‌క్యాప్డ్ ప్లేయర్ యష్ ధుల్, అన్‌మోల్‌ప్రీత్, సీనియర్ పీయూష్ చావ్లా కూడా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలారు.

ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత్.. పెర్త్ టెస్ట్‌లో పూర్తిగా పట్టుబిగించింది. కోహ్లి, జైస్వాల్ సెంచరీతో చెలరేగడంతో.. ఆసీస్ ముందు భారత్ 534 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం బుమ్రా బుల్లెట్ బంతులకు ఆసీస్ 12/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. మొత్తంగా విజయానికి 522 రన్స్ దూరంలో ఉన్న ఆస్ట్రేలియా.. పగుళ్లు కనిపిస్తున్న వికెట్‌పై ఏదో అద్భుతం చేస్తే తప్ప ఓటమిని తప్పించుకోలేని పరిస్థితి!

ఇక.. మన చేతుల్లోనే

విజయానికి ఏడు వికెట్ల దూరంలో భారత్

టీమిండియా రెండో ఇన్నింగ్స్ 487/6 డిక్లేర్డ్

- కోహ్లి, జైస్వాల్ శతక మోత
- ఆసీస్ లక్ష్యం 534 ప్రస్తుతం 12/3


జైస్వాల్ (161)


కోహ్లి (100 నాటౌట్)

పెర్త్: బ్యాటర్లు భళా అనిపించగా.. బుమ్రా మరోసారి బంతితో చెలరేగడంతో ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో భారత్ విజయం దిశగా దూసుకెళ్తోంది. సుదీర్ఘ కాలం తర్వాత స్టార్ బ్యాటర్ కోహ్లి (100 నాటౌట్), యువ కెరటం యశస్వి జైస్వాల్ (161) శతకాలతో కదం తొక్కడంతో.. మూడో రోజు ఆటలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా ప్రత్యర్థి ముందు 534 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఓవర్‌నైట్ స్కోరు 172/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 487/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. రాహుల్ (77), నితీశ్ (38 నాటౌట్) విలువైన సహకారం అందించారు. నాథన్ లియోన్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఆసీస్ ఆదివారం ఆట ఆఖరుకు 12/3తో కష్టాల్లో పడింది. ఖవాజా (3 బ్యాటింగ్) క్రీజులో ఉండగా.. చివరి ఓవర్‌లో లబుషేన్ (3)ను కెప్టెన్ బుమ్రా (2/1) ఎల్బీ చేశాడు. మరో రెండు రోజుల ఆట మిగిలున్న నేపథ్యంలో లక్ష్యానికి కంగారూలు ఇంకా 522 పరుగుల దూరంలో ఉండగా.. చేతిలో 7 వికెట్లున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150, ఆసీస్ 104 రన్స్‌కు ఆలౌటయ్యాయి.

ధాటిగా ఆడుతూ..: ముందురోజు సంయమనం పాటించిన ఓవర్‌నైట్ బ్యాటర్లు జైస్వాల్, రాహుల్.. తొలి సెషన్ నుంచే దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్టార్క్ బౌలింగ్‌లో వీరిద్దరూ చెరో బౌండ్రీతో ఉద్దేశాన్ని చాటారు. కాగా, హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో సిక్స్‌తో జైస్వాల్ సెంచరీ సాధించి సంబరాలు చేసుకొన్నాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లో రాహుల్‌ను స్టార్క్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 201 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన దేవ్‌దత్ పడిక్కళ్ (25) కూడా సెటిల్డ్ బ్యాటర్ జైస్వాల్‌కు చక్కని సహకారం అందిస్తూ స్కోరు బోర్డును నడిపించే ప్రయత్నం చేశాడు. దీంతో లంచ్ సమయానికి భారత్ 275/1తో నిలిచింది.

వావ్.. విరాట్..: తిరిగి వచ్చిన తర్వాత రెండో సెషన్ తొలి బంతికే పడిక్కళ్‌ను అవుట్ చేసిన హాజెల్‌వుడ్.. రెండో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కోహ్లి ఆరంభంలో ఆచితూచి ఆడినా ఆ తర్వాత జోరు పెంచాడు. అనూహ్యంగా బౌన్స్ అవుతున్న బంతులను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును దౌడు తీయించాడు. మరోవైపు 150 పరుగులు పూర్తి చేసుకొన్న జైస్వాల్ భారీ షాట్ ఆడే క్రమంలో మార్ష్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (1), ధ్రువ్ జురెల్ (1) వరుస ఓవర్లలో అవుటయ్యారు. అప్పటికే జట్టు పటిష్ఠ స్థితిలో అటాకింగ్ ఆటను ప్రదర్శించిన కోహ్లి.. వాషింగ్టన్ సుందర్ (29)తో కలసి ఆరో వికెట్‌కు 89 రన్స్ జోడించాడు. స్టార్క్ బౌలింగ్‌లో సిక్స్‌తో గేర్ మార్చిన విరాట్.. వీలుచిక్కినప్పడల్లా బౌండ్రీలు బాదడంతో టీ సెషన్‌కు టీమిండియా 359/5 స్కోరు చేసింది. ఇక, ఆఖరి సెషన్‌లో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న కోహ్లి.. వీలైనంత వేగంగా సెంచరీ మార్క్ చేరేందుకు ప్రయత్నించాడు. సుందర్‌ను లియోన్ బౌల్డ్ చేసినా.. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నితీశ్ ఎడాపెడా షాట్లతో కంగారూ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. విరాట్‌తో కలసి ఏడో వికెట్‌కు అజేయంగా 77 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. మార్ష్ బౌలింగ్‌లో సిక్స్‌తోపాటు హ్యాట్రిక్ ఫోర్లతో నితీశ్ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఇక క్రమంగా 90ల్లోకి అడుగుపెట్టిన కోహ్లి.. బౌండ్రీతో శతకం పూర్తి చేయడంతో టీమిండియా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

దెబ్బకొట్టిన బుమ్రా..: కొండంత లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆసీస్ బుమ్రా దెబ్బకు కంగారు పడింది. తొలి ఓవర్‌లోనే మెక్‌స్వీనీ (0)ని డకౌట్ చేసిన బుమ్రా జట్టుకు అద్భుత ఆరంభాన్నిచ్చాడు. నైట్ వాచ్‌మన్ కమిన్స్ (2)ను సిరాజ్ వెనక్కిపంపాడు. ఇక, ఫామ్ కోసం తంటాలు పడుతున్న లబుషేన్‌ను బుమ్రా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. రివ్యూకు వెళ్లినా ఫలితం దక్కలేదు.

1 కంగారూ గడ్డపై తొలి వికెట్‌కు అత్యధికంగా 201 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన భారత జోడీగా జైస్వాల్-రాహుల్. 1986లో సిడ్నీ టెస్ట్‌లో గవాస్కర్-శ్రీకాంత్ (191రన్స్) రికార్డు బద్దలైంది.

3 ఆస్ట్రేలియాలో ఆడిన తొలి టెస్ట్‌లోనే సెంచరీ నమోదు చేసిన మూడో భారత బ్యాటర్‌గా జైస్వాల్. జయసింహ, గవాస్కర్ ఈ ఘనతను అందుకొన్నారు.

4 ఓ క్యాలెండర్ ఇయర్‌లో మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు 150+ స్కోర్లు సాధించిన నాలుగో భారత బ్యాటర్‌గా జైస్వాల్. సచిన్ టెండూల్కర్, సెహ్వాగ్, కోహ్లి గతంలో ఈఫీట్ నమోదు చేశారు.

బ్రాడ్‌మన్‌ను దాటేసిన కోహ్లి

దాదాపు 16 నెలల తర్వాత టెస్టుల్లో శతకం బాదిన విరాట్ కెరీర్‌లో 30వ సెంచరీని నమోదు చేశాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా గ్రేట్ సర్ డాన్ బ్రాడ్‌మన్ 29 శతకాల రికార్డును కోహ్లి అధిగమించాడు. ఓవరాల్‌గా సచిన్ (51) టాప్‌లో ఉండగా.. భారత బ్యాటర్లలో ద్రవిడ్ (36), గవాస్కర్ (34) విరాట్ కంటే ముందున్నారు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 104.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) మార్ష్ 161, రాహుల్ (సి) క్యారీ (బి) స్టార్క్ 77, పడిక్కళ్ (సి) స్మిత్ (బి) హాజెల్‌వుడ్ 25, కోహ్లి (నాటౌట్) 100, పంత్ (స్టంప్) క్యారీ (బి) లియోన్ 1, జురెల్ (ఎల్బీ) కమిన్స్ 1, సుందర్ (బి) లియోన్ 29, నితీశ్ (నాటౌట్) 38; **ఎక్స్‌ట్రాలు: 55; మొత్తం: 134.3 ఓవర్లలో 487/6 డిక్లేర్డ్; వికెట్ల పతనం:** 1-201, 2-275, 3-313, 4-320, 5-321, 6-410; **బౌలింగ్:** స్టార్క్ 26-2-111-1, హాజెల్‌వుడ్ 21-9-28-1, కమిన్స్ 25-5-86-1, మార్ష్ 12-0-65-1, లియోన్ 39-5-96-2, లబుషేన్ 6.3-0-38-0, హెడ్ 5-0-26-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనీ (ఎల్బీ) బుమ్రా 0, ఖవాజా (బ్యాటింగ్) 3, కమిన్స్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 2, లబుషేన్ (ఎల్బీ) బుమ్రా 3; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 4.2 ఓవర్లలో 12/3; వికెట్ల పతనం:** 1-0, 2-9, 3-12; **బౌలింగ్:** బుమ్రా 2.2-1-1-2, సిరాజ్ 2-0-7-1.

పుణెరి గెలుపు బాట

నొయిడా: ప్రొ కబడ్డీ సీజన్ 11లో పుణెరి పల్టన్ జట్టు నాలుగు మ్యాచ్‌ల తర్వాత గెలుపు రుచి చూసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పల్టన్ 51-34తో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 44-42తో పట్నా పైరేట్స్‌పై నెగ్గింది.

పాక్‌కు జింబాబ్వే షాక్

బులవాయో (జింబాబ్వే): సికందర్ రజా (39, 2/7) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. వర్ష ప్రభావిత తొలి వన్డేలో పాకిస్థాన్‌కు జింబాబ్వే షాకిచ్చింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 80 పరుగుల (డ/లూ పద్ధతి) తేడాతో పాక్‌పై గెలిచింది. తొలుత జింబాబ్వే 40.2 ఓవర్లలో 205 పరుగులకు కుప్పకూలింది. అనంతరం పాక్ 21 ఓవర్లలో 60/6తో ఉన్న సమయంలో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగింది. దీంతో డ/లూ పద్ధతి ప్రకారం 21 ఓవర్లకు 141 పరుగులుగా నిర్ణయించగా.. పాక్ వెనుకబడింది. కెప్టెన్ రిజ్వాన్ (19 నాటౌట్) టాప్‌స్కోరర్.

వెర్‌స్టాపెన్ వరుసగా నాలుగోసారి

ఫార్ములావన్ చాంపియన్‌షిప్ కైవసం



లాస్‌వెగాస్: రెడ్‌బుల్ డ్రైవర్ మార్క్ వెర్‌స్టాపెన్ చరిత్ర సృష్టించాడు. వరుసగా నాలుగోసారి ప్రతిష్ఠాత్మక ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్‌షిప్ టైటిల్ దక్కించుకున్నాడు. శనివారం రాత్రి జరిగిన లాస్‌వెగాస్ గ్రాండ్‌ప్రీ రేస్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన 27 ఏళ్ల వెర్‌స్టాపెన్ ఐదో స్థానంలో నిలిచినా..అప్పటికే 393 పాయింట్లతో సమీప ప్రత్యర్థి రస్సెల్ కంటే 62 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచాడు. దాంతో చాంపియన్‌షిప్ అతని సొంతమైంది. కాగా ఈ చాంపియన్‌షిప్‌ను షూమాకర్, హామిల్టన్ 7 సార్లు, మాన్యువల్ 5 సార్లు, ప్రాస్ట్, వెటెల్ నాలుగేసి సార్లు కైవసం చేసుకున్నారు. ఇక లాస్‌వెగాస్‌లో..మెర్సిడెస్ డ్రైవర్లు జార్జ్ రస్సెల్, హామిల్టన్ తొలి రెండు స్థానాల్లో నిలిచారు.



కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ) మండలంలో చలిమంట కాగుతున్న ఆదివాసీలు

సిర్పూర్ @ 9.4 డిగ్రీలు

» చలి పులికి గజగజ వణుకుతున్న ఏజెన్సీ

» రాష్ట్రంలో పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్/ఆసిఫాబాద్/నిజామాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో చలి పులి పంజా విసురుతోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదవుతుండగా.. రానున్న మూడు రోజులు కొన్ని జిల్లాల్లో 10 డిగ్రీల్లోపునకు పడిపోవచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ) మండలంలో ఆదివారం రాష్ట్రంలోనే అత్యల్పంగా 9.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.9 డిగ్రీలు, మిగిలిన జిల్లాల్లో 10 నుంచి 15 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. ముఖ్యంగా మన్యం ప్రాంతం చలి గుప్పిట్లో చిక్కి, గజగజ వణుకుతోంది. ఆసిఫాబాద్ ఏజెన్సీలో ఉదయం పది గంటలైనా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం 12 గంటల వరకు చలిగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూడా మధ్యాహ్నం తర్వాతే వస్తున్నారు. సిర్పూర్(యూ), కెరమెరి, జైనూర్, లింగాపూర్, తిర్యాణి, వాంకిడి, ఆసిఫాబాద్ మండలాల్లో చలి విశ్వరూపం చూపుతోంది. ఆదివాసీలు రోజు వారి పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు నెగళ్లు, చలిమంటలు కాగుతున్నారు. శీతలగాలుల తీవ్రతతో జలుబు, దగ్గు, సీజన్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఇస్నోఫిలియా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నట్లు వైద్యులు గుర్తించారు. ఆదిలాబాద్ జిల్లా బహర్‌హత్నూర్‌లో 10.1 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 11.1, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 11.7, కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో 11.8, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లిలో 11.8, ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో 11.9, నిజామాబాద్ జిల్లా కోటగిరిలో 12, జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కొల్వాయిలో 12.1, మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండలం మౌలాలిలో 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుండడం, గదులు దొరకక ఆరుబయటే ఉండడంతో చలికి ఇబ్బందులు పడుతున్నారు.

చలి తీవ్రతకు గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో చలి తీవ్రతకు ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సుమారు 45 ఏళ్ల వయస్కుడైన ఆ వ్యక్తి శనివారం అర్ధరాత్రి పెద్దకొత్తపల్లి బస్టాప్‌లోని బెంచీపై పడుకున్నాడు. చలి తీవ్రతతో అక్కడే ప్రాణాలు వదిలాడు. స్వెటర్ ధరించి ఉన్నాడు. పక్కన ఒక దుస్తుల సంచి ఉంది. మృతుడు బిహార్ రాష్ట్రానికి చెందినవాడని భావిస్తున్నారు.

వైద్యులకూ సాఫ్ట్‌వేర్ సిండ్రోమ్..!

» 45 ఏళ్లకే బీపీ, షుగర్, గుండె జబ్బుల బారిన

» సుప్రసిద్ధ కార్డియాలజిస్ట్ సోమరాజు ఆందోళన

గుంటూరు మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లంటే.. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చుని పనిచేయాలి.. శారీరక శ్రమ తక్కువ.. మానసిక ఒత్తిడి అధికం. దీంతో 45 ఏళ్ల వయసుకే వారు బీపీ, షుగర్, గుండె జబ్బుల బారిన పడుతుంటారు. దీన్నే వైద్య పరిభాషలో సాఫ్ట్‌వేర్ సిండ్రోమ్ అని పిలుస్తారు. ఇప్పుడు ఈ రోగం.. వైద్యరంగంలోకీ ప్రవేశించింది. 'డాక్టర్లు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల మాదిరిగా శారీరక శ్రమకు దూరమవుతున్నారు. దీంతో వీరిలోనూ బీపీ, షుగర్, స్థూలకాయం, గుండెజబ్బులు పెరుగుతున్నాయి' అని సుప్రసిద్ధ కార్డియాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ బీ సోమరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీని గుంటూరు జింకానా ఆడిటోరియంలో జరుగుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర 66వ వార్షిక సదస్సులో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యుల ఆరోగ్య భద్రతపై ప్రసంగించారు. భారత్‌లో వ్యక్తి సగటు జీవితకాలం 65 ఏళ్లు కాగా.. వైద్యుల విషయంలో ఇది 59 ఏళ్లుగా ఉందని సోమరాజు తెలిపారు. అనేక రకాల ఒత్తిళ్ల మధ్య రోగుల చికిత్సలో తలమునకలై ఉండే వైద్యులు నవ్వడం కూడా మర్చిపోతున్నారని తెలిపారు. చాలా మంది డాక్టర్లు శారీకంగా తగినంత ఫిట్‌గా ఉండడం లేదన్నారు. నెలకోసారైనా తమ బీపీ చెక్ చేసుకోవడం లేదన్నారు. మంచి ఆహారం తీసుకోవడం, మిత్రులతో సమయం సరదగా గడపటం, రోజూ వ్యాయామం చేయడం అలవర్చుకోవాలని సోమరాజు వైద్యులకు సూచించారు. జలుబు, దగ్గు తర్వాత ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే ఆరోగ్య సమస్య నడుంనొప్పి అని మల్లిక స్పైన్ సెంటర్ అధినేత, ప్రముఖ వెన్ను వైద్యనిపుణులు డాక్టర్ జే నరేశ్ బాబు తెలిపారు. 'నడుంనొప్పి-అపోహలు, వాస్తవాలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. నడుం నొప్పిలో నాలుగు రకాలు ఉన్నా.. 90 శాతం మంది రోగులు మెకానికల్ బ్యాక్ పెయిన్‌తో బాధపడుతుంటారని ఆయన వివరించారు. వెన్నునొప్పికి కారణం తెలుసుకొంటే చికిత్స సులువే అన్నారు. స్టాండింగ్ ఎంఆర్‌ఐ స్కాన్ అందుబాట్లోకి వచ్చాక వెన్ను నొప్పి వ్యాధి నిర్ధారణ సులువుగా మారిందన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

» భారతీయ సంస్కృతి ప్రాభవానికిదో నిదర్శనం: మోదీ



న్యూఢిల్లీ, నవంబరు 24: భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత పాత్ర ఎంతో కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువత ఒక్కతాటిపైకి వచ్చి, దేశ భవిష్యత్తు గురించి మేధోమథనం చేస్తే కచ్చితంగా త్వరితగతిన అభివృద్ధి సాధ్యపడుతుందని నొక్కిచెప్పారు. ఆదివారం ప్రసారమైన 'మన్ కీ బాత్' 116వ ఎపిసోడ్‌లో మోదీ ప్రసంగించారు. స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని జనవరి 11, 12 తేదీల్లో ఢిల్లీలోని భారత మండపంలో నిర్వహించనున్న 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమంలో దాదాపు 2వేల మంది యువత పాల్గొంటారని తెలిపారు. లక్ష మంది యువతను రాజకీయాలతో అనుసంధానం చేయడానికి దేశవ్యాప్తంగా అనేక ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం విజయవంతమైందని, దీనికింద కేవలం ఐదు నెలల్లోనే దేశం వంద కోట్ల మొక్కలను నాటిందని అన్నారు. గయానా అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ, ఆయన కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. విదేశాల్లో భారతీయ సంస్కృతిని పరిరక్షించడంలో, ప్రచారం చేయడంలో ఆ దేశంలోని భారత సంతతి పౌరులతో పాటు ఇర్ఫాన్ అలీ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. 'స్లొవేకియాలో కూడా మన సంస్కృతిని పరిరక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్కడ మన ఉపనిషత్తులను తొలిసారిగా స్లొవాక్ భాషలోకి అనువదించారు. ఇవన్నీ ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతి ప్రాభవానికి ప్రతిబింబాలు' అని ప్రధాని పేర్కొన్నారు.

విద్యార్థులకు 'ది ఫుడ్ ఫర్ థాట్' వరం

» హైదరాబాద్ ఫౌండేషన్‌కు ప్రధాని ప్రశంస

హైదరాబాద్‌కు చెందిన 'ది ఫుడ్ ఫర్ థాట్ ఫౌండేషన్' విద్యార్థులకు వరమని మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ ఫౌండేషన్ అనేక లైబ్రరీలను విద్యార్థుల కోసం స్థాపించిందన్నారు. విద్యార్థులు చదువుకునేందుకు లైబ్రరీ కంటే మంచి స్థలం ఉండదంటూ ఆయన ఇలాంటి లైబ్రరీలను స్థాపించి చదువుపై మక్కువ కలిగించే ఐడియా బాగుందని కొనియాడారు. అనేక అంశాలపై విలువైన సమాచారంతో విద్యార్థులు పుస్తకాలు చదివేలా ప్రయత్నాలు చేస్తుండటం అభినందనీయమన్నారు.

పెండింగ్ కేసులు.. సాగదీతే!

» కోర్టుల్లో భూ సమస్యలపై 25 వేలకుపైగా కేసులు

» సివిల్ కోర్టుల్లో 66% భూ వివాదాలే..

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం- ప్రైవేట్ పార్టీలు, రైతులు- రెవెన్యూ శాఖకు మధ్య తలెత్తిన భూ వివాదాలకు సంబంధించిన వేల కేసులు కోర్టుల్లో సంవత్సరాల తరబడి మూలుగుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం వివిధ కోర్టుల్లో 25 వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సివిల్ కోర్టుల్లో ఉన్న వివాదాల్లో 66% కేసులు కేవలం భూ వివాదాలవే. గత 80 ఏళ్లుగా భూ సర్వే చేపట్టకపోవడంతో భూ వివాదాలకు అంతే లేకుండా పోయింది.



దీనికి తోడు తరచూ ఆర్వోఆర్ చట్టాల్లో మార్పులు చేయడం, కొత్త విధానాల వల్ల తలెత్తే వివాదాలు అదనంగా చేరుతున్నాయి. 2020లో ఆర్వోఆర్ అమల్లోకి వచ్చాక రికార్డుల్లో చిన్న పాటి సవరణలకు, తప్పులను సరిదిద్దుకోవాలన్నా సివిల్ కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీని వల్ల చిన్న, సన్నకారు రైతులు, న్యాయ అవగాహన లేని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

గ్రామాల్లో 2% భూమి కోర్టు కేసుల్లోనే

రాష్ట్రంలో 10894 రెవెన్యూ గ్రామాలుండగా, ప్రతి గ్రామంలో దాదాపు 200 భూ సమస్యలున్నాయి. గ్రామాల్లో ప్రస్తుత భూమిలో 2% భూమి కోర్టు కేసుల్లో ఉండగా, 40% భూమి ఇతరత్రా వివాదాలతో ముడిపడి ఉంది. గత ఏడాది కాలంలో భూసమస్యల మీద రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ అధికారులకు వచ్చిన దరఖాస్తులు 12 లక్షలు ఉన్నాయని ధరణి కమిటీ తన నివేదికలో పేర్కొందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 90% మంది రైతులు రక్షణ లేని హక్కులు కలిగి ఉన్నారని, రికార్డుల్లో పేరు ఉంటే చేతిలో భూమి లేని వారు, భూమి అనుభవంలో ఉంటే రికార్డుల్లో పేర్లు లేనివారు, టైటిల్ లేని కుటుంబాలు రాష్ట్రంలో కోకొల్లలుగా ఉన్నాయి. అటవీ హక్కుల చట్టం ప్రకారం భూములు పొందినా సుమారు లక్ష మంది గిరిజనులకు టైటిల్ లేదు. అటవీశాఖ, రెవెన్యూ శాఖల మధ్య సరిహద్దు వివాదంలో సుమారు 4 లక్షల ఎకరాల భూమి ఉండిపోయింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు భూమిలేని నిరుపేదలకు 25 లక్షల ఎకరాలను పంచగా అందులోనూ అనేక వివాదాలు ఉండటంతో ఆ భూములను అనుభవించలేని కుటుంబాలు వేలల్లో ఉన్నాయి. పేదల భూములు అత్యధికంగా వివాదాల్లో ఉన్నాయి. దీని వల్ల ప్రభుత్వం అనుకున్న లక్ష్యం కూడా నెరవేరడం లేదు.

129 కేసులు.. విలువ 2వేల కోట్లకు పైనే

రాష్ట్రంలో భూ ఆక్రమణలకు సంబంధించినవే వివిధ కోర్టుల్లో 129 కేసులున్నాయి. కేసులు నమోదయ్యే నాటికి వీటి విలువ రూ.1319 కోట్లు ఉండగా ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.2 వేల కోట్లకు పైగానే ఉంటుందని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. 2016లో భూ ఆక్రమణల నిరోధక చట్టాన్ని రద్దు చేయడంతో ఆ రోజు వరకు ఈ చట్టం కింద నమోదైన కేసుల వివరాలను ఇటీవల ప్రభుత్వం తెప్పించుకుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోనే సుమారు రూ.1000 కోట్ల విలువైన భూములు భూ ఆక్రమణల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో ఉన్నాయి.

జగన్ ఆ 'మర్మ'మేంటి?

2021 డిసెంబరు 1న 'విద్యుత్' ఒప్పందం.. అంతకుముందే అదానీని ఎందుకు కలిశారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

2021 డిసెంబరు 1వ తేదీన 7000 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం జరిగింది. అంతకుముందు... 2021 ఆగస్టు 7వ తేదీన, 2021 సెప్టెంబరు 12వ తేదీన, 2021 నవంబరు 20వ తేదీన అప్పటి సీఎం జగన్‌తో తాడేపల్లిలో అదానీ ప్రత్యేకంగా మూడుసార్లు భేటీ అయ్యారు. ఈ ఒప్పందంతో అదానీకి సంబంధం లేకుంటే.. మరి ఎందుకు కలిశారు?



సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందంలో అక్రమాలు జరిగాయని ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికా వరకు చెబుతుంటే జగన్ మాత్రం బుకాయిస్తున్నారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)తో ఒప్పందం చేసుకుంటే అదానీకి ఏం సంబంధం అంటూ జగన్, ఆయన పార్టీ నేతలు అడ్డగోలుగా వాదిస్తున్నారు. నిజాలు దాచేందుకు ఎంత ప్రయత్నించినా.. పక్కా ప్లాన్ ప్రకారమే అదానీకి మేలు చేయడానికి 'డీల్' కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో జగన్-అదానీ పాత్రపై ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సెకీతో ఒప్పందానికి ముందు ప్రత్యేక విమానంలో తాడేపల్లికి మూడుసార్లు అదానీ ఎందుకు వచ్చారు? ఈ భేటీల వెనుక మర్మం ఏంటి? అమెరికా దర్యాప్తు సంస్థలు ఈ సందేహాలను పటాపంచలు చేశాయి. స్కాముల కోసం స్కీమ్‌కు స్కెచ్ వేసి రాష్ట్రంపై రూ.లక్షల కోట్ల సోలార్ ఒప్పందం భారాన్ని జగన్ వేశారంటూ న్యూయార్క్ కోర్టులో అభియోగం మోపాయి. జగన్-అదానీ ముడుపుల వ్యవహారం నచ్చక విద్యుత్ సరఫరా ఒప్పందం నుంచి అజూర్ వైదొలగడం గురించి అభియోగపత్రంలో పేర్కొన్నాయి.

ఈఆర్‌సీ ఆదేశాలతో స్పష్టత

2021 డిసెంబరు 1న సెకీ, కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ.. ఏపీ డిస్కమ్‌లు, ఏపీ ఇంధన శాఖ మధ్య జరిగిన ఒప్పందాన్ని యథాతథంగా కొనసాగించలేదు. 7,000మెగావాట్ల సోలార్ విద్యుత్తులో అదానీ 4,667, అజూర్ 2,333 మెగావాట్లు సరఫరా చేసేలా మొదట సెకీతో ఆ సంస్థలు ఒప్పందాన్ని చేసుకున్నాయి. కానీ, రాష్ట్ర ప్రభుత్వంతో సెకీ ఒప్పందం చేసుకున్నాక భాగస్వామ్య సంస్థలు అదానీ, అజూర్ మధ్య అభిప్రాయబేధాలు తలెత్తాయి. సెకీకి 2,333 మెగావాట్లను సరఫరా చేయబోమని ప్రకటించి, ఒప్పందం నుంచి అజూర్ వైదొలిగింది. దీంతో ఏపీతో సెకీ చేసుకున్న ఒప్పందాన్ని కొనసాగించేలా 7,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును తానే సరఫరా చేస్తానంటూ అదానీ ముందుకు వచ్చింది. సెకీ ఈ విషయాన్ని రాష్ట్రానికి తెలియజేసింది. తాడేపల్లి కార్యాలయం ఆదేశాల మేరకు 2024 ఏప్రిల్ 10న సెకీతో ఇంధన శాఖ అనుబంధ ఒప్పందం చేసుకుంది. ఏపీ ఈఆర్‌సీ ఇందుకు అభ్యంతరం చెప్పాలి. కానీ ఈ ఒప్పందాన్ని వెంటనే ఆమోదించింది. అదానీ, అజూర్‌ల మధ్య అవగాహన, ఆ తర్వాత విద్యుత్తు సరఫరా నుంచి అజూర్ వైదొలిగిన విషయాన్ని ఈఆర్‌సీ తన ఆదేశాల్లో పేర్కొంది. దీన్నిబట్టి సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం అదానీదే అని స్పష్టమైంది. జగన్‌కు అదానీ ముడుపులు ఆఫర్ చేయడం నచ్చకే అజూర్ పక్కకు తప్పుకొందని అమెరికా దర్యాప్తు సంస్థలు అభియోగపత్రంలో పేర్కొన్నాయి.

మొత్తం భారం రూ.1,61,920 కోట్లు

సెకీకి చెల్లించే మార్జిన్‌ను కూడా కలుపుకొని సౌర విద్యుత్తు కొనుగోలుకు యూనిట్‌కు రూ.2.49 ధరతో ఏపీ ఒప్పందం చేసుకుంది. రాజస్థాన్‌లో ఉత్పత్తి చేసే సౌర విద్యుత్తును రాష్ట్రానికి సరఫరా చేయడానికి అదనంగా ట్రాన్స్‌మిషన్ చార్జీలు ఉండవని జగన్ పలుమార్లు చెప్పారు. కానీ ఆ తర్వాత యూనిట్‌కు రూ.1.70 దాకా చార్జీలు ఉంటాయంటూ సెకీ స్పష్టం చేసింది. అంటే.. యూనిట్ ధర రూ.4.19 అవుతుంది. ఈ లెక్కన 25 ఏళ్ల కాలానికి 7000 మెగావాట్ల ఒప్పందం విలువ రూ.95,429.25 కోట్లు. దీనికి అదనంగా ట్రాన్స్‌మిషన్ చార్జీలు మరో రూ.66,500 కోట్లు. మొత్తం రూ.1,61,920.25 కోట్లు. ఈ భారమంతా ప్రజలపైనే.

'2900 కోట్ల' షరతు ఎందుకు?

మధ్యలో ఒప్పందం రద్దు చేసుకుంటే అపరాధ రుసుము చెల్లించాలని సహజంగా విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు షరతు విధించవు. తమ వద్ద విద్యుత్తును కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ పెడతాయి. కానీ సెకీతో ఒప్పందం చేసుకున్న సమయంలో.. మధ్యలో దీన్ని రద్దు చేసుకోవాలంటే రూ.2900 కోట్ల రుసుమును రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిందేనని అదానీ షరతు పెట్టింది. అంటే.. సెకీ నుంచి ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలంటే ఇంత మొత్తం చెల్లించాలి. ముడుపుల వ్యవహారంలో అమెరికా దర్యాప్తు సంస్థలు అదానీని దోషిగా నిరూపిస్తే.. దాని ఆధారంగా ఒప్పందం రద్దు చేసుకునే వీలుంటుంది.

తిరుమలలో కల్తీ నెయ్యిపై కదిలిన సిట్

» డీఎస్పీల స్థాయిలో విచారణ ప్రారంభం

» వైష్ణవి, ఏఆర్ డెయిరీ, చెన్నై ల్యాబ్‌కు బృందాలు

తిరుపతి/చెన్నై, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎట్టకేలకు విచారణ మొదలుపెట్టింది. సిట్ కీలక సభ్యులు ఇంకా తిరుపతి చేరుకోనప్పటికీ కింది స్థాయిలో డీఎస్పీల ఆధ్వర్యంలో విచారణ ప్రారంభమైంది. మొత్తం నలుగురు డీఎస్పీలుండగా వారిలో ముగ్గు రి ఆధ్వర్యంలో సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడ్డారు. ఆదివారం ఒక బృందం వైష్ణవి డెయిరీకి, మరో బృందం తమిళనాడులోని దిండుగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీకి, ఇంకోటి చెన్నైలోని ఎస్‌ఎంఎస్ ల్యాబ్‌కు వెళ్లాయి. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఆర్ డెయిరీ తాము పంపిన నెయ్యి నాణ్యమైనదిగా పేర్కొంటూ ఈ ల్యాబ్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను సమర్పించడంతో సిట్ బృందం దానిపై దృష్టి సారించింది. ఏఆర్ డెయిరీ నెయ్యి నాణ్యతపై ఆ ల్యాబ్ ఇచ్చిన సర్టిఫికెట్ నిజ మా? కాదా? దేని ఆధారంగా నెయ్యి నాణ్యతను సర్టిఫై చేశారు? ఎలా పరీక్షించారు? ఏయే పరికరాలు ఉన్నాయి? అవి ఎప్పటివి? వాటి సామర్థ్యం పరీక్షించే వారి ఉన్న అర్హతలు ఏమిటి? వారి అర్హతలు రుజువు చేసే సర్టిఫికెట్లు ఉన్నాయా? ల్యాబ్‌లో ఆహార కల్తీ నిరోధక విభాగానికి సంబంధించి నిపుణులున్నారా? తదితర ప్రశ్నావళిని రూపొందించుకుని వివరాలు సేకరించినట్టు సమాచారం. ఏఆర్ డెయిరీ నెయ్యి నాణ్యతను పరీక్షించి, సర్టిఫికెట్ జారీ చేసిన ల్యాబ్ నిపుణుల వివరాలు, చిరునామాలతో సహా సేకరించినట్టు తెలిసింది. సిట్ కీలక అధికారులు రంగప్రవేశం చేశాక దీనిపై సంబంధిత నిపుణులను లోతుగా ప్రశ్నించే అవకాశం ఉంది. కాగా, టీటీడీకి నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం వైష్ణవి డెయిరీకి లేదని సిట్ బృందం ప్రాథమిక పరిశీలనలో వెల్లడైనట్టు తెలిసింది. రెండు డెయిరీల రికార్డులు పరిశీలించి అవసరమైన పత్రాలను విచారణ నిమిత్తం స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

ఢిల్లీ అల్లర్లలో పోలీసు హత్య..

25మందిపై అభియోగాలు నమోదు చేయాలని కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, నవంబరు 24: ఢిల్లీ అల్లర్ల సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ హత్యకు సంబంధించి 25 మందిపై అభియోగాలు నమోదు చేయాలని అదనపు సెషన్స్ కోర్టు పోలీసులను ఆదేశించింది. హత్య, దోపిడి, హింసాత్మక సంఘటనలకు పాల్పడడం వంటి సెక్షన్లు పెట్టాలని ఆదేశించింది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరి 24న ఢిల్లీలోని చాంద్‌బాగ్‌లో ఆందోళన జరిగింది. ఈ క్రమంలో పోలీసులపై దాడి జరగడంతో రతన్‌లాల్ అనే హెడ్‌కానిస్టేబుల్ మరణించాడు. పోస్టుమార్టం చేయగా ఆయన శరీరంలో తుపాకీ గాయంతో పాటు, 21 ఇతర గాయాలు కనిపించాయి. నిజానికి ఆయన జ్వరంతో బాధపడుతున్నప్పటికీ ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో విధుల్లో పాల్గొన్నాడు. ఆందోళనకారులను శాంతింపజేయడానికి ప్రయత్నిస్తున్న డీసీపీ అమిత్ శర్మ, ఏసీపీ గోకుల్‌పురి అనూజ్‌కుమార్‌లపై దాడి జరగడంతో వారిని రక్షించడానికి హెడ్‌కానిస్టేబుల్ రతన్‌లాల్ వెళ్లాడు. ఆ దాడిలో రతన్‌లాల్ మరణించడంతో పాటు; ఏసీపీ, డీసీపీలు, మరో 50 మంది పోలీసులు గాయపడ్డారు. పోలీసులు 27 మందిపై కేసు నమోదు చేశారు. వివిధ కారణాలతో ఇద్దరి పేర్లు తొలగించిన అదనపు సెషన్స్ జడ్జి పులస్త్య ప్రమచాల 25 మందిపై అభియోగాలు నమోదు చేయాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలో కనిపించాడన్న కారణంతో కేసు పెట్టలేమంటూ ఒకరికి విముక్తి కలిగించారు. పోలీసుల నుంచి దొంగిలించిన తుపాకీ దొరికిందన్న కారణంతో ఆందోళనలో పాల్గొన్నాడని భావించి, ఇంత తీవ్రమైన సెక్షన్లు మోపకూడదంటూ మరొకరిని ఈ కేసు నుంచి తప్పించారు.

రెవెన్యూ దస్త్రాలు శిథిలావస్థలో!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. దీని ప్రకారం, రికార్డుల ఆధునికీకరణకు అయ్యే ఖర్చు అంతా కేంద్రమే భరిస్తుంది. ఇదే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ హయాంలో 'డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్' (డీఐఎల్ఆర్ఎంపీ)గా మార్చారు. ఇది 2016 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ కార్యక్రమాన్ని కేంద్రం 2025-26 వరకు పొడగించింది.

సీఎం ఆఫీసులో మురిగిపోయిన ఫైళ్లు

ఎన్ఎల్ఆర్ఎంపీ కింద 2014లోనే తెలంగాణలో భూముల సమగ్ర సర్వేకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. రూ.250 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసి.. తొలుత రూ.83 కోట్లను విడుదల చేసింది. అయితే, ఆ నిధులతో కంప్యూటర్లు, కార్యాలయ ఫర్నీచర్ వంటి వాటిని కొనుగోలు చేశారు తప్ప అసలు కార్యక్రమాన్ని చేపట్టలేదు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేసిన బీఆర్ మీనా.. భూముల సర్వేకు అనుమతినివ్వాలని సీఎం కార్యాలయానికి ఫైలు పంపించారు. కానీ.. ఆ ఫైలుకు సంబంధించి అడుగులు ముందుకు పడలేదు. మీనా పదవీ విరమణ చేసిన రెండేళ్ల దాకా ఆ ఫైలు జాడ కానరాలేదు. 2016లో ఈ విషయంలో మరోసారి కదలిక వచ్చింది. సర్వేకు అవసరమైన సన్నాహకాలు పూర్తి చేసిన అప్పటి సీసీఎల్ఏ రేమండ్ పీటర్.. అనుమతిస్తే రెండేళ్లలో భూముల సమగ్ర సర్వే పూర్తి చేస్తామని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ ఫైలు కూడా సీఎం కార్యాలయంలోనే మురిగిపోయింది. రేమండ్ పీటర్ కూడా పదవీ విరమణ చేశారు. మరోవైపు, భూముల సర్వే చేయకపోతే తాము ఇచ్చిన నిధులను వెనక్కి పంపించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం తాఖీదులు పంపింది.

వందేళ్ల నాటి కాగితాలు

నిజాం పాలనలో నాటి హైదరాబాద్ రాజ్యంలో వందేళ్ల క్రితం భూ సర్వే ప్రక్రియ ప్రారంభమై కొన్ని ఏళ్లపాటు కొనసాగింది. అయితే, భూ సర్వే జరిపినప్పుడు.. వృథా ఖర్చు ఎందుకనే ఉద్దేశంతో కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూములను సర్వే నుంచి మినహాయించారు. పన్ను చెల్లించే భూముల వరకే సర్వే జరిపారు. గ్రామ స్థాయి నుంచి ఎక్కడైనా భూ వివాదాలు తలెత్తినప్పుడు పాత రికార్డులను తిరగేసి సమస్యకు పరిష్కారం చూపేవారు. ఆ తర్వాత అవే రికార్డులను ఓ గుడ్డలో మూట కట్టి పక్కన పెట్టేవారు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగింది. దాంతో కాగితాలు చిరిగిపోయి శిథిలావస్థకు చేరాయి. వాటిలో ఇప్పుడు అనేక రికార్డులు డిజిటలైజ్ చేయటానికి కూడా అనుకూలంగా లేనంత పాడైపోయాయి.

డీఐఎల్ఆర్ఎంపీ లక్ష్యం ఇదీ!

భూముల రీ సర్వే చేపట్టి భూ దస్త్రాలను డిజిటలైజ్ చేయటం, ఆ వివరాలను కంప్యూటరీకరించటం డీఐఎల్ఆర్ఎంపీ లక్ష్యం. దీంట్లో భాగంగా రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్), కెడెస్ట్రల్ మ్యాప్‌లను డిజిటలైజ్ చేయడం, సమీకృత డేటా సెంటర్లను ఏర్పాటు చేయటం, తహసీల్దార్ కార్యాలయంలో ఉండే రికార్డులతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను అనుసంధానించటం వంటి పనులను చేపట్టాలని కేంద్రం సూచించింది. తహసీల్దారు స్థాయిలో భూ దస్త్రాల నిర్వహణకు ఆధునిక సదుపాయాలతో రికార్డు గదుల ఏర్పాటు, టెక్నాలజీ వినియోగంపై రెవెన్యూ సిబ్బందికి శిక్షణ, భూ దస్త్రాలతో రెవెన్యూ కోర్టుల అనుసంధానం, ఆర్వోఆర్‌తో ఆధార్ అనుసంధానం వంటివి చేపట్టాలని ప్రతిపాదించింది. భూములకు 'యూనిక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబర్ల'ను (యూఎల్‌పీఐఎన్) ఇవ్వాలని పేర్కొంది. తొలిదశలో భాగంగా డీఐఎల్ఆర్ఎంపీని 25 రాష్ట్రాల్లో అమలు చేశారు. తెలంగాణలో మాత్రం అడుగు ముందుకు పడలేదు.
భూముల రీసర్వే చేపడితే ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనన్న భయంతో ప్రభుత్వాలు ఆ పని చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో పాత భూ దస్త్రాలన్నీ శిథిలావస్థకు చేరి భూ సమస్యలను మరింత జటిలంగా మారుస్తున్నాయి.

వణికిస్తున్న వాయు కాలుష్యం!

(మొదటి పేజీ తరువాయి)



కారణంగా భవిష్యత్‌లో ఢిల్లీ తరహా పరిస్థితులు హైదరాబాద్‌లో ఏర్పడే ప్రమాదముంటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 200 దాటితే ఆరోగ్యానికి హాని అని.. వాయు నాణ్యత తగ్గితే చిన్నారులు, వయోవృద్ధులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

50లోపు ఉంటే..

నగరాల్లో వాయు నాణ్యత సూచీ 0-50 మధ్యలో ఉంటే గాలి నాణ్యత బాగున్నట్లని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు నివేదికలు వెల్లడిస్తున్నాయి. కానీ.. గాలిలో వ్యాపించే కొన్ని రకాల వాయువులు, వాహనాల పొగ, ఫ్యాక్టరీల కాలుష్యం, దుమ్ము, ధూళి కారణంగా వాయు నాణ్యత పడిపోతుందని పర్యావరణ శాస్త్ర వేత్తలు చెబుతున్నారు. హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గాలిలో నాణ్యత తగ్గిపోతున్నా.. నివారణకు కాలుష్య నియంత్రణ బోర్డు ఎలాంటి చర్యలూ చేపట్టట్లేదనే విమర్శలున్నాయి. అయితే.. కాలుష్య నియంత్రణ అధికారులు మాత్రం హైదరాబాద్‌లో వాయు కాలుష్యం అంత ప్రమాదకర స్థాయిలో లేదని చెబుతున్నారు. హైదరాబాద్‌లో 14 ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లున్నాయని, గంట గంటకూ వాటి ద్వారా వాయు నాణ్యత వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. 14 కేంద్రాల సమీపంలో ఎక్కడైనా ఎవైనా కాల్చినప్పుడు వచ్చే పొగ వల్ల ఆ సమయంలో మాత్రమే గాలి నాణ్యత తగ్గుతుందని, ఆ తర్వాత పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకుంటాయని వివరించారు. గూగుల్ ప్లే స్టోర్‌లో సమీర్ యాప్‌లో నగరంలోని ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ వివరాలు ప్రతి ఒక్కరు చూసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

ఊపిరితిత్తులపై ప్రభావం

గాలిలో నాణ్యత తగ్గితే ద్విచక్రవాహనాలపై వెళ్లే వారి ఊపిరితిత్తులపై ప్రభావం ఎక్కుగా పడుతుంది. ప్రజలు అనేక రకాల అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉంటుంది. చలికాలంలో పొగమంచు దట్టంగా ఏర్పడి.. భూమికి ఒక కిలోమీటర్ ఎత్తున అది ఆగిపోయి ఒక పొరలా ఏర్పడి కాలుష్యం పెరిగేందుకు కారణంగా నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

- ధర్మరాజు, వాతావరణ శాస్త్రవేత్త

ధూళి లెక్కలు

గాలిలో సూక్ష్మ దుమ్ము, ధూళికణాలు (పర్టిక్యులేట్ మేటర్) పీఎం అంటారు. 2.5 మైక్రో మీటర్ల కన్నా తక్కువగా ఉండే వాటిని పీఎం 2.5గా, 10 మైక్రో మీటర్ల కన్నా తక్కువ పరిమాణంలో ఉండే దూళి కణాలను పీఎం 10గా వ్యవహరిస్తారు. పీఎం 2.5, పీఎం 10 కణాలు గాలిలో ఎక్కువ సేపు ఉంటాయి. గాలి ద్వారా ముక్కులోకి, తర్వాత గొంతు ద్వారా శ్వాసకోశాల్లోకి చేరతాయి. వాటివల్ల శ్వాసకోశ సమస్యలు, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయి. వీటి నుంచి రక్షణ పొందాలంటే తప్పనిసరిగా మాస్కులు ధరించాలి.

వాయు నాణ్యత ఇలా..

రాజధాని నగరంలో ఆదివారం పలు ప్రాంతాల్లో నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (సాయంత్రం 6-7 గంటల సమయంలో)

ప్రాంతం	పీఎం.2.5	పీ.ఎం 10
సనత్‌నగర్	311	-
సోమాజిగూడ	194	105
బొల్లారం	189	153
ఇక్రిశాట్	185	157
హెచ్‌సీయూ	182	149
జూ పార్కు	182	158
పాశమైలారం	185	158

ఈ నెలలో ఎనిమిది సార్లు..

సనత్‌నగర్ ప్రాంతంలో వాయునాణ్యత ఈ నెలలో 8సార్లు ఆందోళనకరస్థాయుకు చేరింది. ఎప్పుడెప్పుడంటే..

తేదీ-నెల	పీ.ఎం.2.5 స్థాయులు
నవంబరు 18	242
నవంబరు 19	311
నవంబరు 20	307
నవంబరు 21	283
నవంబరు 22	316
నవంబరు 23	320
నవంబరు 24	311

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

» మంత్రివర్గ విస్తరణ, విజయోత్సవాలపై అధిష్ఠానంతో చర్చ

» తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు అగ్రనేతలకు ఆహ్వానం..



హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టి డిసెంబరు 7 నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఏఐసీసీ పెద్దలను ఆయన కలవనున్నారు. ప్రజాపాలన విజయోత్సవాల గురించి తెలపడంతోపాటు ఢిల్లీ పెద్దలను ఈ ఉత్సవాలకు ఆహ్వానించనున్నట్టు తెలిసింది. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతోనూ రేవంత్ భేటీ కానున్నారు. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా.. మంత్రివర్గంలో ఇంకా 6 స్థానాలు ఖాళీగానే ఉన్న నేపథ్యంలో క్యాబినెట్ విస్తరణపై రాహుల్‌తో చర్చించనున్నట్టు సమాచారం. ఇక సచివాలయంలో ఏర్పాటు చేయబోయే తెలంగాణ తల్లి విగ్రహాన్ని.. డిసెంబర్ 9న ఆవిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి సోనియా, రాహుల్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్టు సమాచారం. ఇటు ఖాళీగా ఉన్న కొన్ని కార్పొరేషన్ పదవుల భర్తీతోపాటు 'కులగణన' పైనా అధిష్ఠానంతో చర్చించనున్నారు. ఇదిలాఉండగా.. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కుటుంబ ఫంక్షన్‌లో సీఎం పాల్గొనున్నట్టు తెలిసింది.

ఆన్‌లైన్ నమోదే కీలకం.. పొరపాట్లు జరగొద్దు

» వలస వెళ్లిన వారి వివరాలూ సేకరించాల్సిందే..

» 'సమగ్ర సర్వే'పై అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు



హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు చాలా ముఖ్యమైందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఏ పొరపాట్లకు అవకాశం లేకుండా వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన ఝార్ఖండ్ రాజధాని రాంచీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఎవరైనా ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలొస్తే, వారికి ఫోన్ చేసి సర్వే గురించి వివరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలస వెళ్లిన వివరాలను జాగ్రత్తగా సేకరించాలన్నారు. ఇక ఇటీవల వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కలుషితాహారం వల్ల విద్యార్థులు ఆస్పత్రి పాలైన ఘటనలపై భట్టి ఆరా తీశారు. పాఠశాలల్లో ఆహారం మరియు పరిశుభ్రతపైనే సీఎం రేవంత్, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దేశాన్ని వికృత పార్టీ పాలిస్తోంది..

ఈ దేశాన్ని ఒక వికృత పార్టీ పరిపాలిస్తోందని, ఆ పార్టీని కాదని విమ్మల్ని ఎన్నుకున్న ప్రజల కోసం కష్టపడి పనిచేయాలని ఝార్ఖండ్‌లో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు భట్టి సూచించారు. ఏఐసీసీ పరిశీలకుడిగా ఉన్న ఆయన.. సీఎం హేమంత్ సోరెన్, కాంగ్రెస్ కీలక నేతలతో కలిసి చర్చలు జరిపారు. సాయంత్రం రాంచీలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను భట్టి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న పార్టీని కాదని.. మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. వలసపాలన నుంచి దేశానికి కాంగ్రెస్ విముక్తి కల్పించిందని.. ఈ పార్టీలో పనిచేయడం ఓ అదృష్టమని చెప్పారు.

ఏడాదిలోనే అన్నీ అవుతాయా?

» హామీలను దశల వారీగా నెరవేరుస్తాం: శ్రీధర్‌బాబు



పెద్దపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే అల్లావుద్దీన్ అద్భుత దీపంలా రాష్ట్రం మారాలని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. అధికారం కోల్పోయిన బాధలో వారు మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదన్నారు. ఎన్నికల హామీలను దశల వారీగా నెరవేరుస్తామని తెలిపారు. ఆదివారం ఆయన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక శివారులో పత్తిపాక రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి ప్రాజెక్టులను రీ డిజైన్ చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. రైతులకు సాగునీటిని అందిస్తున్న ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్సేనని చెప్పారు. పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, చొప్పదండి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 2.20 లక్షల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు భూములను స్థిరీకరించడంతో పాటు మరో 20 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరందించడానికి పత్తిపాక రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణానికి పత్తిపాక రైతుల అభిప్రాయాలను తీసుకుని ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు.


ఎన్టీఆర్‌తోనే తెలుగుజాతికి గుర్తింపు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు కృషి: తుమ్మల



ఖమ్మం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రపంచానికి తెలుగుజాతి కీర్తిని చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని, ఆయన ద్వారానే తెలుగుజాతికి గుర్తింపు వచ్చిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో వెలుగుమట్ల అర్బన్ పార్కుకు రూ.2 కోట్లతో చేపట్టిన రహదారికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కమ్మ మహాజన సంఘం వనసమారాధనలో పాల్గొని మాట్లాడారు. కమ్మకులస్తులది స్వతహాగా వ్యవసాయం వృత్తి అయినా ప్రపంచీకరణ నేపథ్యంలో అన్నివృత్తుల్లో రాణించి ప్రతిభావంతులుగా నిలుస్తున్నారన్నారు. దేశ, విదేశాల్లో డాక్టర్లు, ఇంజనీర్లుగానే కాకుండా ఐటీ సంస్థలకు సీఈవోలుగా రాణిస్తుండడం తెలుగుజాతి అదృష్టమన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటే తన లక్ష్యమని, ఇందుకోసం తనవంతు కృషిచేస్తానని తుమ్మల తెలిపారు.

30న పాలమూరులో సీఎం సభ: జూపల్లి



మహబూబ్‌నగర్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఈనెల 28 నుంచి మహబూబ్‌నగర్ పట్టణంలో మూడ్రోజుల పాటు రైతు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 30వ తేదీన లక్షలాది మంది రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి సభ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమం నిర్వహణ, ఏర్పాట్లపై మహబూబ్‌నగర్ కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి పాలమూరుకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో జూపల్లి సమీక్ష నిర్వహించారు. అనంతరం దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్ మండల పరిధిలో రైతు సదస్సు నిర్వహించనున్న సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. సదస్సులో వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి 150 స్టాళ్లతో ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. రైతు సంబురాలను రాష్ట్రంలోని 600 రైతు వేదికల ద్వారా రైతులు వీక్షించేలా ప్రత్యక్షప్రసారం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు.

అదానీ అరెస్టుతో ఎన్డీయే పతనమే: జీవన్‌రెడ్డి

జగిత్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అదానీ అరెస్టు తర్వాత దేశంలో ఎన్డీయే పాలన ముగియబోతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్థిక నేరస్థుడైన అదానీకి అమెరికా సెర్చ్ వారెంటు జారీ చేసి, దోషిగా నిలబెట్టే ప్రయత్నం జరుగుతున్న తరుణంలో మోదీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ కూటమి గెలిచిన నేపథ్యంలో ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు.. ప్రియాంకా గాంధీ గెలుపుతో దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మహారాష్ట్ర ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని.. అదానీ పెట్టుబడులతో మోదీ ఓటర్లను ప్రలోభపెట్టి గెలిచారని ఆరోపించారు.

మా ఇల్లు బఫర్ జోన్‌లో లేదు

» హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి



హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ సమీపంలోని మధురానగర్‌లో తాను నివసిస్తున్న ఇల్లు బఫర్‌జోన్ పరిధిలో లేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టంచేశారు. 1980లో తన తండ్రి సుబ్బయ్య ఆ ఇంటిని నిర్మించారని.. అప్పటి నుంచి అదే ఇంట్లో ఉంటున్నామని ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణకాంత్ పార్కు దిగువన వేల ఇళ్ల తర్వాత తమ ఇల్లు ఉందన్నారు. 'మా ఇల్లు బఫర్‌జోన్‌లో ఉందని కొన్ని సామాజిక మాధ్యమాలతోపాటు పలు పేపర్లలో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదు. ఒకప్పటి పెద్ద చెరువును రెండున్నర దశాబ్దాల క్రితం కృష్ణకాంత్ పార్కుగా అభివృద్ధి చేశారు. అయితే.. చెరువు కట్టకు దిగువన 10 మీటర్ల వరకే బఫర్ జోన్ ఉంది. 10 మీటర్లు దాటితే ఆ ప్రాంతం బఫర్‌జోన్ పరిధిలోకి రాదు. చెరువు కట్టకు దాదాపు కిలోమీటరు దూరంలో మా ఇల్లు ఉంది' అని వివరించారు. కొందరు వ్యక్తులు తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తుండడాన్ని ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు.

39 డ్రగ్స్ కేసుల్లో 82 మందికి జైలు శిక్ష

» 17 మందికి.. గరిష్ఠంగా 20 ఏళ్ల ఖైదు

» కనిష్ఠంగా ఆర్నెల్లలోపు..

» పక్కాగా చార్జిషీట్లు.. ప్రాసిక్యూషన్



హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కేసులకు సంబంధించి ఈ ఏడాది 82 మందికి జైలు శిక్షలు ఖరారయ్యాయి. వీరంతా ఈ ఏడాది జనవరి నుంచి నమోదైన 39 కేసుల్లో నిందితులు. నిందితులకు గరిష్ఠంగా 20 ఏళ్లు, కనిష్ఠంగా ఆర్నెల్ల చొప్పున జైలు శిక్షలు పడ్డట్లు డీజీపీ కార్యాలయం తెలిపింది. పక్కాగా రిమాండ్ డైరీ, న్యాయనిపుణుల సలహాలతో చార్జ్‌షీట్ దాఖలు, ప్రాసిక్యూషన్ ప్రక్రియలో పకడ్బందీగా వ్యవహరించడంతో.. నిందితులకు శిక్షలు ఖరారైనట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్‌తో పట్టుబడితే శిక్షలు తప్పవనే భయం పెడ్లర్లలో పెరిగితే.. ఈ దందాను పూర్తిగా అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు. డ్రగ్స్ వినియోగదారులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తూ.. వారు మరోమారు మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా నిఘా పెడుతున్నామన్నారు. కాగా.. ఈ ఏడాది మొత్తం కేసుల్లో.. నాలుగింటిలో 17 మందికి 20 ఏళ్ల చొప్పున జైలు శిక్షలు పడ్డాయి. మరో కేసులో ఇద్దరికి 12 ఏళ్ల చొప్పున, 11 కేసుల్లో 19 మందికి పదేళ్ల చొప్పున శిక్షలు ఖరారయ్యాయి. ఇంకొన్ని కేసుల్లో.. ఒకరికి ఐదేళ్లు, ముగ్గురికి ఏడాది, ఎనిమిది మందికి ఆర్నెల్లు, 32 మందికి ఆర్నెల్ల లోపు జైలు శిక్షలు పడ్డాయి. ఈ శిక్షలు ఖరారవ్వడంలో మహబూబాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం, వరంగల్, ఖమ్మం, కుమ్రంభీమ్-ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల పోలీసులు, సైబరాబాద్ సిబ్బంది ప్రతిభ కనబరిచారని డీజీపీ కార్యాలయవర్గాలు తెలిపాయి.

వైద్యం లేదు.. రోగి లేడు

సీఎంఆర్ఎఫ్ కోసం బిల్లులు ప్రత్యక్షం.. ఒకే ఆస్పత్రి నుంచి 23 దరఖాస్తులు

» 'ఆన్‌లైన్'తో బయటపడిన అక్రమం

» అక్రమాలు, అవినీతికి చరమ గీతం

» నెరవేరుతున్న సీఎం రేవంత్ లక్ష్యం

» గతంలోని అవకతవకలపై కొనసాగుతున్న విచారణ



హైదరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వైద్యుడు చికిత్స చేయలేదు. అసలు పేషంటే లేడు. కానీ.. తమకు ఆర్థిక సాయం చేయమంటూ ముఖ్యమంత్రి సహాయ నిధికి పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. పైగా ఇవన్నీ వివిధ ఆస్పత్రుల నుంచి కాదు.. ఒకేదగ్గరి నుంచి అందినవి. పేదలు, అర్హులకు సాయం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)లో అక్రమాలు, అవినీతికి తావు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చిన ఆన్‌లైన్ విధానంతో ఈ తతంగం బయటపడింది. పొందిన చికిత్స వివరాలను తెలుపుతూ పెట్టుకున్న అర్జీలను ఇటు సీఎంఆర్ఎఫ్ సిబ్బంది, అటు ఆస్పత్రి యాజమాన్యం ధ్రువీకరించే క్రమంలో అక్రమం వెలుగులోకి వచ్చింది. ఒకే దవాఖానా నుంచి వచ్చిన 23 దరఖాస్తుల్లో కొన్నింటికి చెక్కులు సిద్ధం కాగా.. మిగిలినవాటి విచారణలో అవి నకిలీవని తేలింది. అప్రమత్తమైన ఆస్పత్రి యాజమాన్యం తమ వద్ద నుంచి సీఎంఆర్ఎఫ్ పోర్టల్‌లో ఎవరో నకిలీ బిల్లులను అప్‌లోడ్ చేశారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మంజూరైన చెక్కులను అధికారులు నిలిపివేశారు. కాగా, సీఎంఆర్ఎఫ్‌లో అప్‌లోడ్ చేసిన నకిలీ బిల్లుల అంశం, వాటిని గుర్తించిన వివరాలన్నీ 'ఆంధ్రజ్యోతి'కి అందాయి.

ఇదీ విషయం..

ముఖ్యమంత్రి సహాయ నిధి అమలుకు గతంలో ఆన్‌లైన్ విధానం అందుబాటులో లేదు. ఏదైనా ఆస్పత్రి నుంచి చికిత్స పొందినట్లు బిల్లులతో అర్జీలు వస్తే.. నామమాత్ర పరిశీలనతో ప్రభుత్వం ఎంతో కొంత సాయం అందించేది. అయితే, ఇందులో అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సీఎం రేవంత్ ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ఈ మేరకు దరఖాస్తు నుంచి చెక్కు జారీ వరకు పారదర్శకత పాటిస్తున్నారు. ఆస్పత్రి, అక్కడ తీసుకున్న చికిత్స నిజమా? కాదా? అని లోతైన విచారణ జరిపిన తరువాతే సాయం అందిస్తున్నారు. కాగా, వరంగల్ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి దశల వారీగా వచ్చిన 23 దరఖాస్తులపై సీఎంఆర్ఎఫ్ విభాగం విచారణ జరిపే క్రమంలో.. వాటిల్లో పేర్కొన్నవారి పేర్లు, తీసుకున్న చికిత్స నిజమేనా అని యాజమాన్యాన్ని అడిగింది. వారు పరిశీలించగా అవి నకిలీ బిల్లులనీ, అసలు ఆ పేరున్న రోగులకు తాము చికిత్స చేయలేదని గుర్తించారు. 'మా వద్ద చికిత్స తీసుకున్నవారు సీఎంఆర్ఎఫ్ కోసం బిల్లులు కోరితే సిద్ధం చేసిస్తాం. ఇలా 23 బిల్లులు విచారణకు రాగా 9 దరఖాస్తులకు అనుమతి లభించింది. 14 పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, వీరంతా మా ఆస్పత్రిలో అసలు చేరలేదని గుర్తించాం. ఆస్పత్రి రిసెప్షనిస్ట్ నకిలీ బిల్లులు, ల్యాబ్ రిపోర్టులను తయారుచేసినట్టు గుర్తించాం. అతడిపై చర్యలు తీసుకోండి" అంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నెరవేరుతున్న సీఎం ఉద్దేశం

బీఆర్ఎస్ సర్కారు హయాంలో సీఎంఆర్ఎఫ్‌లో అక్రమాలు జరిగాయంటూ ప్రస్తుత ప్రభుత్వానికి ఫిర్యాదులు రావడంతో విచారణకు ఆదేశించింది. సంబంధిత శాఖలు జిల్లాల్లోని ఆస్పత్రులకు వెళ్లి విచారణ జరుపుతున్నాయి. కొన్నిచోట్ల నకిలీ బిల్లులతో దరఖాస్తు చేసినట్లు తేలింది. ఇలాంటి ఆస్పత్రులకు బిల్లులు ఇచ్చే అవకాశం లేకుండా నిషేధిత జాబితాలో పెట్టారు. ఒకవేళ బిల్లులు వచ్చినా.. ఆన్‌లైన్ కారణంగా.. నిషేధిత జాబితాలో ఉన్నాయంటూ సీఎంఆర్ఎఫ్ వెబ్‌సైట్ చూపుతోంది. 'ఆన్‌లైన్' ద్వారానే తాజా అక్రమం వెలుగులోకి రావడంతో.. అర్హులకే సాయం అందాలన్న సీఎం రేవంత్ ఉద్దేశం నెరవేరుతోందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, రేవంత్ సర్కారు సీఎంఆర్ఎఫ్ ఆన్‌లైన్‌ను జూన్ 15 నుంచి అమల్లోకి తెచ్చింది. దీనిపై 'సీఎంఆర్ఎఫ్ ప్రక్షాళన' శీర్షికన జూన్ 8న 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ఇక అప్పటి నుంచి 70,710 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 13 వేల అర్జీలకు చెక్కులను పంపిణీ చేశారు. 16 వేల చెక్కులు సిద్ధంగా ఉన్నాయి. విచారణ నిమిత్తం ఆస్పత్రుల పరిశీలనలో 13 వేల దరఖాస్తులుండగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.



పదోన్నతుల కోసం

పడిగాపులు

» హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్లు

» జిల్లాల నుంచి వచ్చిన జూనియర్లకు సెల్యూట్ చేయాల్సిన దుస్థితి

హైదరాబాద్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో చేరి ఏళ్లు గడుస్తున్నా పదోన్నతుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. వీరితో పాటు ఎంపికై వివిధ జిల్లాలు, ఇతర కమిషనరేట్లలో పనిచేస్తున్న సహచరులు పదోన్నతులు పొంది పైస్థాయికి వెళ్లినప్పటికీ... వీళ్లకు మాత్రం నిరీక్షణ తప్పడం లేదు. సాధారణంగా ఓ కానిస్టేబుల్ తన సర్వీసులో హెడ్ కానిస్టేబుల్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏఎస్సై), సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్సై) స్థాయికి చేరుకోగలడు. ఇంకా సర్వీసు ఉంటే ఇన్‌స్పెక్టర్ హోదాలో రిటైరయ్యే అవకాశం ఉంటుంది. అయితే పదోన్నతుల్లో ఇక్కడ చాలా ఆలస్యం జరుగుతుండటం వల్ల తాము ఆ అవకాశాన్ని కోల్పోతున్నామని పలువురు ఆవేదన చెందుతున్నారు. కొన్నిసార్లు కానిస్టేబుల్‌గా ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారు పదోన్నతులు పొంది హైదరాబాద్‌లో పోస్టింగ్‌కు వస్తే... తమ కంటే జూనియర్లు అయిన వారికి సెల్యూట్ చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 1984, 1985, 1987 బ్యాచ్‌లకు చెందిన కానిస్టేబుళ్లలో చాలామంది ఇంకా ఏఎస్సైలుగానే కొనసాగుతున్నారు. అదే జిల్లాల్లో అయితే 1990 బ్యాచ్ వాళ్లు ఎస్సై కాగలిగారు. వాస్తవానికి అందరు కానిస్టేబుళ్లు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రిటైర్ అవ్వాలనే కోరుకుంటారు. కానీ పదోన్నతుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటం వల్ల వారి ఆశలు అడియాసలవుతున్నాయి.

9 రోజుల వేడుక

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో 16 కొత్త నర్సింగ్ కాలేజీలతో పాటు, 28 పారా మెడికల్ కాలేజీలను నెలకొల్పనున్నారు. వీటితో పాటు కొత్తగా 213 అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువస్తారు. ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాకో ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వీరిని వాలంటీర్లుగా నియమిస్తారు. అలాగే గోషామహల్‌లో నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనానికి భూమి పూజ చేస్తారు. ఆరంఘర్-జూపార్క్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన ఆరు మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ప్రారంభిస్తారు. కేబీఆర్ పార్కు సమీపంలో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు రూ.826 కోట్ల భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక సమీపంలో దాదాపు 106 స్టాళ్లతో ఇందిరా శక్తి మహిళా బజార్లను ప్రారంభిస్తారు. తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపనతో పాటు అటవీ పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సఫారీ థీమ్ పార్క్, బొటానికల్ గార్డెన్లను ప్రారంభిస్తారు. ఘట్‌కేసర్‌లో బాలికలకు ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే పనులు జరుగుతున్న మల్లేపల్లి, మేడ్చల్, నల్లగొండ ఏటీసీలను ప్రారంభిస్తారు. దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను జాతికి అంకితం చేస్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 237 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో తరగతులను ప్రారంభిస్తారు. కొత్తగా తలపెట్టిన స్పోర్ట్స్ యూనివర్సిటీకి భూమి పూజ చేస్తారు. ఐటీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏఐ సిటీ ఏర్పాట్లతో పాటు పలు ఒప్పందాలు చేసుకోనున్నారు. విజయోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. అన్ని స్థాయిల్లోని విద్యార్థులను ఈ వేడుకల్లో భాగస్వామ్యం చేసేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. శాఖల వారీగా నిర్ధేత ప్రణాళిక ప్రకారం సంబంధిత మంత్రుల సారథ్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు.. మంత్రులతో పాటు ఈ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని అధికారులకు సీఎం పిలుపునిచ్చారు.

రైలు పట్టాలపై 25 అడుగుల ఇనుప స్తంభం

పీలీభీత్(ఉత్తరప్రదేశ్), నవంబరు 24: ఉత్తరప్రదేశ్‌లోని పీలీభీత్‌లో పెను ప్రమాదం తప్పింది. పీలీభీత్, బరేలీ మధ్య గల రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని దుండగులు 25 అడుగుల ఇనుప స్తంభాన్ని పెట్టారు. ఇనుప రాడ్‌ను గుర్తించిన రైల్వే సిబ్బంది దాన్ని తొలగించడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన లలోరీ ఖేడా రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన దుండగుల ఆచూకీ కోసం సీసీటీవీని పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

చిత్రకొండలో సాగు..

లంబసింగి నుంచి సరఫరా

» అనకాపల్లి గంజాయి స్మగ్లర్ల ముఠా...

» విచారణలో విస్తుపోయే అంశాలు

» అడవిలో 20 కిలోమీటర్లు కాలినడకన రహస్య మార్గాల ద్వారా తరలింపు

» ఆపై వాహనాల్లో లంబసింగికి

» గంజాయి రైతులకు పెట్టుబడి సాయం చేసి కిలో 1500కు కొనుగోలు

» నగరంలో కిలో రూ.25 వేలకు అమ్మకం



గంజాయి స్మగ్లింగ్ వివరాలు వెల్లడిస్తున్న హెచ్ న్యూ విభాగం డీసీపీ సుదీంద్ర. చిత్రంలో పట్టుబడ్డ గంజాయి.

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ మార్గంలో డబ్బు సంపాదన కోసం యువతను గంజాయి మత్తులో దించి సొమ్ము చేసుకుంటున్న స్మగ్లర్లు.. పక్కా ప్రణాళికతో దానిని నగరాలకు సరఫరా చేరుస్తున్నారు. అయితే గంజాయి సాగు చేయడం దగ్గర్నుంచే వీరి ప్రమేయం ఉంటోందని పోలీసుల విచారణలో తేలింది. లంబసింగి నుంచి హైదరాబాద్‌కు రహస్యంగా గంజాయి సరఫరా చేస్తున్న అనకాపల్లికి చెందిన ఘరానా స్మగ్లర్ల ముఠాను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) పోలీసులు శనివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ ముఠాను పోలీసులు విచారించిన క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్మగ్లింగ్ ముఠా నాయకుడు బాలాజీ గోవింద్ ఇంటర్‌లోనే చదువు మానేసి హైదరాబాద్ సహా.. ఏపీలో పలు రకాల పనులు చేశాడు. ఆ తరువాత కిరాణా దుకాణం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో అతనికి ఆంధ్రా-ఒడిసా బోర్డర్‌లోని చిత్రకొండ అటవీ ప్రాంతానికి చెందిన గంజాయి సాగు చేసే రైతులు పరిచయమయ్యారు. దీంతో గంజాయి సాగుకు పెట్టుబడి సాయం తాను చేస్తానని, పండించిన గంజాయిని తనకు రూ.1500కే కేజీ విక్రయించాలని రైతులను కోరాడు. వారికి అవసరమైన డబ్బు సాయం చేసి, తక్కువ ధరకు గంజాయి కొనేవాడు. దానిని ఇతర వ్యక్తులకు రూ.5 వేలకు కేజీ చొప్పున విక్రయించేవాడు. ఇలా కిలోల కొద్దీ గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి విక్రయించడంతో.. గోవింద్ సంపాదన పెరిగిపోయింది. దీనిని గమనించిన అతని స్నేహితులు అదిగల్లి ప్రకాశ్‌కుమార్, మసాలాల మోహన్‌రావు, దుర్గాహరిప్రసాద్, రమణ, మరో ఇద్దరు.. గోవింద్‌తో జత కలిసి ముఠాగా ఏర్పడ్డారు.

అడవిలో 20 కి.మీ. కాలినడకన..

చిత్రకొండ అటవీ ప్రాంతంలో గంజాయి సాగు చేస్తున్న రైతుల నుంచి కొనుగోలు చేసే గోవింద్ ముఠా.. దానిని అక్కడి నుంచి తరలించేందుకు కూలీలను ఆశ్రయిస్తున్నారు. రహస్య మార్గాల ద్వారా కూలీలు 20 కి.మీ. మేర కాలినడకన గంజాయి మూటలను ఎత్తుకొని, రవాణా మార్గం ఉన్న ప్రాంతానికి తరలించి గోవింద్‌కు అప్పగిస్తుంటారు. అనంతరం గోవింద్ ముఠా అక్కడి నుంచి గుట్టుగా లంబసింగికి తరలిస్తుంటారు. ఇలా.. చిత్రకొండ నుంచి లంబసింగికి తరలించాక గోవింద్ ముఠా సభ్యులు ఎవరి గంజాయిని వారు భద్రపరచుకుంటారు. వ్యాపారుల ఆర్డర్‌ను బట్టి ఎవరి వ్యాపారం వారు చేస్తుంటారు. అయితే హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక, తదితర ప్రాంతాల్లో గంజాయికి ఉన్న డిమాండ్‌ను బట్టి గోవింద్ ముఠా నేరుగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా లగేజీ బ్యాగుల్లో సర్దుకొని.. వలస కూలీల్లా ఏదో ఓ వాహనంలో ఎక్కి, ఒక్కో స్మగ్లర్ 20-25 కేజీల గంజాయిని సరఫరా చేస్తున్నారు. హైదరాబాద్‌లో కేజీ గంజాయిని రూ.25 వేలకు విక్రయిస్తున్నారు. ఇలా 2020 సంవత్సరం నుంచి క్వింటాళ్ల కొద్దీ గంజాయిని విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

జనవరి 10 వరకు ధాన్యం కొనుగోళ్లు

» 21.73 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ.. 2,760 కోట్ల చెల్లింపులు: ఉత్తమ్

» సూర్యాపేట జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, హుజూర్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ వరకు రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. కాళేశ్వరం పథకం నుంచి చుక్క నీరు రాకపోయినా.. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని తెలిపారు. 66 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందన్నారు. దేశంలోనే ఇది అరుదైన రికార్డని చెప్పారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం పలు జిల్లాల అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ధాన్యం తూకం వేసిన మూడ్రోజుల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 3.50 లక్షల మంది రైతుల నుంచి రూ.5,040 కోట్ల విలువైన 21.73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇందులో 16.06 లక్షల టన్నులు దొడ్డు ధాన్యమని, 5.67 లక్షల టన్నులు సన్న ధాన్యమని వెల్లడించారు. సన్నాల రైతులకు క్వింటాలుకు రూ.500 ప్రోత్సాహం కింద రూ.283.25 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో మొత్తం 7,990 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. నిరుడు ఈ సమయానికి రైతులకు రూ.2,414 కోట్లు చెల్లిస్తే.. ఈసారి రూ.2,760 కోట్లు చెల్లించామన్నారు.

ఇబ్బంది పెడితే సహించం!

హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉత్తమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు తమ సమస్యలను మంత్రికి వివరించారు. దీంతో మంత్రి.. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో ఫోన్‌లో మాట్లాడి పలు ఆదేశాలు జారీ చేశారు. రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టవద్దని, ఎన్ని టోకెన్లు కావాలన్నా వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కొన్న ధాన్యాన్ని తక్షణం లారీలు, ట్రాక్టర్లలో మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోళ్లలో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు ఎలా పండాయని మంత్రి ఆరా తీయగా.. పంట దిగుబడులు అధికంగా వచ్చాయని రైతులు తెలిపారు.

'జనరల్ స్టడీస్ ఫర్ ఆల్'

» 5 నెలల పాటు 600 ఎపిసోడ్స్

» ప్రసారం చేయనున్న టీ-సాట్

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోటీ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం "జనరల్ స్టడీస్ ఫర్ ఆల్" పేరుతో అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే అంశాలపై 'టీ-సాట్' ప్రసారాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ మేరకు ఆయా పోటీ పరీక్షల పాఠ్యాంశాలపై సోమవారం నుంచి 5 నెలల పాటు 600 ఎపిసోడ్‌లు ప్రసారం చేయనున్నట్లు టీ-సాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. టీ-సాట్ నిపుణ చానల్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు, 3 గంటల నుంచి 4 వరకు, విద్య చానల్‌లో రాత్రి 8గంటల నుంచి 10గంటల వరకు ఈ ప్రసారాలు ఉంటాయని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొండపై కోలాహలం

» యాదగిరిగుట్టకు పోటెత్తిన జనం

భువనగిరి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసానికి తోడు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సుమారు 66వేల మంది క్షేత్ర దర్శనానికి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక, ఉచిత దర్శన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. కొండకింద వ్రత మండపాల్లో 1,547 జంటలు సత్యనారాయణ వ్రతాలను నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక దర్శనాలకు గంటన్నర, ధర్మదర్శనాలకు మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు చెప్పారు. కాగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.79,70,843 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



యాదగిరిగుట్ట ప్రధాన ఆలయంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ

విత్తన ధ్రువీకరణ సంస్థకు శాఖాపరమైన హోదా ఇవ్వాలి!

» తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విత్తన ధ్రువీకరణ సంస్థను వ్యవసాయ, సహకారశాఖ మాదిరిగా ఒక ప్రత్యేక విభాగం కింద పరిగణించి శాఖాపరమైన హోదా కల్పించాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన విత్తన ధ్రువీకరణ అధికారుల ఆత్మీయ సమ్మేళనంలో లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమమే జేఏసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. విత్తన ధ్రువీకరణ సంస్థలో ఉన్నత విద్యావంతులు పనిచేస్తున్నారని, సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. సంస్థ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా జేఏసీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి

» టిమ్స్‌లలో మార్పులు చేయాలి: ఎస్‌డబ్ల్యూఎఫ్

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద మహిళలకు కల్పిస్తున్న ఉచితబస్ ప్రయాణం అమలు కోసం కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆర్టీసీ యాజమాన్యానికి ఫెడరేషన్ అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీఎస్.రావులు విజ్ఞప్తి చేశారు. టిమ్స్ యంత్రంపై ఏర్పాటు చేసిన జీరో బటన్ సమస్యల కారణంగా నెలకు సుమారు 10 మంది కండక్టర్లు ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా టిమ్స్ యంత్రాలలోని సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేయాలని కోరారు. కండక్టర్ పొరపాటు లేకపోయినా ఉద్యోగం కోల్పోయే దుస్థితి ఏర్పడిందన్నారు. కాగా, ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన సుమారు 14వేల మంది కార్మికులకు 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాగా, గ్రాండ్ హెల్త్ చెకప్‌లో భాగంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోకుండా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు బుధవారంలోగా వైద్య పరీక్షలు పూర్తి చేయాలని అధికారులను యాజమాన్యం ఆదేశించింది.

సినీ నటుడు అలీకి నోటీసులు

నవాబుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు మొహ్మద్ అలీకి వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఎకమామిడి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అలీకి ఎకమామిడి గ్రామ పంచాయతీ రెవెన్యూ పరిధి సర్వే నెం.345లో వ్యవసాయ క్షేత్రం ఉంది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఆ వ్యవసాయ క్షేత్రంలో అలీ నిర్మాణాలు చేపడుతున్నారని అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు ఏమైనా ఉంటే తమకు సమర్పించాలని పేర్కొంటూ ఎకమామిడి పంచాయతీ కార్యదర్శి శోభారాణి ఈ నెల 5న తొలిసారిగా నోటీసులు జారీ చేశారు. అలీ నుంచి స్పందన లేకపోవడం, నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో 22వ తేదీన మరోసారి నోటీసులు జారీ చేశారు. అలీకి చెందిన వ్యవసాయ క్షేత్రంలోని సిబ్బందికి వాటిని అందజేశారు. మూడు రోజుల్లోగా స్పందించకుంటే పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వికలాంగుల పింఛన్ రూ.6 వేలు చేయాలి

» నేడు జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

» వికలాంగుల హక్కుల జాతీయ వేదిక వెల్లడి

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచి, అందించాలని ప్రభుత్వాన్ని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ విషయమై సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచి, అమలు చేస్తామని హామీనిచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా ఇప్పటికీ పింఛన్‌ను పెంచలేదని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పోలీసు నోటీసు

హుజూరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. దళితబంధు రెండో విడత డబ్బులు విడుదల చేయాలంటూ ఆయన ఈనెల 9న అనుమతులు లేకుండా హుజూరాబాద్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దాంతో ప్రజలకు అసౌకర్యం కలిగించినందుకుగాను 35(3) బీఎన్ఎస్ కింద పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. కౌశిక్‌రెడ్డితో పాటు మరికొంత మంది బీఆర్ఎస్ నాయకులకు ఎస్సై యూనస్ నోటీసులు అందజేశారు.

మత్తును పసిగట్టడమెలా?

» ట్రైనీ కానిస్టేబుళ్లకు పాఠాలు

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసుశాఖలో కొత్తగా చేరనున్న కానిస్టేబుళ్లకు వృత్తికి సంబంధించిన అంశాలతో పాటు డ్రగ్స్ కేసులకు సంబంధించి ప్రత్యేక శిక్షణను ఇచ్చినట్లు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు తెలిపారు. మత్తుమందులను గుర్తించడం, ఆ వ్యాపారానికి సంబంధించిన విషయాలు, డ్రగ్ పెడ్లర్లు, డీలర్లు, ఎలాంటి వారు మాదకద్రవ్యాలకు బానిసలవుతారు, వారిని గుర్తించడం ఎలా తదితర అంశాలపై శిక్షణనిచ్చినట్లు చెప్పారు. కాగా, ఈ ఏడాది 8వేల 47మంది స్టైపెండరీ క్యాడెట్ కానిస్టేబుళ్ల శిక్షణ ఇటీవలే పూర్తయింది. వీరిలో 2,338 మంది మహిళలున్నారు. వీరికి రాజ్ బహదూర్ వెంకటరామరెడ్డి పోలీసు అకాడమితో పాటు 19 ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణనిచ్చారు.



అమీర్‌పేటలోని సెస్ సభామందిరంలో జరిగిన విశ్వనాథ సాహిత్య పీఠం ద్విదశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

వేయిపడగలు చదవకుండా చనిపోతే గొప్ప కళానుభవం కోల్పోయినట్టే

» తెలుగు వర్సిటీ వీసీ నిత్యానంద రావు

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన వేయిపడగలు నవల చదవకుండా చనిపోతే గొప్ప కళానుభవం కోల్పోయినట్టేనని తెలుగు వర్సిటీ వీసీ నిత్యానంద రావు చెప్పారు. తెలుగు వారంతా ఇప్పటికీ తప్పకుండా చదవాల్సిన నవల వేయిపడగలేనన్నారు. అమీర్‌పేటలోని సెస్ సభామందిరంలో ఆదివారం జరిగిన విశ్వనాథ సాహిత్యపీఠం ద్విదశాబ్ది ఉత్సవాల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రోజంతా సాగిన సదస్సులో "విశ్వనాథ రచనల్లో హాస్య రసం", "తెలంగాణతో విశ్వనాథ అనుబంధం" తదితర అంశాలపై పలువురు సాహితీ విమర్శకులు, కవులు, రచయితలు కీలకోపన్యాసం చేశారు డెబ్బై ఐదేళ్ల కిందట తన ఆహ్వానం మేరకు కోఠి లోని వీవీ కాలేజీ కార్యక్రమంలో పాల్గొన్న విశ్వనాథ సత్యనారాయణ.. కార్ల్ మార్క్స్ శ్రమ సిద్ధాంతానికి, భగవద్గీతకు మధ్య సారూప్యతను వర్ణిస్తూ గంట సేపు అద్భుతంగా ప్రసంగించారని ఆనాటి విషయాలను వెల్చాల కొండలరావు గుర్తు చేసుకొన్నారు. విశ్వనాథ పీఠం ద్వారా సాహిత్య కృషి చేస్తున్న వెల్చాల కొండలరావు సేవలను కవిసామ్రాట్ మనుమడు విశ్వనాథ సత్యనారాయణ ప్రశంసించారు. కోస్తాంధ్ర వ్యవహార భాషావాదాన్ని వ్యతిరేకించిన కొంత మంది తెలంగాణ సాహితీవేత్తలకు విశ్వనాథ ఆలంబనగా నిలిచారని సీనియర్ ఎడిటర్ కె.శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ రాష్ట్రంలోని సహజీవన సంస్కృతిని విశ్వనాథ రచనల్లో ప్రతిబింబించారంటూ తెలంగాణతో కవిసామ్రాట్ తమకున్న అనుబంధాన్ని విశ్లేషిస్తూ మాట్లాడారు.

ధర్మబద్ధమైన విజ్ఞానం కావాలి

ధర్మంతోనే అస్తిత్వం కొనసాగుతుంది.. సమాజంలో ఏకత్వ భావన అవసరం: భాగవత్

» ముగిసిన 'లోక్‌మంథన్ భాగ్యనగర్'

» కేంద్ర మంత్రులు నిర్మల, షెకావత్ హాజరు

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ధర్మబద్ధమైన విజ్ఞానం అవశ్యకత ఎంతైనా ఉందని ఆరెస్సెస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ అన్నారు. భారతదేశంలో ధర్మం విజ్ఞానభరితమైందని, మరి విజ్ఞానం ధర్మసమ్మతమా, కాదా అని ఆలోచించాలని సూచించారు. ఆదివారం శిల్పకళా వేదికలో 'లోక్‌మంథన్ భాగ్యనగర్ 2024' ముగింపు కార్యక్రమంలో భాగవత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకం, సృష్టి, ధర్మం సనాతనమని, ఇవి కలిసే నడుస్తాయని, ప్రళయం వరకు ఉంటాయన్నారు. ఇవి కలిసి ఉంటేనే అస్తిత్వం కొనసాగుతుందన్నారు. ఏకత్వ భావన వుంటే అంతా మనదేనన్న భావన వస్తుందని చెప్పారు. మనం ధర్మం పేరుతో చాలా అధర్మాలు చేశామని, స్వార్థం పెరిగిపోయిందని, అందుకే దుర్బలులుగా మారిపోయామన్నారు. మనం సమాజాన్ని మనం సరిచేసే ప్రక్రియ కొనసాగకపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. శాస్త్రవేత్తలు ఇప్పటి వరకు కణాలు, జడత్వమని మాట్లాడారని, ఇప్పుడు చైతన్యమని అంటున్నారని భాగవత్ పేర్కొన్నారు. కానీ చైతన్యం అన్న అనుభూతి భారతీయుల వద్ద ఎప్పటి నుంచో ఉందని చెప్పారు. దీన్ని మరిచిపోయామని, ఈ విస్మృతి నుంచి బయటపడాలని సూచించారు. అడవుల్లో ఉండే వనవాసీలు వాటికి ధర్మకర్తలని, వాటిని సంరక్షిస్తారని, ధర్మంగా వ్యవహరిస్తారని కొనియాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ మనదేశంలో వనవాసీల పట్ల పురాతనకాలం నుంచీ వివక్ష లేదన్నారు. తమిళనాడులో కొన్ని సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాల్లో వనవాసీలు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారని చెప్పారు.



లోక్‌మంథన్ కార్యక్రమంలో పాల్గొన్న కిషన్‌రెడ్డి, నిర్మల, మోహన్ భాగవత్, షెకావత్

వనవాసీ, గ్రామవాసీ, నగరవాసీ అని అంటున్నా, మన మనసుల్లో మాత్రం భారతీయులమే అన్న భావన ఎప్పటి నుంచో ఉందన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, లోక్‌మంథన్ ఆహ్వాన సంఘం చైర్మన్ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని విశ్వగురుగా నిలిపేందుకు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశంలో ఆధ్యాత్మికత పెంపొందడంతో పాటు అభివృద్ధిని కొన్ని శక్తులు సహించలేకపోతున్నాయన్నారు. అరాచకం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ దేశంలో కుటుంబ వ్యవస్థ కుప్పకూలుతున్న తరుణంలో లోక్‌మంథన్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ధర్మంగా.. తాత్వికంగా గెలిచాం

'ధర్మంగా, తాత్వికంగా మనం గెలిచామ'ని మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై భాగవత్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. నిన్న, మొన్న ఎన్నికలు జరిగాయి కదా అని ఆయన చమత్కరిస్తూ ఓటమిని జీర్ణించుకోలేనివారు విమర్శలు చేస్తున్నారని అన్నారు. దేవుడి గురించి తెలిసిన వారు, తెలియని వారు కొంతమంది ఏళ్ల తరబడి పోరాటాలు చేసి అలసిపోయారని వ్యాఖ్యానించారు. 'బయటి నుంచి ప్రశ్నించేవారికి సమాధానం ఇచ్చే ఆట మనకు వద్దు. అలాంటి వారికి మనమెందుకు జవాబివ్వాలి? వారి మైదానానికి వెళ్లి వారి నియమాలకు అనుగుణంగా మనమెందుకు కబడ్డీ ఆడాలి? మన మైదానంలోకి ప్రపంచాన్ని తీసుకురావాలి. ఇదీ మన లక్ష్యం' అని భాగవత్ అన్నారు.

వైభవంగా ముగిసిన లోక్‌మంథన్

హైదరాబాద్ సిటీ: శిల్పారామంలో వైవిధ్యభరితమైన కళా ప్రదర్శనలతో నాలుగు రోజుల పాటు సాగిన లోక్‌మంథన్ ఆదివారం ముగిసింది. చివరి రోజు సంప్రదాయ వేదిక వద్ద తెలుగు రాష్ట్రాల కళారూపాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యాంఫీథియేటర్‌లో వివిధ రాష్ట్రాల కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. ఛత్తీస్‌గఢ్ కళాకారులు 75కు పైగా వాయిద్యాలతో దేశభక్తి గీతాలు, జానపద గేయాలను ఆలపించారు.

అమ్మ చనిపోయినా కూతుళ్లు రాలే..

» ముగ్గురున్నా ఒక్కరు రాలేదు

» ఆశ్రమంలోనే అంత్యక్రియలు

» కరీంనగర్ జిల్లాలో హృదయవిదారక ఘటన

రామడుగు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడుకు మూర్ఖుడైనా, కూతురుంటే కనీసం అన్నం పెడుతుందంటారు. అందుకే సంతానంలో ఒక్క ఆడపిల్లైనా ఉండాలని పెద్దలు చెబుతుంటారు. కానీ ముగ్గురు ఆడపిల్లలుండి కూడా తమ కన్న తల్లి చనిపోతే కనీసం చూడటానికి రాని హృదయ విదారక ఘటన కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామంలో జరిగింది. మండలంలోని వెదిర గ్రామానికి చెందిన దుర్గమ్మ(65)... భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. ఆమెకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అందిరికి వివాహం చేసింది. ఆమెకు సొంతంగా ఇళ్లు కూడా లేదు. కొంతకాలం పాటు స్థానికంగా కూలి పనులు చేసుకుంటూ జీవితం వెళ్లదీసింది. వృద్ధాప్యం మీద పడి పనులు చేసుకోలేని స్థితికి చేరుకున్నా కూడా కూతుళ్లు ఆమెను చేరదీయలేదు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో తనను కూతుళ్లు పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని దుర్గమ్మ రామగుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. పోలీసులు కూతుళ్లకు ఫోన్ చేస్తే తమకు తల్లికి సంబంధం లేదంటూ సమాధానం చెప్పారు. దీంతో పోలీసులే వెలిచాల గ్రామంలోని స్పందన అనాథ ఆశ్రమంలో చేర్పించారు. అయితే దుర్గమ్మ ఇటీవల అనారోగ్యం బారిన పడింది. దీంతో ఆశ్రమ నిర్వాహకులు కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి ఆదివారం ఆమె మృతిచెందింది. మృతివార్తను కూతుళ్లకు ఆశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్ తెలియజేసినా వారు రాలేదు. దీంతో శ్రీనివాసే దుర్గమ్మకు దహన సంస్కారాలు నిర్వహించారు.

జిల్లా కోర్టుల వరకు తెలుగే!

వాడుక భాషగా ప్రవేశపెడితే మనుగడ

» జీవన సాఫల్యం మొత్తం భాషలోనే ఉంది

» మన కంటే ప్రవాసీల తెలుగు మెరుగు

» సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నర్సింహ

» తాలూకా కోర్టుల్లో 31 ఈ-సేవ కేంద్రాలతో పాటు కృత్రిమ మేధ టూల్స్ శ్రుతి, సారాంశ్, పాణిని ప్రారంభం

హైదరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): "జిల్లా స్థాయి కోర్టు వరకు తెలుగును వాడుక భాషగా ప్రవేశపెడితే.. మనుగడలోకి వస్తుంది. జాతీయ న్యాయ కళాశాలల్లోని విద్యార్థులకు తెలుగు నేర్చుకోవాలని, జిల్లా కోర్టులో తెలుగులో వాదించాలని చెబుతున్నాం. ఒక్కసారి భాష వాడుకలోకి వస్తే అది మళ్లీ మన జీవితంలోకి ప్రవేశిస్తుంది" అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నర్సింహ అన్నారు. భాషను కోల్పోయిన నాడు మనం సర్వం కోల్పోయినట్లేనని.. ఇలాంటి భయం ఉన్నవాళ్లు మళ్లీ దాన్ని జీవన గమనంలోకి తీసుకొస్తారని పేర్కొన్నారు. తాలూకా స్థాయి కోర్టుల్లో ఏర్పాటు చేసిన 31 ఈ-సేవ కేంద్రాలు, న్యాయాధికారులకు నిత్య జీవితంలో ఉపయోగపడే కృత్రిమ మేధ (ఏఐ) టూల్ సర్వీసులను ఆదివారం సికింద్రాబాద్‌లోని జ్యుడీషియల్ అకాడమీలో హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధేతో కలిసి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలామంది ప్రవాసు తెలుగు వారు మన కంటే మంచి తెలుగు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. కానీ, మనం మాత్రం చాలా తేలికగా తీసుకుంటూ నిర్లక్ష్యం చేస్తున్నామని అన్నారు. "తెలుగు రాష్ట్రాల్లో మాట్లాడే తెలుగును సరళత్వం, కచ్చితత్వం వల్ల సులభంగా వాడుకలో ఉంచే అవకాశం ఏర్పడుతుంది. వాడుక లేకనే భాషను కోల్పోతున్నాం. భాష వాడుకను డబ్బు సంపాదనతో ముడిపెడుతున్నాం. తెలుగు నేర్చుకుని చేసేది ఏముంది? వృత్తిలో వచ్చినట్లు డబ్బు రాదు కదా? అనే ఆలోచనలో ఉండడంతో భాష కనుమరుగవుతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. "మనం ఏమిటి అనేది మనం మాట్లాడే భాష ద్వారా నిర్ధారణ అవుతుంది. మన సంస్కృతి, ఆలోచనా విధానం, భావ స్వేచ్ఛ, జీవితంలో



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నర్సింహ. చిత్రంలో హైకోర్టు సీజే అలోక్ అరాధే

ముఖ్య లక్షణాలన్నీ భాషతోనే అనుసంధానమై ఉంటాయి. కన్న తల్లి ప్రేమ విలువ ఆమె ఉన్నప్పుడు తెలియదు. భాషను కోల్పోయినప్పుడు కూడా అంతే. భాషను రక్షించుకోవడం అంటే దానిని ఉపయోగించడమే అని తెలుసుకుంటాం" జస్టిస్ పమిడిఘంటం శ్రీ నర్సింహ తెలిపారు. భాష ఉపయోగాలు నమ్మశక్యం కానివని.. న్యాయ వ్యవస్థలో స్థానిక ప్రజలను అనుసంధానించేది కాబట్టి దానికి ప్రాధాన్యం ఉంటుందని వివరించారు.

వచనం.. సారాంశం.. అనువాదం..

కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్ 'శ్రుతి, సారాంశ్, పాణిని'లను జస్టిస్ పమిడిఘంటం శ్రీ నర్సింహ ప్రారంభించారు. శృతి.. ప్రసంగాన్ని వచనం(టెక్ట్స్)గా మార్చుతుందని, సారాంశ్ కీలక తీర్పుల సారాంశాన్ని వెల్లడిస్తుందని, పాణిని తెలుగులోకి అనువాదం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ-సేవ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఇల్లందు, వేములవాడ తదితర తాలూకాల పేర్లను విన్నప్పుడు తాను అక్కడ వాదించిన కేసులు, స్మృతులు గుర్తుకొచ్చాయని పేర్కొన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. ఈ-సేవ కేంద్రాలు సాధారణ ప్రజల, న్యాయ వ్యవస్థ మధ్య దూరాన్ని తగ్గిస్తాయని తెలిపారు. జిల్లా కోర్టుల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన కేంద్రాలకు ఇవి అదనమని చెప్పారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులందరూ పాల్గొన్నారు.

మోసం చేసి.. విజయోత్సవాలా?

» కూలిందన్న కాళేశ్వరమే.. కాంగ్రెస్‌కు దీపమైంది

» దళితబంధు ఇవ్వాలని అడిగితే అరెస్టు చేస్తారా..?

» లగచర్ల విషయంలో రేవంత్ అబద్ధాలు: హరీశ్



హుజూరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగానికి రేవంత్‌రెడ్డి ఇచ్చిన తొవి(?)స్తది హామీల్లో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు కాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రైతులను అన్ని విధాలా మోసం చేసిన ప్రభుత్వం విజయోత్సవాలు ఎలా నిర్వహిస్తుందో చెప్పాలని నిలదీశారు. మహారాష్ట్ర ఫలితాలు కాంగ్రెస్‌కు గుణపాఠమని, ఇకనైనా రేవంత్‌రెడ్డి బుద్ధి తెచ్చుకొని ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆదివారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిన విషయాన్ని మహారాష్ట్ర ప్రజలు గమనించారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఎక్కడికెళ్లి ప్రచారం చేసినా అక్కడ కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయమని ఎద్దేవా చేశారు. అబద్ధాలు ఆడటంలో ఆయనకు డబుల్ పీహెచ్‌డీ ఇవ్వొచ్చని అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని చెప్పి.. మరచిపోయారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ఓర్వలేక అది కూలిపోయిందని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేశారని.. నేడు కాళేశ్వరమే కాంగ్రెస్‌కు దీపమైందని చెప్పారు. ఒకవైపు ముఖ్యమంత్రి కాళేశ్వరం కూలిందంటుంటే మరోవైపు మంత్రులు గడచిన పదేళ్లలో తెలంగాణలో అత్యధికంగా పంటలు వచ్చాయని చెబుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటికి 30 లక్షల టన్నుల పంట పండితే.. కేసీఆర్ పాలనలో పదేళ్లలో కోటీ 54 లక్షల టన్నుల పంట పండిందని పేర్కొన్నారు. లగచర్ల విషయంలో ముఖ్యమంత్రి అబద్ధం ఆడటం సిగ్గుచేటన్నారు. జూలై 19న ఫార్మా సిటీకి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు అని ఎలా చెబుతారని ప్రశ్నించారు. పచ్చని పొలాలను మింగి ఫార్మాసిటీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రెండో విడత దళితబంధుపై ఫ్రీజింగ్ ఎత్తివేసి వెంటనే లబ్ధిదారుల అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని కోరారు. దళితబంధు కోసం హుజూరాబాద్‌లో ధర్నాకు దిగిన దళిత కుటుంబాలను అరెస్టు చేయడాన్ని ఖండించారు. దళితబంధు రెండో విడత డబ్బులు ఇచ్చే విషయంలో అసెంబ్లీలో మాట్లాడతానని హరీశ్‌రావు తెలిపారు.

29న దీక్షా దివస్: కేటీఆర్



హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సందర్భంలో కేసీఆర్ చేపట్టిన దీక్షను స్ఫూర్తిగా తీసుకుని.. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించడానికి మరో సంకల్ప దీక్ష చేపట్టాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. 33 జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో 29న దీక్షా దివస్‌ను నిర్వహించేందుకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు తెలిపారు. ఇందుకోసం 26న సన్నాహక సమావేశాలు, 29న నిమ్స్‌లో అన్నదాన కార్యక్రమం చేపడతామన్నారు. కేసీఆర్ దీక్ష విరమించిన డిసెంబరు 9న మేడ్చల్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. దీక్షా దివస్ కార్యక్రమానికి మాజీ సీఎం కేసీఆర్ హాజరుకారని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ కార్యక్రమాలని కేటీఆర్ వెల్లడించారు. రేవంత్‌రెడ్డిది నోరైతే నిజాలు వస్తాయని.. మూసీ అయితే మాయ మాటలే వస్తాయని కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

» స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదాం: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం భారతదేశ చరిత్రలో ఎక్కడాలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ప్రారంభించలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, వారి అసమర్థతను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రతిగ్రామంలో సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి కేసీఆర్ హయంలో ఎలా ఉంది? ప్రస్తుతం ఎలాఉందనే అంశాలను ప్రజలకు చెప్పాలన్నారు. కాగా, అంతకుముందు యునైటెడ్ ఫూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి, బీసీ కుల సంఘాల ప్రతినిధులతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీ కులగణన కమిషన్‌కు ఇచ్చే నివేదిక, ఇతర అంశాలపై ఆమె చర్చించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.